మన సమగ్ర

ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రాజన్న సిరిసిల్ల | మంగళవారం | 08.09.2026 | సంపుటి : 01 | సంచిక : 250 | పేజీలు : 12 | వెల : 2/-

RAJANNA SIRICILLA | TUESDAY | 08.09.2026 | Volume : 01 | Issue :250 | Pages : 12 | Cost : 2/-

Wanted Reporters

తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్ నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా

విలేఖరులు కావలెను

(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత)

Ph: 9440032006

రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తాం

'గ్లోబల్ సమ్మిట్'పై సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్ సెప్టెంబర్ 7 : 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ – తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు

మిగతా2లో...

కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- సర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 7 : తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది

మిగతా2లో...

పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

- గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు

న్యూఢిల్లీ, 7 : వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిన్టికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును

మిగతా2లో...

తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

హైదరాబాద్ సెప్టెంబర్ 7 : మరోసారి సమగ్ర ఓటర్ జాబితా(సర్) ప్రక్రియ గడువును ఎన్నికల సంఘం పెంచింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఉన్న గడువును పొడిగించింది. ముందుగా ఈ నెల 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు

మిగతా2లో...

మహిళా ఎమ్మెల్యేలపై దాడికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత

- పోలీసులపై చర్యలు తీసుకోవాలి :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం
- ఇదేనా ఇందిరమ్మ ప్రజాపాలన ?
- బీఏసీ సమావేశం బహిష్కరణ

హైదరాబాద్ సెప్టెంబర్ 7 : మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సీఎం రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) అన్నారు. సీఎం క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టబోమని చెప్పారు. ఆడబిడ్డల చీరలు లాగి గొంతులు పట్టి జుట్టు లాగడమే ఇందిరమ్మ ప్రజాపాలన అని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వెయ్యి రోజుల ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామనే భయంతోనే ప్రభుత్వం తమను అడ్డుకుందని చెప్పారు. రాహుల్‌గాంధీకి ఒక నిబంధన, తమకు మరో నిబంధన వర్తిస్తుందా?అని

మిగతా2లో...

ఆరావళి కొండల నిర్వచనం.. హైపవర్ కమిటీ గడువు పొడిగింపు

హైదరాబాద్ సెప్టెంబర్ 7 : ఆరావళి కొండల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణపై సుప్రీంకోర్టు హైపవర్ కమిటీ(హెచ్‌పీసీ)ని నియమి ంచిన విషయం తెలిసిందే. సదురు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక సమర్పణపై గడువు పొడిగించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం ఈ ఏడాది నవంబర్ 30 వరకు ధర్మాసనం

మిగతా2లో...

ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి
- 22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ
- వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 7 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ

మిగతా2లో...

తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 7 :శాసనసభ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. దళిత వ్యక్తిని ప్రతిపక్ష నేతగా

మిగతా2లో...

అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

- రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు

అసెంబ్లీలో స్పీకర్ కంటతడి

హైదరాబాద్ సెప్టెంబర్ 7: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు, మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్‌ను కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంఘీ భావం తెలిపారు. ఈక్రమంలోనే స్పీకర్ భావోద్వేగానికి గురైయ్యారు. స్పీకర్ గౌరవాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బీజేపీకి కూడా బాధ్యత ఉందని చెప్పారు. బీజేపీ నేతలు సభకు సహకరించాలని కోరారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అవమానిం చడంపై బీజేపీ వైఖరి చెప్పాల ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఇష్టారాజ్యంగా వ్యవ హ రిస్తున్నారని ధ్వజ మెత్తారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయ డం దుర్మా ర్గమని అన్నారు. అధికా రంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ రూల్స్ పాటించలేదని.. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ రూల్స్ పాటించట్లేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహించారు. అయితే, స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను సీఎంవో విడుదల చేసింది.

మహిళా ఎమ్మెల్యేలపై దాడికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. దళిత, మహిళా వ్యతిరేకి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. దళితులపై చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?అని సవాల్ విసిరారు. ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించామనీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్లకు వెళ్తామని అన్నారు. సీఎం కూడా ఎమ్మెల్యేనే అనీ, స్పీకర్ పక్షపాత వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు.నెలరోజులపాటు అసెంబ్లీ సమావేశాలను నడపాలని కోరారు.

యాదవరెడ్డి, జగదీశ్‌రెడ్డి, శంభీపూర్ రాజు, సంజయ్, హరీశ్‌రావుతోపాటు తనను కూడా పోలీసులు గాయపరుస్తూ ఈడ్చుకుంటూ తీసుకెళ్లారని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

జగదీశ్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన తోపులాటలో అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రితో చికిత్స పొందుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీమంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది.

ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూని స్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు.దున్నేవాడితే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూని స్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు.

బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.

ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృధా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు.

రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు.

దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు.

బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు.

నియమ నిబంధనలకు అనుగుణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు.

పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరిగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.
ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు.పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

హైదరాబాద్ సెప్టెంబర్ 7 : తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఉద్రిక్తతల పై రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఎమ్మెల్యేలపై పోలీసులు చర్యలు తీసుకో వద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మెల్యే లపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను గుర్తించాలని, ఈ ఘటనపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ అంశంలో డిజిపి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చూడలేకపోతున్నారని సీఎం అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక ఆలోచనను సరిదిద్దకపోతే భవిష్యత్ తరాలు ఈ సభను క్షమించవన్నారు. ఈ రకమైన అవమానం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశానికి సంబంధించి కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. స్పీకర్ చైర్‌ను అభ్యంతరకర భాష మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలన్నారు. తాతా మధుతో రాజీనామా చేయించాలని.. లేకపోతే బర్తరఫ్ చేయాలన్నారు. తాము ఏం మాట్లాడినా వెనుక కేసీఆర్ ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోసారి సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

పొడిగించినట్లు తెలిపింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం పూర్తైన తర్వాత నవంబర్ 9న తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

ఆరావళి కొండల నిర్వచనం.. హైపవర్ కమిటీ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

గడువు ఇచ్చింది. ఫిబ్రవరి 2027 వరకు గడువు పొడిగించాలన్న కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అవసరమైతే కమిటీ "పగలు రాత్రి" పనిచేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.
ఇకపై ఎలాంటి పొడిగింపు ఇవ్వబోమని స్పష్టం చేసింది. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన వర్గాలతో సహా సంబంధిత వర్గాలన్నింటి వాదనలు వినాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి హెచ్‌పీసీ మరో ఆరు నెలల సమయం కోరింది. ఈ విషయంపై తదుపరి విచారణ డిసెంబర్ 2న జరగనుంది.

రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి చర్చించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఏక్స్ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు.సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులకు సమర్థవంతంగా ప్రదర్శించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో సమయపాలనతో కూడిన కార్యాచరణను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు

హైదరాబాద్:సెప్టెంబర్ 7 శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు.పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా
12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు

బాఘ్‌పత్,సెప్టెంబర్ 7 : ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణి కుల తో వెళు తున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయ పడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగి స్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

రిడేపల్లిలో డివిజన్ స్థాయి SGF కబడ్డీ పోటీలు

గరిడేపల్లి సెప్టెంబర్ 7(ప్రజావాణి) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు ఈ నెల 10, 11 తేదీల్లో గరిడేపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు గరిడేపల్లి మండల విద్యాధికారి చత్రూ నాయక్ తెలిపారు.పోటీల నిర్వహణకు పాఠశాల క్రీడామైదానాన్ని డోజర్ సహాయంతో చదును చేసి సిద్ధం చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన అండర్-14, అండర్-17 బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటుకోనున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు గరిడేపల్లి మండల విద్యాధికారి చత్రూ నాయక్ తెలిపారు.

అక్రమ నిర్బంధాలు,అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు..

● బి జె వై ఎం నాయకులు సోగాల మనోజ్ కుమార్

మద్దూరు సెప్టెంబర్ 7, ప్రజావాణి,15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఇచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి వెళ్తున్న బి జె వై ఎం నాయకులు సోగాల మనోజ్ కుమార్ ను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం విద్దూరంగా ఉందనీ.మనోజ్ కుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా 40 లక్షల మంది తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థుల హక్కుల సాధనకై ధర్నా చౌక్ లో 'విద్యార్థి మహాధర్నా'కు పిలుపునిస్తే.. భయంతో వణికిపోయి అనుమతి నిరాకరించిన ఈపిరికి, నియంత కాంగ్రెస్ సర్కారుకు విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తాం ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. విద్యార్థుల పక్షాన బిజెపి పోరాటం ఆగదనీ స్పష్టం చేశారు.ఈ అహంకార ప్రభుత్వ మెడలు వంచేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదు అన్నారు..విద్యార్థుల భవిష్యత్తుపై మీ ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, వారి గొంతు వినడానికి ఎందుకు భయపడుతున్నారని నిరసనను అణచివేయడం కాదు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలకు పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు.

కూటిగల్ నల్ల చెరువు కబ్జాపై "ప్రజావాణిలో" పిర్యాదు

మద్దూరు సెప్టెంబర్ 7, ప్రజావాణి,ధూళిమిట్ట మండల కేంద్రములో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో కూటిగల్ గ్రామ సర్పంచ్ దాసారం బాలకృష్ణ ఆధ్వర్యంలో మరియు ముదిరాజ్ కుల సంఘం గ్రామస్తుల ఆధ్వర్యంలో మన గ్రామ జీవానదారమైన నల్ల చెరువులో కోందరు వ్యక్తులు బొర్లు మరియు కడిలు పాతుకుంటు కబ్జా గురిచెస్తున్నారనీ చెరువును సంరక్షించాలని వినతి పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ హౌస్ అరెస్టును ఖండించిన మాజీ కార్పొరేటర్ శ్రీవాణి

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 7 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం కాంగ్రెస్ సర్కార్ కు ఇక తప్పదు గుణపాఠం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా తెలంగాణ విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తూ, వారి ఆశల మీద నీళ్లు చల్లుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ తీరును ఎండగడుతూ బీజేపీ తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా నిరోధించడానికి ఈ రోజు ఉదయం నుండి రామంతాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు పోలీసులు అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడం జరిగింది.విద్యార్థుల న్యాయమైన డిమాండ్ కోసం పోరాడుతున్న బీజేపీ నాయకులను, కార్యకర్తలను ఇలా నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వ భయానికి, అసమర్థతకు నిదర్శనం. విద్యార్థులకు బాకీ ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయకపోతే రాబోయే రోజుల్లో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాము.ఈ అక్రమ హౌస్ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నాము.

పేద వృద్ధ మహిళలకు మదురమ్మ ట్రస్ట్ చీరల పంపిణీ

తేదీ 7 -9 -2026 హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. హుజురాబాద్ మండలంలోని శాలపల్లి - ఇందిరానగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సూచించిన 40 మంది పేద వృద్ధ మహిళలకు చీరలను ట్రస్టు నిర్వాహకులు సామాజిక కార్యకర్త, డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ సర్పంచ్ కోడిగూటి కిరణ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వృద్ధుల గురించి మాట్లాడుతూ వృద్ధులకు సమయానికి ఆహారం అందేలా చూడాలని, ఆరోగ్య సమస్యలు ఎప్పటికప్పుడు చూడాలని, వారి శేష జీవితము సంతోషంగా గడిపేలా చూడడం మన బాధ్యత అని తెలుపుతూ మదురమ్మ ట్రస్ట్ వారుప్రతి సంవత్సరము పేదలకు చేరాలని పంపిణీ చేయడం అభినందనీయ మని, మా గ్రామ పేద వృద్ధ మహిళలకు చీరలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కే శ్రీధర్ రెడ్డి, జీవన్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏపీ.ఎం.పీ.ఏ యూనియన్ ప్రెస్ కార్యాలయం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు

వత్సవాయి సెప్టెంబర్ 07 మన ప్రజావాణి :మండల కేంద్రంలో ఏపీ.ఎం.పీ.ఏ యూనియన్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రెస్ యూనియన్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యూనియన్ నాయకులు, సీనియర్ జర్నలిస్టుల సమక్షంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.ఏపీ.ఎం.పీ.ఏ యూనియన్ జిల్లా అధ్యక్షులు కళ్యాణపు సూర్య ప్రకాష్ జగ్గయ్యపేట ఏపీ.ఎం.పీ.ఏ అధ్యక్షులు కాకరపర్తి రమేష్, వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారి (ఎం.పీ.డీ.ఓ) బి. రాజు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు దారెల్లి చిరంజీవి హాజరై నూతన ప్రెస్ యూనియన్ కార్యాలయం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన ప్రెస్ యూనియన్ కార్యాలయం అభివృద్ధికి అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏపీ.ఎం.పీ.ఏ సభ్యులు కరిశ మధు, గడ్డం రాంబాబు, ఉమా, నరేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
వత్సవాయి మండల ఏపీ.ఎం.పీ.ఏ యూనియన్ అధ్యక్షులుగా కుక్కల బాబు, ఉపాధ్యక్షులుగా అన్నెపాక హరీష్, జనరల్ సెక్రటరీ గుడేటి దాసు, జాయింట్ సెక్రటరీ బండ్ల సతీష్, ట్రెజరర్‌గా బంకా జగదీశ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
యూనియన్ సభ్యులు మాగి ముకేష్, గుడేటి మధు, మేడి సిలవరాజు తో పాటు పలువురు మీడియా ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు కార్యక్రమంలో పాల్గొన్నారు.నూతనంగా నిర్మించిన యూనియన్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల ఐక్యతకు, పరస్పర సహకారానికి, ప్రజా సమస్యలను సమర్థవంతంగా వెలుగులోకి

తీసుకురావడానికి ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఏపీ.ఎం.పీ.ఏ యూనియన్ ఆధ్వర్యంలో నూతన ప్రెస్ క్లబ్‌ను అద్భుతంగా నిర్మించి ప్రారంభించడం పట్ల కార్యక్రమానికి హాజరైన అతిథులు, మీడియా ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు యూనియన్ నాయకత్వాన్ని అభినందించారు.మీడియా ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా,ఘనంగా,దీదీప్యమానంగా విజయవంతమైంది.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఆందోళన

● ఏపీయుడబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 07 ప్రజా వాణి జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ వి సుబ్బారావు తెలిపారు. అనంతపురంలోని ప్రెస్ క్లబ్ లో ఇవాళ జరిగిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 2న కోరికల దినోత్సవం పాటిస్తామని అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే దశల వారి ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఐజేయూ ప్లీనరీ లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళామని.... సీఎం వెంటనే స్పందించి సీఎంవో కు పంపారు అని గుర్తుచేశారు. సీఎంఓ గతంలో రద్దైన యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు అని సుబ్బారావు చెప్పారు. ప్రభుత్వం కట్టే డబ్బు విషయం క్యాబినెట్ చర్చ కు వెళ్లాల్సి ఉందని... ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం అయితే ఐ అండ్ పీఆర్ కు కేటాయించే బడ్జెట్ లో కడతామని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారని చెప్పారు. హౌసింగ్ స్కీమ్ ప్రతిపాదనలో ఉందని చెప్పారు. అందరికీ ఇళ్ళు ఇస్తామని చెప్పారని... రూ.100 కోట్లు వెల్ఫేర్ ఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తోందన్నారు. రిటైర్డ్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, బీహార్, కేరళ ఇతర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ఇచ్చిన విధంగా రిటైర్డ్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించాలన్నారు. 58 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరికి

పింఛన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర లో జర్నలిస్టుల రక్షణ కోసం చట్టాన్ని తీసుకు వచ్చింది.. ఆ తరహాలో ఆంధ్ర ప్రదేశ్ తో పాటు దేశ వ్యాప్తంగా రక్షణ చట్టం తీసుకురావాలని కోరుతున్నాం అని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల్లో 2 శాతం నిధులు జర్నలిస్టుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి... తద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. హెల్త్ కార్డు అమల్లో ఉన్న లోపాలను సరిచేసి అన్ని ఆసుపత్రిలో అమలయ్యే విధంగా కో ఆర్డినేషన్ కమిటీ లు జిల్లాల వారిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్ళామని.. అమలులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, అధికారులు, జర్నలిస్టులతో, ప్రభుత్వం కలసి కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. అక్టోబర్ 2న కోరికల దినోత్సవం నిర్వహిస్తున్నాం. జర్నలిస్టులకు రక్షణ చట్టం కోసం, ఇళ్ల స్థలాల కోసం దేశ వ్యాప్తంగా అందోళనలు చేపట్టబోతున్నాం. అందరూ స్పందించి జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేయాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి

డిమాండ్స్ పరిస్కరించక పోతే.. దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తాం అన్నారు. అవసరం అయితే గతంలో మాదిరి అమరావతిలో పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని హెచ్చరించారు. జిల్లాలో ఏపీయూడబ్ల్యూజే బలోపేతం కోసం అందరూ కలసి కట్టుగా కృషి చేయాలి అన్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో యూనియన్ సభ్యుల విజయానికి కృషి చేయాలి అని తెలిపారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈఎన్ రాజు, జాతీయ కౌన్సిల్ సభ్యులు సనప రామకృష్ణ, నాగరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాల రంగారెడ్డి, కేపీ కుమార్, చలపతి, జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆయుఫ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు భోగేశ్వర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్ర నాథ్ రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇంచార్జి విజయ్ భాస్కర్ రెడ్డి, బ్యూరో రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, ప్రభాకర నాయుడు, ట్రెజరర్ చౌదప్ప, జిల్లా కమిటీ సభ్యులు పట్టపోగుల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కురవి లో ప్రభుత్వ భూములకు రక్షణ ఏదీ?

- ప్రభుత్వ భూములకు రక్షణ
- భూ కబ్జాలకు అడ్డుకట్ట
- 177పై సమగ్ర సర్వే
- హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- కలెక్టర్ చొరవ చూపాలి.

డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి , సెప్టెంబర్ 7 ప్రజావాణి: కురవి మండల కేంద్రం లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

భూ కబ్జాలకు అడ్డుకట్ట
కురవి మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో వీరబాబుకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విలువైన ప్రభుత్వ భూములను కొందరు బోగస్ పత్రాలతో ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమణలు పెరుగుతున్నాయని అన్నారు.
177పై సర్వే చేయాలి
177 సర్వే నంబర్‌తో పాటు కురవి గ్రామ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూములన్నింటినీ జిల్లా సర్వేయర్‌తో సమగ్రంగా సర్వే చేయించాలని కోరారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలు, హరిత హోటల్, మహిళల పెట్రోల్ బంక్‌లకు స్థలాలు కేటాయిస్తామని అధికారులు చెప్పిన నేపథ్యంలో ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా గుర్తించాలని అన్నారు.
హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి
ప్రభుత్వ భూములకు హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్‌ను కోరారు. ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థలో ఉండగా, ఎస్సీ హాస్టల్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు బుడమ వెంకన్న, దూది కట్ల సారయ్య, కన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ బాబును విమర్శిస్తే సహించేది లేదు

- అభివృద్ధి సహించలేకే అసత్య ఆరోపణ
- బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం
- జిల్లా అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్

మన ప్రజావాణి. మంథని ప్రతినిధి. మంథనినియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని సహించలేకనే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని జిల్లా అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్ మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబును విమర్శిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు సహించేది లేదని హెచ్చరించారు.
సోమవారం మంథనిలో ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల విస్తరణ, కాళేశ్వరం ఆలయ అభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు.
అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అన్ని నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు.
యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.

మంథని నియోజకవర్గంలో నిరుద్యోగులకు ప్రత్యేక ఉచిత శిక్షణ ఇస్తూ అనేక మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించామని ప్రస్తుతం హైదరాబాదులో నియోజవర్గం నుండి 100 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించిన ఘనత మంత్రి శ్రీధర్ బాబు దేనని అన్నారు. శ్రీధర్ బాబు తండ్రి గొప్పవాడు కాబట్టే ఆయన తండ్రి పేరు చెప్పుకొని ఆయన ఆశయాలు సాధించేందుకే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రతిపక్షంలో ఉన్న నాయకులు హుందాగా విమర్శించాలని, ప్రజా సమస్యలపై ప్రశ్నించా లే తప్ప వ్యక్తిగతంగా దూషిస్తే మాత్రం సహించేది లేదన్నారు.మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తన హయాంలో మంథనికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మంథని నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యేగా ఐదు సంవత్సరాలు, జడ్పీ చైర్మన్ గా ఐదు సంవత్సరాలు అవకాశం ఇస్తే పదేళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయడం చేతకాక వేల కోట్ల రూపాయలతో మంతిని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న మా నాయకుడిని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. నాడు మంథనిని అభివృద్ధి చేయలేదని, ఇప్పుడు అభివృద్ధి జరుగుతుంటే చూసి ఓర్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.మంథని ప్రజలు మంత్రి శ్రీధర్ బాబు వెంటే ఉన్నారని, అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని సెగ్గం రాజేష్ అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, ఐఎన్టియూసి జాతీయ కార్యదర్శి పేరవేన లింగయ్య యాదవ్,కౌన్సిలర్ ఎల్లంకి వంశీ, కాంగ్రెస్ నాయకులు లైశెట్టి రాజు, ఇందారపు అనిల్ ,అక్కపాక సంపత్, మంథని శ్రీనివాస్, పంచిక దేవేందర్ లు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు..? ఆరు గ్యారంటీలు ఎక్కడ..? 420 హామీల సంగతేంటి..?

- వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం.
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ.
- రైతు భరోసా నుంచి యువ వికాసం వరకు.. అన్నింటిపైనా నిలదీత.
- ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: బీఆర్ఎస్, నాయకులు.

కేసముద్రం, సెప్టెంబరు 7, ప్రజావాణి.ఆరు గ్యారంటీలు.. 420 హామీలు.. వెయ్యి రోజుల పాలన! అయినా ప్రజల ఆశలు నెరవేరాయా..? రైతుకు భరోసా దక్కిందా..? నిరుద్యోగికి ఉద్యోగం వచ్చిందా..? పేదవాడికి ఇల్లు అందిందా..? మహిళలకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలయ్యాయా..? అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కేసముద్రం మండల నాయకులు ప్రశ్నించారు.సోమవారం కేసముద్రం ప్రజావాణిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు.

'హామీల వర్షం.. అమలులో కరువు'.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని డిమాండ్ చేశారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలలో అర్హులకు ప్రయోజనం కల్పించాలని కోరారు.

'అన్నదాత పరిస్థితి ఏంటి?'

రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని, రైతు బీమా ప్రీమియం సమస్యను పరిష్కరించాలని కోరారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

'యువతకు ఉద్యోగాలు.. విద్యార్థులకు బకాయిలు ఎప్పుడు?'

యువ వికాసం కింద ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని అన్నారు.

'ప్రశ్నిస్తే అణచివేత ఎందుకు?'

వెయ్యి రోజుల పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు వెనుకబడ్డాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. నాణ్యమైన విద్యుత్, వైద్యం ప్రజలకు అందడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధుల పట్ల పోలీసు బలగాలతో వ్యవహరించడం హేయమైన చర్య అని మండల బీఆర్ఎస్ నాయకులు ఖండించారు.ఇకనైనా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలి. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. లేదంటే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని వారు హెచ్చరించారు.కేసముద్రం మండలంలోని రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు, వృద్ధుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

కూసుమంచి చౌరస్తాలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ప్రజాస్వామ్య యుతంగా ప్రజల గొంతుకను వినిపించాల్సిన అసెంబ్లీ సమావేశాలకు బి ఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను వెళ్లకుండా పోలీసుల బలవంతపు అరెస్టులతో అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై బిఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అణచివేత ధోరణికి నిరసనగా పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి కూసుమంచి మండల కేంద్ర చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంపై దాడి: ప్రజాప్రతినిధులపై నిర్బంధాలు ప్రయోగించి, శాసనసభలో ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికే మచ్చ.హక్కుల కాలరాపడమే ధ్యేయం: ప్రతిపక్ష గొంతు నొక్కడం ద్వారా తమ విఫల పాలనను కప్పిపుచ్చుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ అవలంబిస్తున్న ఈ రౌడీయిజం, పోలీస్ మార్క్ అణచివేత ధోరణి ఎక్కువ కాలం సాగదని, రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు

- ప్రభుత్వ భూములు కాపాడాలి
- ఎస్సీ బాలికల వసతిగృహాన్ని నూతన భవనం లోకి మార్చాలి.

డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్7 ప్రజావాణి : కురవి మండల కేంద్రంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్‌కు దళిత అవార్డు గ్రహీత, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు దైద భద్రయ్య, వార్డు సభ్యుడు నూతకి సాంబశివరావు, సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత కిన్నెర మల్లయ్య, మాజీ వార్డు సభ్యుడు ఇరుగు వెంకన్న లు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సమస్యలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కురవి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, భద్రతా సదుపాయాలు కలిగిన భవనంలోకి మార్చాలని కోరారు. విద్యార్థినుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అదేవిధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల కబ్జాలు, అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ ఆక్రమణలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా సర్వే నంబర్ 177లోని ప్రభుత్వ భూములను పరిరక్షించి, అవి అక్రమంగా చేతులు మారకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్మీపుత్రుడు బిరుదుతో ఎదిగి కేసీఆర్‌కే వెన్నుపోటు పొడిచిన పోచారం

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్.
- అధికారం కోసం వంద రోజుల్లో అమలు చేస్తానని వెయ్యి రోజులు కావస్తున్న నెరవేరని హామీలు.
- బాన్సువాడ సర్ ప్రక్రియ ఇంచార్జ్ తోట ఆగన్న.
- పోతంగల్లో కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై మహా ధర్నా.భారీ సభ.

కోటగిరి/ప్రజావాణి:-కేసీఆర్ ఇచ్చిన లక్ష్మీపుత్రుడు బిరుదుతో ఎదిగిన పోచారం శ్రీనివాసరెడ్డి చివరకు కేసీఆర్‌కే వెన్నుపోటు పొడిచి పార్టీ మారిపోయారని మాజీ ఎమ్మెల్యే,బా న్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బాజి రెడ్డి గోవర్ధన్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు కావస్తున్నా వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని బాన్సువాడ నియోజకవర్గ సర్ ప్రక్రియ ఇంచార్జ్ తోట ఆగన్న మండిపడ్డారు.సోమవారం పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో మండల బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల దగా పాలనపై మహా ధర్నా,భారీ బహిరంగ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి బాజిరెడ్డి గోవర్ధన్,తోట ఆగన్న పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సభను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ విధ్వంస పాలనకు వ్యతిరేకంగా నియోజక వర్గంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కేసీఆర్ పాలనలోని అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలను విస్మరించి,రాష్ట్రంలోని రైతులకు, మహిళలకు,నిరుద్యోగులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆర్ అయితే ప్రజాదరణ తెచ్చింది మాత్రం కేసీఆర్ అని స్పష్టం చేశారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించి,బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలందరూ సైనికులా కష్టపడాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ ఎంఏ హకీమ్ తాత కానుకగా గతంలో ప్రకటించిన విధంగా మొదటి కాన్పులో ఆడబిడ్డను జన్మ నిచ్చిన మాతృమూర్తికి రూ.5 వేల నజరానా బాజిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల బీఆర్ఎస్ నాయకులు సూధం నవీన్,డాక్టర్ ఎం. ఏ.హకీమ్,నియోజకవర్గ నాయకులు జుబేర్,మోరే శ్రీనివాస్,నార్ల రత్నాకర్, అంజి రెడ్డి,ధర్మ తేజ మాధవరెడ్డి,దాస్, ఏజాజ్,విఠల్,నరేష్ రాథోడ్,శ్రీను,సాయి, నర్సింలు,గోపి రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,మధు, రవీందర్,కోటగిరి మండల నాయకులు మోరే కిషన్,తేల్ల రవి కుమార్,మట్టపల్లి దేవేందర్ రావు,కోటగిరి పోతంగల్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల అరెస్టు ప్రభుత్వ పిరికి చర్య..

- బిజెపి మండల ప్రెసిడెంట్ సందీప్.

ప్రజావాణి,ఇనుగుర్తి: విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళు న్న క్రమంలో పోలీసులచే బిజెపి నాయకులను ముందస్తు అరెస్టు చేయించడం ప్రభుత్వ పిరికి చర్య అని బిజెపి మండల అధ్యక్షులు దుంపల సందీప్ అన్నారు. మండల కేంద్రం ఇనుగుర్తి లో సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడం లేదన్నారు దీంతో విద్యార్థుల సర్టిఫికెట్స్ సంబంధిత కళాశాలలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరి వలన ఉన్నత చదువులకు దూరమ వుతున్నారన్నారు.భారతీయ జనతా పార్టీ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాడుతుందన్నారు.అరెస్టులు చేసినప్పటికీ కచ్చితంగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల కొరకు విద్యార్థుల తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కాల్సాని ప్రభాకర్ రెడ్డి,డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు.

కోటగిరి/ప్రజావాణి:-బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోరే కిషన్,తేల్ల రవి కుమార్,మట్టపల్లి దేవేందర్ రావు,కప్ప సంతోష్,ఫారూఖ్, నజీర్,మారుతి పటేల్,రుద్రాంగి సందీప్, మంజునాథ్,రహీం,గుడుమియా, గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

యూరియా సమాచారం రైతులకు ముందస్తుగా ఇవ్వాలి

- యూరియా సమాచారం రైతులకు ముందస్తుగా ఇవ్వాలి
- సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్

బెజ్జంకి, సెప్టెంబర్ 7 (ప్రజావాణి) యూరియా ఎరువులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చే సమయంపై రైతులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సీపీఎం పార్టీ బెజ్జంకి మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం బెజ్జంకి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఎం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా తిప్పారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎరువుల విక్రయాల కోసం ప్రవేశపెట్టిన 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్' యాప్ ద్వారా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.యాప్‌లో సాంకేతిక లోపాలు ఉండటంతో తరచూ ఎర్రర్‌లు వస్తున్నాయని, స్మార్ట్‌ఫోన్‌లు లేని రైతులు, యాప్ వినియోగంపై అవగాహన లేని రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.వెంటనే ఈ యాప్‌ను రద్దు చేసి రైతులకు సులభంగా ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఫర్టిలైజర్ షాపుల యాజమానులు ఏ సమయంలో ఎరువులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నారో రైతులకు తెలియడం లేదని, దీంతో రైతులు గంటల తరబడి దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందన్నారు.మండల వ్యవసాయ అధికారి ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి ఉంచే సమయాన్ని ఒక రోజు ముందుగానే రైతులకు తెలియజేయాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులను అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ, సంఘ ఎల్లయ్య, బోనగిరి లింగం, ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తుల అభి, చెప్యాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో 25 హెచ్‌పీ సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- ఓవర్‌లోడ్ సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి, సెప్టెంబర్ 7 (ప్రజావాణి)సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో 25 హెచ్‌పీ సామర్థ్యం గల కొత్త సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ ఉండటంతో తరచూ ఫీజు వైర్లు కాలిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండేదని గ్రామస్థులు తెలిపారు సమస్యను పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత--రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌తో ఫోన్‌లో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఎమ్మెల్యే ఆదేశాలతో ఏఈ అశోక్, లైన్‌మెన్ నర్సయ్య, ఎలక్ట్రిషియన్ తిరుపతితో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యలు తగ్గుతాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఈ అశోక్, విద్యుత్ శాఖ సిబ్బందికి లక్ష్మీపూర్ గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ ముక్కిస కవిత--రత్నాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం మహాధర్నా

చందానగర్:(ప్రజావాణి) సెప్టెంబర్ 7: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన కవితక్క గారి ఆదేశాల మేరకు ఈ రోజు ఉదయం 12 గంటలకు మదీనాగూడ గాంధీ సర్కిల్ నుండి చందా నగర్ ఓల్డ్ గాంధీ సర్కిల్ వరకు, తెలంగాణ రక్షణ సేన ఇంచార్జి వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ విద్యార్థుల ఫీజు రియింబర్సుమెంట్ కోసం బిక్షాటన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చాక విద్యార్థుల కోసం ఇస్తానని వాగ్దానం చేసిన ఫీజు రియింబర్సుమెంట్, 5 లక్షల ప్రమాద భీమా మరియు స్కూటీలు ఇస్తానని ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని శేరిలింగంపల్లి తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి స్పందించి విద్యార్థులు కి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా వాసిలి డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో కుమార్, దయానంద్ ముదిరాజ్, సందీప్ డిసోజు, విష్ణు, రఘు, పవన్ మరియు విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత.

కోటగిరి/ప్రజావాణి:- నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలంలోని జల్లాపల్లి అబాది గ్రామానికి చెందిన మాలోత్ రేణుక భర్త మాలోత్ శ్రీనివాస్‌కు మంజూరైన రూ.52,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను గ్రామ సర్పంచ్ బర్మవత్ వివేక్ సోమవారం అందజేశారు.తెలంగా ణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు,బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఖాజా గౌసిద్దీన్, గ్రామ పంచాయతీ సభ్యులు శేషారావు, మాలోత్ శ్రీనివాస్,దేవి సింగ్,మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు మొహమ్మద్ ఖాన్, కోటగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ యశ్వంత్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధన్‌రాజ్ రాథోడ్,నాయకులు షఫీ,మోహన్,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులను నిరసిస్తూ శాయంపేట మండలం, మాందారిపేటలో ధర్నా

ప్రజావాణి శాయంపేట తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శాయంపేట మండలంలోని మాందారిపేట సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, ప్రజల తరఫున తమ వాణిని శాసనసభలో వినిపించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొని, కేటీఆర్, హరీశ్‌రావు తదితర నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజల సమస్యల పరిష్కారంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తుంటే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి అప్రజాస్వామికం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహాన్ని ఆపలేరు: చిర్రా రవీందర్ యాదవ్

చందానగర్: (ప్రజావాణి)సెప్టెంబర్ 7: శాసనసభకు నల్లచొక్కాలతో హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని శేరిలింగంపల్లి ఉద్యమ నేత చిర్రా రవీందర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడం, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలు కావడం బాధాకరమన్నారు. పోలీసుల అత్యుత్సాహంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నల్లచొక్కాలను పోలీసులు అడ్డుకోగలరేమో కానీ ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని మాత్రం ఆపలేరని చిర్రా రవీందర్ యాదవ్ హెచ్చరించారు.

బీర్కూర్ మండల వైద్యాధికారిగా ఎన్. బాపూరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజావాణి బీర్కూర్: బీర్కూర్ మండల వైద్యాధికారిగా డాక్టర్ ఎన్. బాపూరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నాగిరెడ్డి పేట నుండి బీర్కూర్ పిహెచ్సికి డిప్యూటేషన్ పై సోమవారం బాధ్యతలు స్వీకరించారు.మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని డాక్టర్ బాపూరెడ్డి తెలిపారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల నియంత్రణ, పారిశుధ్యంపై అవగాహన, గర్భిణులు, చిన్నారులకు అందించే ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చిల్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో యూనిఫాంలు షూల పంపిణీ

మన ప్రజావాణి. మంథని ప్రతినిధి. మంతని మండలం చిల్లపల్లి గ్రామంలో ఈరోజు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన యూనిఫామ్ లు మరియు షూలు విద్యార్థులకు పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిల్లపల్లి గ్రామ సర్పంచ్ గోపి సంతోష్ విద్యార్థిని విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి నరేష్ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు సునీత నరేష్ సరిత పాల్గొన్నారు

చింతూరు, ధర్మవరం, అయ్యవారిపేట సమస్యలను వెంటనే పరిష్కరించాలి!

- వాజేడు ఎంపీడీఓకు ప్రజా పోరాట సమితి వినతిపత్రం సమర్పణ
- రోడ్ల నిర్మాణం, పాఠశాలల రక్షణ, పారిశుధ్యంపై తక్షణ చర్యలకు డిమాండ్

వాజేడు, సెప్టెంబర్ 07 (ప్రజావాణి):వాజేడు మండల పరిధిలోని చింతూరు, ధర్మవరం, అయ్యవారిపేట గ్రామ పంచాయతీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా పోరాట సమితి నాయకులు సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)కి వినతిపత్రం అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఈ వినతిపత్రాన్ని అందజేసినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సదరు గ్రామ పంచాయతీల పరిధిలో రహదారులు, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం మరియు పాఠశాలల భద్రత వంటి కీలక సమస్యలతో ప్రజలు కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. ముఖ్యమైన డిమాండ్లు:రహదారుల పునర్నిర్మాణం: ధర్మవరం నుండి చెరుకూరు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, ఆ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. అలాగే లక్ష్మీపురం--భువనపల్లి రహదారి, ధర్మవరం మెయిన్ రోడ్డు నుండి భువనపల్లి వరకు ఉన్న రహదారి, మరియు ధర్మవరం నుండి కడెకల్ వరకు ఉన్న రోడ్లను వెంటనే నిర్మించి ప్రమాదాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలల రక్షణ, భద్రత: ధర్మవరం ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో జంతువులు లోపలికి వచ్చి విద్యార్థుల భద్రతకు విఘాతం కలిగిస్తున్నాయని తెలిపారు. వెంటనే ప్రహరీ గోడతో పాటు గతంలో ఉన్న గేటును పునరుద్ధరించాలన్నారు. ధర్మవరం, అయ్యవారిపేట ప్రాథమిక పాఠశాల భూముల కబ్జా ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పాఠశాల ఆస్తులను రక్షించాలని, అలాగే ధర్మవరంలో శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనాలను తొలగించి విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. పారిశుధ్యం, ప్రజారోగ్యం: చింతూరు పంచాయతీ పరిధిలోని కొరకల్, భువనపల్లి గ్రామాల్లో దోమల బెడద తీవ్రంగా ఉన్నందున తక్షణమే ఫాగింగ్ యంత్రాల ద్వారా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మూడు పంచాయతీల్లోని పల్లె ప్రకృతి వనాలను పునరుద్ధరించాలని, డంపింగ్ యార్డుల నిర్వహణను మెరుగుపరిచి తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారుచేస్తూ పంచాయతీలకు ఆదాయం సమకూరేలా చూడాలని సూచించారు. వైద్య సేవలు: ధర్మవరం గ్రామంలో నిర్మిస్తున్న ఉప ఆరోగ్య కేంద్రం (సబ్ సెంటర్) పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్యార్థుల భద్రత, రవాణా, ఆరోగ్య అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి నాయకులు ముత్తెబోయిన మహేందర్, గార రవికుమార్, గగ్గూరి నాగేంద్రబాబు, శ్రీనాథ్, సురేష్ మరియు స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో కరువైన సమయపాలన: ఆఫీసు చుట్టూ తిరుగుతూ ప్రజల తీవ్ర అవస్థలు!

- కార్యాలయానికి రాక ఇబ్బంది పెడుతున్న అధికారులు... తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి!

వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 07 (ప్రజావాణి):మండల కేంద్రంలోని తహశీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయంలో అధికారుల సమయపాలన రానురాను పూర్తిగా దారితప్పుతోంది. నిత్యం రకరకాల రెవెన్యూ పనుల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చే సామాన్య ప్రజలను, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు, భూమి సంబంధిత సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకాల సవరణలు మరియు ఇతర అత్యవసర పనుల కోసం మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ఉదయాన్నే తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంటున్నారు. అయితే కార్యాలయంలో సీటులో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గంటల కొద్దీ వేచి చూసినా సమాధానం చెప్పేవారు కరువవ్వడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులు, మహిళలు, రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కూలీ పనులు మానుకుని, వందల రూపాయల ఛార్జీలు పెట్టుకుని రోజూ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తోందని, అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ సమయం, డబ్బు వృథా అవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులే ఇలా సమయపాలన పాటించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వెంకటాపురం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సరైన వేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బెజ్జంకి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

బెజ్జంకి, సెప్టెంబర్ 7 (ప్రజావాణి) బెజ్జంకి మండల కేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ బెజ్జంకి మండల మహాసభ నిర్వహించారు ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్ భాను మాట్లాడుతూ బెజ్జంకి మండలంలో తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బెజ్జంకి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద, గ్రామీణ విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య పూర్తిచేసిన అనంతరం డిగ్రీ చదువుల కోసం సిద్దిపేట, కరీంనగర్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రతిరోజూ దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం భారంగా మారడంతో పలువురు ఉన్నత విద్యను కొనసాగించలేక చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, ఆర్థిక పరిస్థితులు విద్యకు అడ్డంకిగా మారకూడదని అన్నారు.మండలంలోని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బెజ్జంకి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తక్షణమే మంజూరు చేసి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగునీరు, పారిశుధ్యం, విద్యా సామగ్రి తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.
మహాసభకు ముఖ్య అతిథిగా బొమ్మిడి సాయి కృష్ణ హాజరై మాట్లాడుతూ బెజ్జంకి మండలంలోని విద్యార్థుల సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం నూతన నాయకత్వం పోరాటాల దిశగా ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేయాలని నూతన కమిటీకి సూచించారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఎఫ్ఐ బెజ్జంకి మండల కమిటీని 18 మందితో ఏర్పాటు చేశారు.మండల అధ్యక్షుడిగా బి. ప్రేమ్, మండల కార్యదర్శిగా బి. ప్రజ్వేష్ ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షులుగా, ఏ.ధనలక్ష్మి,కే.అనూష,జే భావని, సహాయ కార్యదర్శులుగా, ఎం. రేవతి, ఏ . కిరణ్ తేజ,టీ . ఓంకార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో బెజ్జంకి మండలంలోని విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడి, ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు, బలోపేతానికి కృషి చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చెప్యాల సంతోష్ పాల్గొన్నారు.

ప్రజా వినతులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి...

- వివిధ ప్రాంతాల ప్రజల నుండి 77 అర్జీల స్వీకరణ. • సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.

సెప్టెంబర్ 07 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి ప్రజావాణిలో వచ్చిన దర ఖాస్తులను పెండింగ్ లే కుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు లతో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 77 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.అందులో రెవిన్యూ శాఖ 53 , సర్వే ల్యాండ్స్ 5 శాఖ సంక్షేమ 5 , మున్సిపాలిటీ 3 , డి.పి.ఓ 2 పి. డి హౌసింగ్ 2 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ , విద్య , మైన్స్ , మత్య , విద్యుత్ , లీడ్ బ్యాంకు , ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు హాస్టల్ ఇన్స్పెక్షన్ తప్పనిసరిగా చేసి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ఇంకా మీ ప్రమాణంలో నమోదు చేసుకొని అధికారులు, సిబ్బంది నమోదు చేసు కోవాలని , చేసుకొని వారి పై చర్యలు తప్పవని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటి కపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ , డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి , జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , హౌసింగ్ పీడీ అలివేలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ప్రభుత్వ నిర్బంధ వైఖరికి నిరసనగా సంగారెడ్డిలో రాస్తారోకో

మన ప్రజావాణి ప్రతినిధి (సంగారెడ్డి) సెప్టెంబర్ 7 ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణుల భారీ నిరసన

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్బంధ వైఖరికి నిరసనగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు సంగారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. “సీఎం డౌన్ డౌన్”, “ప్రజా వ్యతిరేక ప్రభుత్వం డౌన్ డౌన్”, “బీఆర్ఎస్ గొంతు నొక్కడం ఆపాలి” అంటూ నినాదాలు చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనను అసెంబ్లీలో నిలదీస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకే ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను చూసి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు

ఉందని, ఆ హక్కును పోలీసులు, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని అణచివేయాలని ప్రయత్నించడం సరికాదని స్పష్టం చేశారు.మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని ఆరోపిస్తూ, ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు.పార్లమెంట్‌లో నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేసినప్పుడు తప్పుగా కనిపించని చర్య, తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలియజేస్తే ఎందుకు తప్పవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రతిపక్ష సభ్యులను అడ్డుకోవడం, మహిళా ప్రజాప్రతినిధులతో అనుచితంగా వ్యవహరించడం, పోలీసు బలగాలను ఉపయోగించి నిరసనలను అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

“పోలీసులను అడ్డుపెట్టుకుని మా గొంతును నొక్కాలని ప్రయత్నిస్తే సహించేది లేదు. ప్రజల సమస్యలు, కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై మా పోరాటం మరింత ఉధృతం చేస్తాం” అంటూ

ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అధికారాన్ని ఉపయోగించి ప్రతిపక్షాన్ని అణచివేయడం కంటే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, చింత సాయినాథ్, మందుల వరలక్ష్మి, డాక్టర్ శ్రీహరి, మనోహర్ గౌడ్, నాగరాజు గౌడ్, చక్రపాణి, యువజన నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్, వేణుగోపాలస్వామితో పాటు పెద్ద ఎత్తున యువకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

- తాత మధు క్షమాపణ చెప్పాలి లేదా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలి-కాంగ్రెస్

బెజ్జంకి, సెప్టెంబర్ 7 (ప్రజావాణి)గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బెజ్జంకి మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లరంగు టీషర్టులు ధరించి,వాటిపై అసభ్యకర వ్యాఖ్యలు రాసుకొని అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి పోలీసు సిబ్బందిపై విరుచుకుపడ్డారని విమర్శించారు.శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తాత మధు వెంటనే స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, జెట్టి రమేష్, బైరా సంతోష్, గుర్రాల బాల నరసింహారెడ్డి, గాజ శ్రీనివాస్, తిరుపతి, గండికోట సురేష్, మాజీ సర్పంచ్ రావుల నరసయ్య, ఉప సర్పంచ్ మచ్చ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ కుంట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు తహసీల్దార్‌కు బీఆర్ఎస్ వినతిపత్రం

- ఆరు గ్యారంటీలు.. 420 హామీలు నెరవేర్చాలని డిమాండ్.

కొండాపూర్, సెప్టెంబర్ 07 (ప్రజావాణి):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొండాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా వికలాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే 18 ఏళ్లు నిండిన

యువతులకు స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా, ఎన్నికల హామీలన్నింటినీ దశలవారీగా నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మ్యకం విట్టల్, జిల్లా బీఆర్ఎస్ నాయకులు మల్లా

గౌడ్, ప్రేమానందం, పాండురంగం, రుక్ముద్దీన్, అమరేందర్‌రెడ్డి, సర్పంచులు మహేష్, వినోద్, అనిల్, రామగౌడ్ తదితరులతో పాటు ఇంద్రారెడ్డి, సత్యానందం, నర్సింలు, రాముల నాయక్, జలీల్, సంతోష్‌రెడ్డి, రాజు, రవి, మొగులయ్య, జగదీష్, ప్రకాష్, మోహన్‌గౌడ్, రామచంద్రరాజ్, కుమార్, శ్రీకాంత్, సంగారెడ్డి రాజు, నమ్మే నాయక్, కిష్టారెడ్డి, శేఖర్, రవీందర్, సాయిరెడ్డి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ద్వారక జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో అల్పాహార కార్యక్రమం ప్రారంభం

దండేపల్లి, సెప్టెంబర్ 7 (సక్రమ ప్రజావాణి)

:దండేపల్లి మండలం ద్వారక గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థుల కోసం అల్పాహార కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మురిమడుగు సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించగలరని అన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం పాఠశాలలో అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తూటీ చెర్ల లక్ష్మి,- విష్ణు ప్రధానోపాధ్యాయులు చిన్న నర్సయ్య , ఉప సర్పంచ్ కస్తూరి హారిక వెంకటేష్, సీఆర్పీ ఇప్ప సురేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: ఎంపీడీవో శ్రీనిధి

బీర్కూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామీణ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలువురు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు వివరాలను తెలియజేశారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నిబంధనల మేరకు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీడీవో శ్రీనిధి సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ సవాయిసింగ్, ఎంఈఓ వెంకన్నతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అధికారులు ప్రజల సమస్యలను ఓపికగా విని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

ప్రతి దివ్యాంగుడికి అవసరమైన సహాయ పరికరాలు అందేలా చర్యలు

- ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియ

ఆర్మూర్ టౌన్ సెప్టెంబర్ 07(మన సమగ్ర ప్రజావాణి): దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు చేరువయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియ తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యా వనరుల కేంద్రం ప్రాంగణంలో సోమవారం సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం, అలిమ్కో సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఐఈ కోఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన శిబిరం ప్రారంభ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియ ముఖ్య

అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో, అలిమ్కో సహకారంతో దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయ ఉపకరణాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, పెన్షన్ పొందడంలో దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. రెవెన్యూ, విద్యా, వైద్య, డీఆర్‌డీఏ శాఖల అధికారులు అందుబాటులో ఉండి అవసరమైన ధ్రువపత్రాలు పొందేందుకు సహకరిస్తారని పేర్కొన్నారు. సహాయ ఉపకరణాల పంపిణీ సమయంలో అవసరమైన ధ్రువపత్రాలు లేవనే కారణంతో దివ్యాంగ విద్యార్థులను వెనక్కి పంపవద్దని అధికారులకు సూచించారు. ప్రతి దివ్యాంగుడికి అవసరమైన సహాయ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆర్మూర్ డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులను అలిమ్కో నిపుణులు ప్రోస్టెటిస్ట్ అండ్ ఆర్తోటిస్ట్ ప్రత్యూష్ కుమార్ బిశ్వాల్, డేటా ఎంట్రీ ఆపరేటర్ శివకుమార్ పరీక్షించి, వారికి అవసరమైన సహాయ ఉపకరణాల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండల విద్యాధికారి రవీందర్, ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఐఈఆర్‌పీలు రాజన్న, లింబాద్రి స్వామి, కిషన్, సురేష్, జలంధర్, తలారి కిషన్, శైలజ, మౌళిక, ప్రేమస్వరూప, స్పెషల్ టీచర్లు గంగామణి, సోనీ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి లో వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలి

- మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి





మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 7 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి)

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 105 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అవమానమా..?

- మహిళలకు రక్షణ ఎక్కడ? - చిలిపిచెడ్ లో బి ఆర్ ఎస్ ధర్నా

చిలిపిచెడ్, సెప్టెంబర్ 7 ప్రజావాణి)తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో నర్సాపూర్ బి ఆర్ ఎస్ శాసనసభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించిన ఘటనను నిరసిస్తూ చిలిపిచెడ్ మండల కేంద్రంలో ఆదివారం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు.అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజున కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తుల్లో అసెంబ్లీకి వచ్చారు. గేటు వద్ద భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో నల్ల చీరలో వచ్చిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగి అవమానించారని ఆమె కన్నీళ్లతో ఆరోపించారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా బి ఆర్ ఎస్ శ్రేణుల్లో ఆగ్రహానికి దారితీసింది.ఈ నేపథ్యంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో దౌల్తాబాద్ – జోగిపేట్ ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, “ఒక మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా

అసెంబ్లీ ప్రాంగణంలోనే దురుసుగా ప్రవర్తించడం దారుణం. ప్రజలచే ఎన్నుకోబడిన మహిళా ఎమ్మెల్యేకే రక్షణ లేకపోతే రాష్ట్రంలో సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ? కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?” అని ప్రశ్నించారు.ఎమ్మెల్యే పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.విషయం తెలుసుకున్న చిలిపిచెడ్ ఎస్ఐ నర్సింలు సంఘటనా స్థలానికి చేరుకుని దిష్టిబొమ్మ దహనాన్ని ఆర్పివేసి నాయకులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.ం

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, టిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ కార్యక్రమం ప్రారంభం

భిక్కనూర్, సెప్టెంబర్ 7 (ప్రజావాణి): భిక్కనూర్ మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కోడూరి సాయ గౌడ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సాయ గౌడ్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కుట్టు మిషన్ ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితికి తోడ్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలకు అవసరమైన సహకారం అందించేందుకు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చైతన్య కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు వడ్ల శ్రీనివాస్, మాధవరెడ్డి, నట్ట లింగం, కంతి వసంత, గ్రామ పెద్దలు బాగా రెడ్డి, ఇటిక్యాల వెంకటేశ్వర రెడ్డి, ఇస్తారి, పిల్లి సంతోష్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ రజిత రెడ్డితో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారిపై వరినాట్లు వేసి నిరసన

- చింతలమానేపల్లి--గూడెం రహదారి అధ్వానం
- బైక్‌లు, బస్సుల రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి డిమాండ్

కొమురంభీమ్, సెప్టెంబర్ 7, (ప్రజావాణి) చింతల మానేపల్లి: మండలం నుంచి గూడెం మీదుగా కర్జెల్లి--కేతిని మధ్య ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి దుస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు రోడ్డుపైనే వరినాట్లు వేస్తూ నిరసన తెలిపారు. బైక్‌లు, బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పందించి వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్ట్ ను ఖండించి ధర్నా చేపట్టిన

- అడవిదేవులపల్లి బిఆర్ఎస్ పార్టీ మండల నాయకత్వం

ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 07ఈరోజు హైదరాబాద్ అసెంబ్లీలో కేటీఆర్ ని మరియు హరీష్ రావు ని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అరెస్టును ఖండిస్తూ అడవిదేవులపల్లి ఎమ్మార్వో ఆఫీస్ ముందు రోడ్డుపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు అక్రమ అరెస్టులను ఖండిస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించినాము ధర్నాల్లో పాల్గొన్నవారు మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్ మాజీ జెడ్పిటిసి సేవ నాయక్ బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను మాజీ సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కొత్త మర్రెడ్డి మాజీ సర్పంచ్ కుర్ర పకీర పాతులోతు ముని ముత్యాలు జయరాం రవి గుండ సీతారామయ్య శ్రీరామ్ స్వామి చిన్న రంగా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

ఒకే బడి.. రెండు అవార్డులు

- ఉత్తమ ఉపాధ్యాయులుగా బాలాజీరావు,సంతోష్ కుమార్ కు గుర్తింపు

చెన్నారావుపేట సెప్టెంబర్ 07 ప్రజావాణి ఒకే పాఠశాల.. ఇద్దరు ఉపాధ్యాయులు.. రెండు ప్రతిష్ఠాత్మక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇది అరుదైన ఘనత. పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పిన్నింటి బాలాజీరావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఆంగ్ల ఉపాధ్యాయుడు కె.సంతోష్ కుమార్ కు వరంగల్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం వారిని ఘనంగా సన్మానించింది. శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపింది. ప్రధానోపాధ్యాయురాలు హెచ్ఎం జయ మాట్లాడుతూ.. ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల పట్ల బాధ్యత, బోధనలో అంకితభావం, వినూత్న పద్ధతులు, సృజనాత్మక కార్యక్రమాలతో వారు అందిస్తున్న సేవలకు ఈ అవార్డులు నిదర్శనమన్నారు. ఈ ఘనత పాఠశాలకే కాకుండా మొత్తం ఉపాధ్యాయ బృందానికి గర్వకారణమన్నారు.తమ సేవలను గుర్తించి అవార్డులతో సత్కరించడం మరింత బాధ్యతను పెంచిందని బాలాజీరావు, సంతోష్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారి సమగ్ర అభివృద్ధికి భవిష్యత్‌లోనూ మరింత అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. తమ సహచర ఉపాధ్యాయుల సన్మానం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.ఉత్తమ ఉపాధ్యాయుల స్ఫూర్తితో పాఠశాల మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు

ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ సర్కారును గద్దె దించాలి

- ఉప్పల్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా 7 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల నిరంకుశ పాలనకు 420 హామీలను నెరవేర్చాలని ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ కు నిరసన పత్రం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచనల మేరకు ఈరోజు ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఉప్పల్ చిల్కానగర్ ,రామంతపూర్, హబ్సిగూడ డివిజన్ ల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్ కి కాంగ్రెస్ ప్రభుత్వ అమలు కానీ 420 హామీలను 6 గ్యారంటీలను 1000వెయ్యి రోజుల దగా పై ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.
అనంతరం చిల్కానగర్ డివిజన్ జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు పశువుల ప్రభాకర్ రెడ్డి, పిల్లి నాగరాజ్, జితేందర్ రెడ్డి మొదలగువారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 హామీలతోటి గద్దెనెక్కి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను మోసం చేయడమే కాకుండా ప్రజా పాలన పేరుతో నిరంకుశ పాలనను రాష్ట్రంలో కొనసాగిస్తూ పుట్టిన బిడ్డ నుండి ముసలి అవ్వ వరకు ఏదైతే కెసిఆర్ గారి ప్రభుత్వంలో ప్రజలకు లబ్ధి చేకూరిందో ఈరోజు రేవంత్ రెడ్డి అరాచక పాలనలో ప్రతి వర్గం ప్రతి ఒక్క రంగం నిరంకుశ పాలనకు అతలాకుతలం అవుతున్నారని అన్నారు,420 హామీలతో 6 గ్యారంటీ ల పేరుతో గద్దె నేకి అరాచక రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ రైతు బీమా, రైతు భరోసా ఎగ్గొట్టి రైతులను మోసం చేసిందని,విద్యార్థులకు రెండు లక్షల ఉద్యోగాలు ప్రతి సంవత్సరం ఇస్తానని మోసం చేసి విద్యార్థులను మోసగించిందని,
ఆడబిడ్డలకు నిరుద్యోగ భృతి 2500 ఇస్తానన, విద్యార్థులకు ఉచితంగా స్కూటీలు ఇస్తామని,రూ 500 కే సిలిండర్ ఇస్తామని, 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామని, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ తో పాటు తులం బంగారం ఆడపడుచులకు ఇస్తానని, పెన్షన్ ని 2 వేల నుండి 4 వేల కు పెంచుతానని, వికలాంగులకు 4000 నుండి 6000 పెన్షన్ పెంచుతానని, కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేస్తానని , హైడ్రాతో హైదరాబాదును దోచుకు తిన్నారా అని, కొత్తగా 22a GO తో రూపాయి రూపాయి కూడా పెట్టి కట్టుకున్న ఇండ్లను ఇండ్ల స్థలాలను ఆక్రమించుకునే యోచనతో పాలను సాగిస్తున్నారని, ఎద్దేవా చేశారు, నోటికి వచ్చినన్ని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 100 రోజులలో పూర్తి చేస్తానన్న చార్సోబీస్ హామీలల్లో వెయ్యి రోజులు పూర్తయిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని
తొందరలో ప్రజలు ప్రజా పాలన పేరుతో మోసం చేస్తున్న రాక్షస పాలన కాంగ్రెస్ సర్కారుని ప్రజలు తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు,అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అరెస్టుకు నిరసనగా ఉప్పల్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి అరెస్ట్ అయిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని నిరసన తెలిపారు.కార్యక్రమంలో ఉప్పల్ చిల్కానగర్ ,రామంతపూర్ హబ్సిగూడ డివిజన్ ల సీనియర్ నాయకులు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల దురుసు ప్రవర్తనను ఖండించిన దాసరి మనోహర్‌రెడ్డి

- ప్రజాప్రతినిధుల హక్కులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 7: రాష్ట్ర అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు.అసెంబ్లీ సాక్షిగా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసనగా సోమవారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వచ్చిన ప్రజాప్రతినిధులను అడ్డుకుని, తోపులాటకు దిగడంతో పాటు అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదన్నారు.
కేటీఆర్, హరీశ్‌రావు, సునీత లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితర బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. తోపులాటలో పలువురికి గాయాలు కావడం ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి మాట్లాడే హక్కుతో పాటు ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలదీసే హక్కును పోలీసుల బలంతో అడ్డుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు.
అసెంబ్లీ ప్రజల సమస్యలను చర్చించే పవిత్రమైన వేదిక అని, అక్కడికి వచ్చే ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం అంటే ప్రజల గొంతును అడ్డుకోవడమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, నిరసన తెలిపితే పోలీసులతో అణచివేయడం సరైన విధానం కాదన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుని ప్రజాప్రతినిధుల హక్కులను గౌరవించాలని కోరారు.
ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోదని స్పష్టం చేశారు. పోలీసుల బెదిరింపులకు, అక్రమ నిర్బంధాలకు బీఆర్ఎస్ నాయకులు భయపడబోరని దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి ...!

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.
మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఏ. నాగిరెడ్డి తమ పిల్లలకు షుగర్, కిడ్ని వ్యాధి సమస్యలు ఉన్నాయని, దీనికి అవసరమైన మందులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలానికి చెందిన రైతులు తమకు ఆన్ లైన్ విధానం రద్దు చేసి ఎరువులు సరఫరా చేయాలని, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపాలని, మార్క్ ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు నిమిత్తం కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకోకు దాసరి మనోహర్ రెడ్డి, దాసరి మమతారెడ్డి సంఘీభావం

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 7: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమానికి ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ పారితోషికంతో అనేక రకాల బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లపై అదనపు పనిభారం, టార్గెట్లు మోపడం సరికాదన్నారు. ఆశా వర్కర్లపై విధిస్తున్న టార్గెట్లను వెంటనే ఎత్తివేయాలని, ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లను బీఎల్ఓ విధుల నుంచి తొలగించాలని, వారికి నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు.వారి సేవలను ప్రభుత్వం గుర్తించి గౌరవప్రదమైన వేతనం, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆశా వర్కర్ల ప్రధాన డిమాండ్లన్నింటినీ ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే అమలు చేయాలని కోరారు.మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి మాట్లాడుతూ, ఆశా వర్కర్ల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవేనని అన్నారు. ప్రభుత్వం వారి సమస్యలను సానుభూతితో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులపై అదనపు పనిభారం మోపకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.
ఆశా వర్కర్ల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ప్రభుత్వం స్పందించే వరకు వారి తరఫున ప్రజా ఉద్యమానికి అండగా నిలుస్తామని దాసరి మనోహర్ రెడ్డి, దాసరి మమతారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ ఛైర్మెన్ డా మమతారెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పాలనంటే మళ్లీ ఎమర్జెన్సీ రోజులే!

- వెయ్యి రోజుల పాలనను అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్నారు
- మహిళలను చూడకుండా పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం సిగ్గుచేటు
- ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్
- మంథని ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 7, ప్రజావాణి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇందిరమ్మ పాలన అందిస్తామని చెప్పి, నేడు ఎమర్జెన్సీ నాటి చీకటి రోజులను తలపించేలా పాలన సాగిస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం, మహిళా నేతలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మంథనిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై అసెంబ్లీలో ప్రజల తరఫున బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిలదీస్తారనే భయంతోనే వారిని అడ్డుకున్నారని అన్నారు. మహిళా నేతలను సైతం పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గమని విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో, 420 హామీలను ఐదేళ్లలో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. హామీలపై ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రతిపక్షాలపై కేసులు, అరెస్టులు, డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు.

మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వ్యతిరేకంగా మాట్లాడేందుకు ప్రజలు భయపడుతున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులు, కార్యకర్తలు ఏ విధంగా సంపాదించుకుంటున్నారో ప్రజలకు అర్థమవుతోందన్నారు. తెలంగాణ ప్రయోజనాల కంటే ఢిల్లీ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని, ప్రజలను చైతన్యపరిచేందుకు గడపగడపకూ, ఇంటింటికీ వెళ్తామని పుట్ట మధూకర్ అన్నారు. రానున్న రెండేళ్లలో ప్రజలను చైతన్యపరిచి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కళ్లు తెరిచి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

గంగాపురిలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 7, ప్రజావాణి: మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి ప్రాంతంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు సోమవారం చేపట్టారు. మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీను బాబు సహకారంతో ఈ పనులు చేపట్టినట్లు 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు తెలిపారు.ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు తరచూ ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను తగ్గించేందుకు నూతన స్తంభాల ఏర్పాటు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్ తెలిపారు.నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులకు సహకరించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, విద్యుత్ శాఖ డీఈ, ఏఈ, లైన్‌మెన్, సిబ్బందికి కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సహకారంతో గంగాపురి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఆయన అన్నారు.

పోగొట్టుకున్న 100 మొబైల్ ఫోన్ల రికవరీ...

- 20 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ.

సెప్టెంబర్ 07 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల నిరంతర కృషితో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మరియు చోరీకి గురైన 100 మొబైల్ ఫోన్లను , సుమారు రూ.20 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను వివిధ రాష్ట్రాల నుండి విజయవంతంగా రికవరీ చేశారు. పౌరులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టు కున్న లేదా చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే, ఆయా పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిఈఐఆర్ వారియర్ అధికారులు ఫిర్యాదుదారుల వివరాలను సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి , సంబంధిత మొబైల్ ఫోన్ల 'ఐఎంఈఐ' నంబర్ల ఆధారంగా నిరంతరం ట్రాకింగ్ చేపట్టారు.సిఈఐఆర్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ , పోలీసు అధికారులు చేపట్టిన నిరంతర పర్యవేక్షణ సాంకేతిక చర్యల ఫలితంగా సాంసంగ్ , వన్ ప్లస్ , వివో , ఒప్పో తది తర వివిధ ప్రముఖ బ్రాండ్లకు చెందిన 100 మొబైల్ ఫోన్లను తెలంగాణ తో పాటు ఇతర రాష్ట్రాల నుండి రికవరీ చేశారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను ఈ రోజు యాదాద్రి భువనగిరి

జిల్లా పోలీస్ కార్యాలయం లో నిర్వహించిన కార్య క్రమంలో జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ వాటి అసలైన యజమానులకు స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ లక్ష్మీ నారాయణ , సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రతి ఒక్కరూ వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి , మొబైల్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్ వివరాలను అందించాలని సూచించారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టు కున్న మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేసేందుకు పోలీసులు



నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆస్తి వ్యక్తిగత సమాచార భద్రతకు యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆధునిక సాంకేతిక పరి జ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన పోలీ సింగ్ సేవలు అందిస్తున్నా మని ఎస్పీ తెలిపారు.పోగొట్టుకున్న మొబైల్ మీ చేతికి తిరిగి వచ్చే అవకాశం ఉంది-వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి సిఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోండి.

మట్టి వినాయకుల ప్రతిష్టకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

- మహాత్మ గాంధీ లా కాలేజీ లో మట్టి వినాయకుని పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 7 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) మట్టి వినాయకుల ప్రతిష్ఠకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి మహాత్మా గాంధీ లా కాలేజీలో మట్టి వినాయకుని పోస్టర్ ఆవిష్కరణ లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేత ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులనుప్రోత్సహించాలనే ఉద్దేశంతో లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేత ఆధ్వర్యంలో మట్టి వినాయకులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా గాంధీ లా కాలేజీలో కాలేజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రాధాన్యతను తెలియజేసే పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేతమాట్లాడుతూ వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూబాధ్యతతీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయని, జలచరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి, పర్యావరణహితమైన పండుగను జరుపుకోవాలని సూచించారు.మట్టి వినాయకుడు మన బాధ్యత అనే నినాదంతో లైఫ్ సేవర్స్ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని శివ నేత తెలిపారు.కాలేజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. లైఫ్ సేవర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మట్టి వినాయకుల అవగాహన కార్యక్రమం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేత, శంకరాచారి,సుధీర్, రవితేజ,స్పర్శ, అనూష, పృథ్వి తదితరులు పాల్గొన్నారు. మట్టి వినాయకులను ప్రోత్సహిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

ఎక్సైజ్ నిబంధనలకు పాతికేసి దందా: ఎమ్మార్పీకి మంగళం.. క్వార్టర్‌పై రూ.20 నుండి రూ.50 వరకు దోపిడీ!

- వైన్స్‌లోనే రూ.20 ఎక్కువ, బెల్ట్ షాపుల్లో ఏకంగా రూ.50 అదన బాదుడు... చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు!

వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 07 (ప్రజావాణి):మండలంలో మద్యం సిండికేట్ వ్యాపారులు అక్రమ సంపాదనకు అలవాటుపడి నిబంధనలను నడిరోడ్డుపై తగులబెడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట రిటైల్ ధర (ఎమ్మార్పీ) ప్రకారం మద్యం విక్రయించాల్సి ఉండగా, ఇటు లైసెన్స్ వైన్స్ నిర్వాహకులు, అటు బెల్ట్ షాపుల నిర్వాహకులు కుమ్మక్కై సామాన్య వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.

వైన్స్‌లోనే ఎమ్మార్పీకి మంగళం

మండల కేంద్రంలోని వైన్ షాపులకు నేరుగా వెళ్లే వినియోగదారులకు ఎమ్మార్పీ ధరలు అమల్లో లేవు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ప్రతి క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు. "ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారు?" అని ప్రశ్నిస్తే "షాపు నిర్వహణ ఖర్చులు, రవాణా చార్జీలు ఎక్కువవుతున్నాయి.. నచ్చితే తీసుకోండి, లేకపోతే లేదు" అంటూ వైన్స్ సిబ్బంది నిర్లక్ష్యంగా జవాబిస్తున్నారు. బహిరంగంగానే ప్రతి బాటిల్‌పై రూ.20 ఎక్కువ దండుకుంటూ కొనుగోలుదారుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారు. బెల్ట్ షాపుల్లో అడ్డగోలు దోపిడీ: రూ.50 అదనంగా వసూలు

లైసెన్స్ ఉన్న వైన్స్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే, గ్రామాల్లో వెలసిన అక్రమ బెల్ట్ షాపుల్లో దందా మరీ ఘోరంగా తయారైంది. గ్రామీణ ప్రాంతాలలోని బెల్ట్ షాపులలో ప్రతి క్వార్టర్ సీసాపై ఏకంగా రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. వైన్ షాపుల నిర్వాహకులు పక్కా ప్రణాళికతో ప్రముఖ బ్రాండ్ల మద్యాన్ని సాధారణ వినియోగదారులకు "స్టాక్ లేదు" అని బురిడీ కొట్టిస్తూ, దొడ్డిదారిన అర్ధరాత్రి వేళల్లో బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు. దీంతో వినియోగదారులు వేరే మార్గం లేక బెల్ట్ షాపుల వద్దకు వెళ్లి అడిగినంత చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. పర్మిట్ రూమ్‌ల సౌకర్యం సున్నా -- బహిరంగంగానే తాగుడు

ప్రభుత్వ ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్ షాపులకు అనుబంధంగా వినియోగదారులు మద్యం సేవించడానికి వీలుగా ప్రత్యేక పర్మిట్ రూమ్‌లు (తాగేందుకు ప్రత్యేక గదులు) ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ మండలంలో ఈ నిబంధనను పూర్తిగా గాలికి వదిలేశారు. ఎక్కడా పర్మిట్ రూమ్‌ల సౌకర్యం కల్పించకపోవడంతో, మద్యం ప్రియులు వైన్ షాపుల ముందే, రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లోనే కూర్చుని మద్యం సేవిస్తున్నారు. దీనివల్ల బాటసారులు, మహిళలు, కాలేజీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయించాల్సిన అధికారులు మాత్రం నీరు గారినట్లు వ్యవహరిస్తూ, తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

కనపడని సీసీ కెమెరాలు, పట్టించుకోని అధికారులు

తెలంగాణ ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ప్రతీ వైన్ షాపులో డిజిటల్ బిల్లింగ్ మిషన్లు వాడాలని, ప్రింటెడ్ బిల్లులు ఇవ్వాలని, షాపు ప్రాంగణంలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేయాలనే నియమాలు ఉన్నాయి. కానీ మండలంలో ఏ ఒక్క షాపులోనూ ఎమ్మార్పీ బిల్లులు ఇవ్వడం లేదు. ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

నామమాత్రంగా మారడంతో వైన్స్ యాజమాన్యాలు, బెల్ట్ షాపుల నిర్వాహకులు ఏకాంబరమై రోజుకు లక్షలాది రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు.

తక్షణ చర్యలకు స్థానికుల డిమాండ్

ఎమ్మార్పీ కంటే రూ.20 ఎక్కువ వసూలు చేస్తున్న వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలని, పర్మిట్ రూమ్‌ల సౌకర్యం కల్పించకుండా బహిరంగ తాగుడుకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 అదనంగా దండుకుంటున్న అక్రమ బెల్ట్ షాపులను తక్షణమే సీజ్ చేయాలని మండల ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమ దందాకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

దిశా విలేఖరి కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి

చిన్నశంకరంపేట,సెప్టెంబర్07, మన ప్రజావాణి: చిన్నశంకరంపేట మండలానికి చెందిన దిశా విలేకర్ దేవరాజ్ గతంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాలు విరిగిపోవడం జరిగింది. ఇట్టి విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు రాష్ట్ర నాయకులు కాంటారెడ్డి తిరుపతి రెడ్డి 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పాడు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు కుమార్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, లక్ష్మారెడ్డి,దుర్గపతి, తిగుల్ల స్వామి, గోపాల్ నాయక్, శేఖర్,రవి, యాదగిరి, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు యువజన విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

ప్రజావాణి,నంగునూరు,సెప్టెంబర్ 07 : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు వెళుతున్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్ష నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నంగునూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు.మండల కేంద్రంలోని వివేకానంద సర్కిల్ వద్ద నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో తమ వాణిని వినిపించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రాస్తారోకో, ధర్నా కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజావాణి):-ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు.అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు 9, ఇందిరమ్మ ఇండ్లు 1, పింఛన్లు 1, ఉద్యోగాలు 15, ఇతర శాఖలకు సంబంధించినవి 10 కలిపి మొత్తం 36 దరఖాస్తులు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

మేర సంఘానికి స్థలం కేటాయించాలి

● కుట్టుమిషన్ పథకంలో మేర కుల వృత్తిదారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 7 :నంగునూరు మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేర సంఘానికి ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకంలో మేర కుల వృత్తిదారులను 50 శాతం ముందుగానే గుర్తించి, వారికి పథకం ద్వారా కుట్టుమిషన్లు అందించాలని కోరుతూ సంబంధిత అధికారులకు అర్జీ సమర్పించారు.మేర కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారికి చేయూత అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. కుట్టుమిషన్లు అందించడం ద్వారా వృత్తిని కొనసాగించడంతో పాటు కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మేర సంఘం కార్యకలాపాల కోసం ప్రత్యేక స్థలం కేటాయిస్తే సంఘ సభ్యులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ మేరకు తమ డిమాండ్లను పరిశీలించి ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో అన్న రాజయ్య, కీర్తి ప్రవీణ్ కుమార్, కీర్తి శ్రీధర్, గూడూరి బేగిరావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో సమాధానం చెప్పలేకే బయట చిల్లర రాజకీయాలు

● హరీశ్‌రావు, కేటీఆర్‌పై టీపీసీసీ కార్యదర్శి : దేవులపల్లి యాదగిరి విమర్శలు

ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 7:అసెంబ్లీలో సమాధానం చెప్పలేకనే బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ బయట చిల్లర రాజకీయాలకు దిగుతున్నారని టీపీసీసీ కార్యదర్శి, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. సోమవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ...ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.అసెంబ్లీలో చర్చించే అంశం, మాట్లాడే దమ్ము లేకే బయట నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజాధనంతో నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల విలువైన సమయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వృథా చేయడం సిగ్గుచేటన్నారు. 22ఏ భూముల అంశంపై హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలు, ఆందోళనలు రాజకీయ డ్రామాలో భాగమేనని విమర్శించారు.కేసీఆర్ అవసరం లేదు.. మేమే సరిపోతాం, మా నాయకులే చాలంటూ గతంలో గొప్పలు చెప్పిన వారు ఇప్పుడు అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. తమను గెలిపించిన ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయాల కోసం సమయం వృథా చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మాజీ మంత్రులను చేసిన ప్రజలే భవిష్యత్‌లో మాజీ ఎమ్మెల్యేలుగా ఇంటికి పంపే రోజు దగ్గరలోనే ఉందని యాదగిరి హెచ్చరించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాగు శ్రీకాంత్ యాదవ్, నాగరాజుపల్లి మాజీ సర్పంచ్ చేర్యాల బాలయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గార్లపాటి విక్రమ్‌రెడ్డి, భాస్వరాజ్ రాములు, మొతకాని కనకయ్య, మొతకాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చందంపేట సొసైటీ అక్రమాలపై విచారణ జరిపించండి

● 90 లక్షల రూపాయల అవినీతి

● జిల్లా కలెక్టర్ కు విన్నతి పత్రం అందించిన బిజెపి నాయకులు మల్లారెడ్డి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 07, మన ప్రజావాణి:చందంపేట సొసైటీ అక్రమాలపై, సూరారం సొసైటీ బిల్డింగ్ రిపేరింగ్ పై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ అధికార ప్రతినిధి మల్లారెడ్డి సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ కు వినపత్రం అందించారు.సెక్షన్ 52 ప్రకారం ఎంక్వైరీ చేయాలని సూరారం లోని పాత సొసైటీ బిల్డింగ్ రిపేర్ పేరుమీద అవినీతి జరుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు.ఇంతకుముందు రెండు నెలల క్రితం డి సి ఓకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని,డిసీఓ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ లేని బిల్డింగ్ కు దబ్బులు మంజూరు చేయడం చైర్మన్, సీఈవో ఇద్దరు కుమ్మక్కైనట్లు పేర్కొన్నారు. ఎరువులపై కమిషన్ 9:50 లక్షల రూపాయలు కలిసి అవినీతికి పాల్పడడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది వెంటనే డిసిఓ ను పిలిచి పూర్తి నివేదిక తనకప్పగించాలని ఆదేశించినట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని డైరెక్టర్లు విన్నపత్రం డిమాండ్ చేశారు.

మొక్క నాటడం.. భవిష్యత్‌కు ఊపిరి పోయడం

చెన్నారావుపేట సెప్టెంబర్ 07 ప్రజావాణి పచ్చదనం పెంచితేనే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం అందుతుందని చెన్నారావుపేట జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు పచ్చదనం ప్రాధాన్యాన్ని చాటిచెప్పేందుకు సోమవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మానుపాటి పాపమ్మ మాట్లాడుతూ..ఒక్కో మొక్కను నాటడం అంటే భావితరాలకు ఒక్కో ఊపిరిని అందించడమే అన్నారు. చెట్ల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, వాటిని నిరంతరం సంరక్షించినప్పుడే ఆశించిన ఫలితం దక్కుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపే లక్ష్యంతో నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మానుపాటి పాపమ్మ, వేముల కిషోర్, పోలేపెల్లి రవి, అక్కెర ఉమాదేవి, కొక్కొండ రజిని, రావుల శ్రీనివాస్‌రెడ్డి, దయసంపల్లి మంజుల, సునీల్, రాజశేఖర్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ం

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

● శాంతిభద్రతలు, ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

● జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజావాణి):-వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.మండపాల వద్ద జూదం, అభ్యంతరకర ప్రసంగాలు, అవాంఛనీయ కార్యకలాపాలకు తావివ్వకుండా భక్తి కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని తెలిపారు. మసీదులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల సమీపంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రార్థనా సమయాల్లో మసీదుల సమీపంలోని మండపాల నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని కలెక్టర్ సూచించారు. డీజేలకు అనుమతి లేదని, మండపాల వద్ద భక్తిగీతాలను మాత్రమే వినిపించాలని స్పష్టం చేశారు.ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.
మండపాల వద్ద విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు, దీపాలను సురక్షితంగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్ల కోసం ముందుగానే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ప్రమాదాలకు తావులేకుండా నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించాలని తెలిపారు. పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీరు తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాఘవాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలి

■ పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని

■ సీపీఎం, బీఆర్ఎస్ నాయకుల విమర్శ

■ సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ గ్రామంలోని పేదల సొంతింటి కల నెరవేరకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఎం నాయకుడు కల్లెపల్లి అశోక్, బీఆర్ఎస్ నాయకుడు తాడిచెట్టి శ్రీకాంత్ విమర్శించారు.ఎన్నికల సమయంలో పేదలకు ఇళ్లు నిర్మిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో తీవ్ర జాప్యం చేస్తోందని వారు ఆరోపించారు. రాఘవాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ, ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించేలా ఉందన్నారు.పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చి, అనంతరం వారి సమస్యలను పట్టించుకోకపోవడం సరికాదని వారు మండిపడ్డారు. సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ నేపథ్యంలో సీపీఎం, బీఆర్ఎస్ గ్రామ శాఖల ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ రాములుకు వినతిపత్రం అందజేశారు. రాఘవాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు అనుమతులు, నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు.
రాఘవాపూర్‌లో అర్హులైన లబ్ధిదారుల జాబితాను స్పష్టంగా ప్రకటించాలని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి, పనులను ప్రారంభించాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేదలను ఇంకా ఎంతకాలం వేచి చూడమంటారని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా పేదల జీవితాలతో చెలగాటం ఆడటం మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని రాఘవాపూర్ ఇందిరమ్మ ఇళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే గ్రామస్థులను సమీకరించి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
పేదల సొంతింటి కలను కాగితాలకే పరిమితం చేయకుండా, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మోదుంపల్లి శ్రవణ్, కుమ్మరి నవీన్, శ్రీశైలం, సందీప్, ప్రకాష్, అభి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన, ఆదివాసీ హక్కులను కాపాడాలి: ఢిల్లీలో గిరిజన సంఘాల మహాధర్నా

■ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన వ్యతిరేక విధానాలు వీడనాడాలి

■ బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, మానుకోటలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

■ పోడు భూములకు పట్టాలు, ఖాళీ ఉద్యోగాల భర్తీకి డిమాండ్

దోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 7, ప్రజావాణి : గిరిజనుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న వివక్షను వీడనాడాలని, అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీ గిరిజనుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని షహీద్ పార్క్ (ఢిల్లీ గేట్) వద్ద భారీ మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ గిరిజన సంఘం , ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోరాటంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున గిరిజనులు, ఆదివాసీలు తరలివచ్చారు.?ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, నాయకులు భూక్యా వీరభద్రం నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు మాలోత్ కిషన్ నాయక్ ప్రసంగిస్తూ... దేశవ్యాప్తంగా గిరిజనులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గిరిజనులను వారి సాగుభూముల నుంచి బలవంతంగా వెళ్లగొట్టే కుట్రలను తక్షణమే విరమించుకోవాలని హెచ్చరించారు.
ప్రధాన డిమాండ్లు:
భూ హక్కుల పరిరక్షణ: అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి పోడు సాగుదారులందరికీ వెంటనే హక్కు పత్రాలు (పట్టాలు) అందించాలి.
ప్రాంతీయ అభివృద్ధి: విభజన చట్టం హామీ అయిన బయ్యారం ఉక్కు పరిశ్రమను వెంటనే స్థాపించాలి; మహబూబాబాద్ (మానుకోట) కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి.
?ఉద్యోగాల భర్తీ: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేసి, గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి.
మౌలిక సదుపాయాలు: గిరిజన గూడేలు, తండాల్లో నాణ్యమైన విద్య, కార్పొరేట్ స్థాయి వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించి రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడాలి.
?సమస్యలు పరిష్కారమయ్యే వరకు కేంద్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు.

ఈ మహాధర్నా కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఈశ్వర్, గోపి నాయక్, శోభన్, నేనావాత్ పార్వతి, శంకర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంథనిలో కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై సంబరాలు

● పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 7, ప్రజావాణి: కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, పెట్టుబడి సాయం తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉపాధ్యాయ నియామకాలు, యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.
పుట్ట మధు వ్యాఖ్యలపై ఖండన
మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు, ఓడేడు వంతెన తదితర అభివృద్ధి పనుల్లో లోపాలు ఉన్నాయని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలో 50 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ కార్యాలయ సముదాయం, మార్కెట్లు, విస్తృత రహదారుల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.
మంత్రి శ్రీధర్‌బాబు, దుద్దిళ్ల శ్రీనుబాబుపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వొద్నాల శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడుదుల వెంకన్న, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, విద్యుత్ బోర్డు సభ్యుడు శశిభూషణ్ కాచే, ఎస్సీ సెల్ నాయకులు మంథని సత్యం, మంథని రాకేష్, మాజీ మార్కెట్ చైర్మన్ ఉప్పట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఎరుకల ప్రవీణ్, నూకల బానయ్య, అజీమ్‌ఖాన్, దండవేన సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే బాటసారులు

● చెన్నారావుపేటలో ఘనంగా గురుపూజోత్సవం.. ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

చెన్నారావుపేట సెప్టెంబర్ 07 ప్రజావాణి విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, సమాజ నిర్మాణంలో గురువుల సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటశివానంద్ మాట్లాడుతూ.. ఒక విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించిన ప్రతిసారీ అతని విజయానికి వెనుక గురువు చేసిన కృషి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు తమ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు వారిని గుర్తించి సన్మానించాలని సూచించారు. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని నిలబెట్టేలా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలను అందించాలని కోరారు.మండల విద్యాశాఖ అధికారి మానుపాటి పాపమ్మ మాట్లాడుతూ.. పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా విద్యార్థులలో ప్రతిభను గుర్తించి, వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునేలా ప్రోత్సహిస్తూ, ఉన్నత శిఖరాలకు చేరే మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వేంకటేశ్వరరావు, ఉమాదేవి, సురేష్, రవీందర్, కట్టస్వామి, మంజులరాణి, కుమారస్వామి, ఈర్యా, సునీత, వేదప్రకాష్, సత్యపూర్ణిమ, రాజులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తేజావత్ జయ, అంగోతు భద్రయ్య, పెద్ది వెంకటేశ్వరరావు, ఈదునూరి రవీందర్‌రెడ్డి, సురేష్, పోలేపల్లి రవి, ఇల్ల సూరయ్య, కట్టస్వామి, రవీందర్, బానోతు వెంకన్న, సుధాకర్‌రెడ్డి, జ్యోతి, వేదప్రకాష్, ఉమాదేవి, సత్యపూర్ణిమ, సునీత, మంజులరాణి, రాజు, రమేష్, సత్యనారాయణ, రమణయ్య, మాధురి, ఉమాశంకర్, శ్రీనివాస్,ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆహారమే ఆరోగ్యానికి తొలి ఔషధం

● జయముఖి ఫార్మసీ కళాశాలలో పోషకాహార వారోత్సవాల సందర్భంగా అవగాహన ప్రదర్శన

చెన్నారావుపేట సెప్టెంబర్ 07 ప్రజావాణి ఆరోగ్యానికి మందులే కాదు.. మనం తీసుకునే ఆహారమే తొలి ఔషధమని చాటిచెప్పేలా మండల కేంద్రంలో సోమవారం జయముఖి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జాతీయ పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో పండ్లు, కూరగాయలు, సహజ ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ వాటిలోని పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వాసుదేవ మూర్తి మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలిలో ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌కు యువత ఆకర్షితులవుతున్నారని, దీనివల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. రసాయన మందులపై పూర్తిగా ఆధారపడకుండా.. పోషకాలు సమృద్ధిగా ఉండే సహజ ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే కాలానుగుణ పండ్లు, కూరగాయలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. న్నపండ్లలో ఆరోగ్యం.. పదార్థాల్లో పోషక విలువలు ప్రదర్శనలో యాపిల్‌లోని పీచు పదార్థం, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్ల ప్రాధాన్యతను విద్యార్థులు వివరించారు. దానిమ్మ రక్తహీనత నివారణకు, బత్తాయి విటమిన్ సి ద్వారా రోగనిరోధక శక్తికి, క్యారెట్‌లోని బీటా కెరోటిన్, విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ఉపయోగపడతాయని తెలిపారు. మజ్జిగ జీర్ణక్రియకు మేలు చేసే సహజ ప్రోబయోటిక్‌గా పనిచేస్తుందని, తేనెకు సహజ యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయని వివరించారు. పోషకాహారం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచడంతో పాటు.. సమతుల్య ఆహారాన్ని అలవాటుగా మార్చుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్వేత పర్యవేక్షించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

420 హామీలు అమలు చేయాలి.. నడికూడ ఎంపీడీఓకు ప్రజావాణి వినతి

● తెలంగాణ ఉద్యమ సమితి జిల్లా అధ్యక్షుడు లింగాల తిరుపతి

నడికూడ, సెప్టెంబర్ 7 (ప్రజావాణి ప్రతినిధి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 ప్రకటనలు, ఆరు హామీ పథకాలను తక్షణమే అమలు చేసి అర్హులైన కుటుంబాలకు ప్రయోజనాలు అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆదివారం నడికూడ మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నడికూడ మండల అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లింగాల తిరుపతి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించి అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. వెయ్యి రోజుల పాలన పూర్తయినప్పటికీ అనేక హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.
ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, ద్విచక్ర వాహనం అందించాలని కోరారు. రైతులకు ప్రతి పంటకు రైతు భరోసా, ఎరువుల కొరత లేకుండా పంపిణీ, పంటలకు అదనపు ప్రోత్సాహకం, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు.ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందించి ఉద్యోగ నియామక ప్రణాళికను అమలు చేయాలని కోరారు. విద్యార్థులకు విద్యా భరోసా కింద పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.
వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, బీడీ కార్మికులు, వయోవృద్ధులకు పెంచిన రూ.4 వేల పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు, యువత, రైతులకు ఇచ్చిన అన్ని ప్రకటనల హామీలను అమలు చేయాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ అరెస్టులు చేస్తున్నారంటూ ఆరోపిస్తూ, ఇటువంటి చర్యలను



నిలిపివేయాలని కోరారు.ప్రజావాణి కార్యక్రమంలో నడికూడ మండల సమన్వయ సమితి సభ్యులు చంద్ర కుమారస్వామి, భీమిడి నాగిరెడ్డి, సుదాటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల నాయకులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తి విఫలం

■ బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులకు నిరసనగా మెదక్- చేగుంట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించిన బిఆర్ఎస్ శ్రేణులు

■ వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు ఇంకా నెరవేర్చలేదు

■ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకీపడ్డ విషయాలపై ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్07, మన ప్రజావాణి: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు వెయ్యి రోజుల కాంగ్రెస్ వైఫల్య పాలనకు నిరసనగా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో మండల కేంద్రానికి చేరుకొని స్థానిక ఎంపీడీవో దామోదర్ కి వినతి పత్రం అందించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరిరాజు, సుంకరి కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని వెంటనే ప్రభుత్వం స్పందించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు హామీలతో పాటు 420 గ్యారంటీలను నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని వదిలేది లేదని అన్నారు.బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టుకు నిరసనగా మెదక్- చేగుంట రోడ్డుపై రాస్తారోకో
రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టు నిరసిస్తూ మెదక్‌బి చేగుంట రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతి

నిధులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. రోడ్డుపై బైఠాయించడంతో అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే అక్కడికి చేరుకున్న స్థానిక ఎస్సై శివానందం బిఆర్ఎస్ నాయకులను సముదాయించి ధర్నా విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరిరాజు, మండల నాయకుడు స్వతంత్ర కుమార్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, సర్పంచులు మరియు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల నాయకులు,సొసైటీ చైర్మన్లు, కార్యకర్తలు, విద్యార్థి యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగాపురిలో గడ్డి మందు పిచికారీ

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 7, ప్రజావాణి:మంథని మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు గంగాపురిలో పరిసరాల్లో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కల నివారణకు మున్సిపల్ సిబ్బందితో గడ్డి మందు పిచికారీ కార్యక్రమాన్ని 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు చేపట్టించారు.వార్డులో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు, గడ్డి మరియు పిచ్చి మొక్కల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ వార్డులో అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

జీలకుంటలో కోతులు, కుక్కల బెడద

● ఇళ్లలోకి చొరబడి దాడులు.. ● పిల్లలు, వృద్ధుల్లో భయాందోళనలు

● కోతుల దాడిలో గాయపడిన సర్పంచ్ రాగిడి మంగ

ఓదెల:ఓదెల మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కోతులు, కుక్కల బెడద రోజు రోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యం గా ఓదెల మండలం జీలకుంట గ్రామంలో కోతుల సంఖ్య విపరీతంగా పెరగడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా కోతులు ఇళ్లపై, వీధుల్లో సంచరిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇంటి తలుపులు తెరిచి ఉంటే చాలు కోతులు ఇళ్లలోకి చొరబడి నిత్యావసర సరుకులు, పప్పులు, కూరగాయలు తదితర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద కారణంగా ఇంటి తలుపులు మూసుకుని బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు. కోతులు పంట పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు కూడా నష్టపోతున్నారు.ఇటీవల కోతుల దాడిలో జీలకుంట సర్పంచ్ రాగిడి మంగ సైతం గాయపడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. “కోతుల నుంచి తనకే రక్షణ లేకపోతే గ్రామస్తులను ఎలా రక్షించగలను” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కోతుల సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో పాటు వినతిపత్రాలు కూడా సమర్పించినట్లు తెలిపారు.కోతుల సంతానం రోజురోజుకూ పెరుగుతుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోందని సర్పంచ్ పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో కోతుల సమస్యను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కోతులను పట్టుకుని వాటి సంతానోత్పత్తిని నియంత్రించే విధంగా శాస్త్రీయ పద్ధతుల్లో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.కుక్కల బెడదతోనూ భయాందోళనలు కోతులతో పాటు గ్రామంలో కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, ముఖ్యంగా పిల్లలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొందరు గ్రామస్తులు కుక్కల దాడుల్లో గాయపడినట్లు పేర్కొన్నారు. కుక్కల దాడుల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.కోతులు, కుక్కల సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడుతుందని సర్పంచ్ రాగిడి మంగతో పాటు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కోతులు, కుక్కల బెడదను అరికట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి సామాజిక కార్యకర్త, జీలకుంట సర్పంచ్

420 హామీలపై ప్రజావాణి సమరభేరి

● అమలు కాని హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ నిలదీత

● తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

ప్రజావాణి ప్రతినిధి సుమన్ మండల
ఆత్మకూర్, సెప్టెంబర్ 7: ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలన ప్రారంభించి వెయ్యి రోజులు గడుస్తున్నప్పటికీ అనేక హామీలు అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణి సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీల్లోనూ కొన్ని పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు కూడా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, సమన్వయ కమిటీ సభ్యులు కాంతాల కేశవరెడ్డి, బొల్లబోయిన రవియాదవ్, సావురే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నీరుకుల్ల, పెంచికపేట, లింగమడుగుపల్లె గ్రామాల సర్పంచులు తడుక నీరజ--శ్రీనివాస్, మందపెల్లి మరియ--ప్రసాద్, వేముల నవీన్‌తో పాటు అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ సర్పంచులు, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల డేటా.. ఎవరి కోసం?

చెన్నారావుపేట సెప్టెంబర్ 07 ప్రజావాణి

రైతుల పొలాల్లో పైపులు, పరికరాలు ఏర్పాటు చేస్తూ పాస్‌బుక్ వివరాలు, ఫొటోలు, భూమి--పంట సమాచారాన్ని సేకరిస్తున్న (మిట్టి ల్యాబ్స్--త్రయి) వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని మండల కేంద్రంలోని జల్లి గ్రామానికి చెందిన సమాచార హక్కు పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి డిమాండ్ చేశారు.ఎకరానికి రూ.1,000 ప్రయోజనం అందుతుందని రైతులకు చెబుతున్న నేపథ్యంలో ఆ నగదు ఎవరు చెల్లిస్తారు.. ఏ పథకం కింద ఇస్తారో స్పష్టం చేయాలని కోరారు.రైతుల నుంచి డేటా సేకరణకు సమ్మతి తీసుకున్నారా.. సేకరించిన సమాచారం ఎవరి ఆధీనంలో ఉంది.. ఎవరితో పంచుకుంటున్నారు అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలన్నారు.పొలాల్లో పరికరాల ఏర్పాటుకు అనుమతులు, సంస్థల మధ్య ఒప్పందాలు, రైతుల సమ్మతి తదితర రికార్డులను అధికారులు పరిశీలించాలని సూచించారు.డేటా సేకరణలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది నియామకం, పారితోషికం, శిక్షణ, విధులు, వారికి ఇచ్చిన అధికారాలపైనా విచారణ జరపాలని కోరారు.కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి వాస్తవాలను వెల్లడించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కాట కుమారస్వామి అన్నారు.

హత్య యత్నం కేసులో ఒకరికి రిమాండ్

మద్దూరు సెప్టెంబర్ 7, ప్రజావాణీ, మండలంలోని హనుమ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహారాజ్ తండాకు చెందిన సభావత్ దేవేందర్ 5 సంవత్సరాల క్రితం తన అన్న కొడుకైన సభావత్ రాజేష్ వద్ద ఒక గుంటన్నర భూమిని కొనుగోలు చేశాడు.ఆ భూమిని సదరు రాజేష్ తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నాడనే విషయంలో మరియు వారి వ్యవసాయ భూముల వద్దకు వెళ్ళు బాట విషయంలో కూడా గొడవలు జరుగుతున్నవి.ఈ క్రమంలో తేదీ 01.09.2026 నాడు ఉదయం వారు వ్యవసాయ బావి దగ్గర గొడవ జరగిన అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత, మధ్యాహ్నం 12 గంటలకు దేవేందర్ కత్తితో రాజేష్ పై దాడి చేయగా అతడి తల వెనుక భాగంలో రక్త గాయం కాగా. ఈ విషయంలో మద్దూరు పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా,హత్య యత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడైన సభావత్ దేవేందర్ ను ఈరోజు 7/9/26 రోజున అరెస్ట్ చేసి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ చేర్యాల ముందు హాజరు పరచగా రిమాండ్ కు తరలించినట్లు మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్ ఒక ప్రకటనలో విలేఖర్లకు తెలిపారు.

నర్సింహులగూడెం సబ్ స్టేషన్ ప్రారంభించాలి..

- **మునిగలవీడు విద్యుత్ ఫీడర్ ఛానల్ బదిలీ చేయాలి..**
- **కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పాపారావు**

ప్రజావాణి,నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన రైతులు ప్రజల కరెంటు కష్టాలు తీరడానికి నరసింహుల గూడెం విద్యుత్ నూతన సబ్ స్టేషన్ కు మునిగల వీడు విద్యుత్ ఫీడర్ను బదిలీ చేయాలని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నల్లాని పాపారావు సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం సబ్ స్టేషన్ వద్ద మునిగలవీడు గ్రామానికి చెందిన విద్యుత్ సమస్యను విలేకరులకు వివరించారు. మునిగల వీడు సమీపంలోని కరెంటు సబ్ స్టేషన్ కు నాలుగు ఫీడర్లు ఉండగా సంబంధిత పరిధిలో చాలా కిలోమీటర్ల మేర విద్యుత్ సరఫరా కావడంతో మునిగలవీడుకు కరెంటు సరఫరా లో తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. సంబంధిత గ్రామానికి కరెంటు సమస్య తీవ్రత దృష్ట్యా రైతులు,గ్రామస్తులు సబస్టే షన్ ఎదుట పలుమార్లు ధర్నాలు రాస్తారోకాలు చేసినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు,ఉలుకూ పలుకు లేకుండా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
నర్సింహులగూడెం నూతన సబ్ స్టేషన్ ప్రారంభానికి సిద్ధమై చాలా నెలలు కావస్తున్న ప్రారంభించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెంటనే ప్రారంభించి మునిగల వీడు ఫీడర్ ఛానల్ ను అటాచ్ చేయాలని సంబంధిత విద్యుత్ అధికారులైన ఎస్సి,డిఈ, స్థానిక ఏఈ లకు పాపారావు విజ్ఞప్తి చేశారు.

BRS పార్టీ నాయకులు మేకల మధు సుధన్ రెడ్డి అక్రమ అరెస్టులపై

- **ఉప్పల్ ఎం ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి ఆగ్రహం**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 7 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల మీద అక్రమ కేసుల మీద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై నిరసన వ్యక్తం చేసినందుకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు.ప్రజాపాలన అంటే ప్రజల గొంతు నొక్కడం కాదు ప్రజల సమస్యలను పరిష్కరించడం. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీల అమలుపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకులపై నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తే అది సాధ్యం కాదని స్పష్టం చేశారు.నాయకులను అరెస్టు చేయగలరు కానీ ప్రజల గొంతును అరెస్టు చేయలేరు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాటం చేయడాన్ని ఆపే ప్రసక్తే లేదు అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు .ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, అక్రమ అరెస్టులకు స్వస్తి పలికి ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల కోసం ప్రశ్నిస్తాం ప్రజల కోసం పోరాడుతాం అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

ఎస్ ఐ ఆర్ క్షేత్రస్థాయి నోటీసుల పంపిణీ

- **అభ్యంతరాలుపరిశీలన తహసిల్దార్ శివప్రసాద్**

చిలిపిచెడ్. సెప్టెంబర్ 7 ప్రజావాణి మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం లో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్ గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ 2026) మరియు క్షేత్రస్థాయి నోటీసుల పంపిణీ, పరిశీలన ప్రక్రియను చిలిపిచెడ్ తహసిల్దార్ నేతృత్వంలో సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ యస్) చేపట్టిన ఇంటింటి సర్వే, జారీ చేసిన ఎస్ ఐ ఆర్ నోటీసులు మరియు అందిన అభ్యంతరాల దరఖాస్తులను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్క ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, అలాగే తొలగింపునకు గురైన లేదా నోటీసులు అందిన ఓటర్లు నిబంధనల ప్రకారం తమ తగిన ధృవీకరణ పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల స్వీకరణ గడువులోగా ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా ముగించాలని స్పష్టం చేశారు.ముఖ్యాంశాలు:గ్రామస్థాయి పరిశీలన: ఫైజాబాద్‌లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితా ప్రదర్శన మరియు సవరణల పరిశీలన.నోటీసుల స్పష్టత: మరణించిన, వలస వెళ్లిన లేదా ద్వంద్వ నమోదు ఉన్న ఓటర్లకు అందిన నోటీసులపై తగిన ఆధారాలతో సమాధానం ఇవ్వవలసిన విధానంపై సమీక్ష.అధికారుల ఆదేశాలు: గ్రామ ప్రజలు మరియు స్థానిక యువకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శివప్రసాద్ జి పి ఓ రాధాకృష్ణ ,సర్పంచి రాములు ,శశికళ గ్రామ పెద్దలు పాల్గొన్నారు

గరిడేపల్లి బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతులు కల్పించాలి

- **26 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌పై ప్రజా సంఘాల నిరసన**
- **ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్**

గరిడేపల్లి, సెప్టెంబర్ 7(ప్రజావాణి)సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్‌ను తక్షణమే అభివృద్ధి చేసి ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ MRPS, BRS, AITUC, మీ్రాతో పాటు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి దత్తత గ్రామంగా గరిడేపల్లికి గుర్తింపు ఉన్నప్పటికీ, గ్రామంలో అనేక ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ముఖ్యంగా గ్రామంలో గ్రంథాలయం లేకపోవడంతో పాటు, 26 సంవత్సరాలుగా బస్టాండ్ సౌకర్యాలు మెరుగుపడకపోవడం బాధాకరమన్నారు.
2000 సంవత్సరంలో ప్రజల దబ్బుతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గరిడేపల్లి బస్టాండ్ నేడు శిథిలావస్థకు చేరిందని ఆరోపించారు. 26 ఏళ్లుగా సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నామమాత్రపు పనులు చేపట్టి బస్టాండ్‌లో ఎలాంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.
బస్టాండ్‌లో ప్రధాన సమస్యలు ఇవే..
– ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు: బస్టాండ్ పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే మార్గం బురదమయంగా మారుతోందని, సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు.
– కనీస వసతులు కరువు: టాయిలెట్లు, తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, కుర్చీలు, ఎంక్వయిరీ కౌంటర్, సీసీ కెమెరాలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగుతున్నప్పటికీ ఆయా గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదన్నారు.
– అపరిశుభ్ర వాతావరణం: బస్టాండ్‌కు ప్రహరీ లేకపోవడంతో చుట్టుపక్కల చెత్త, కంప, పాములు, జంతువుల కళేబరాలతో దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. ఇక్కడ మనుషులు కూడా మృతి చెందిన ఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
– నిర్మాణ లోపాలు: బస్టాండ్ స్థలం కిందికి ఉండటంతో వర్షం పడినప్పుడు నీరు నిలిచిపోతుందని, ముందు రోడ్డు మట్టిగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పక్కనే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండటం కూడా సమస్యగా మారిందన్నారు. – అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది: బెల్ట్ షాప్‌కు అనుమతి ఇవ్వడంతో పాటు బస్టాండ్ పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఆరోపించారు. బస్సుల నిలుపుదలపై అభ్యంతరం: రెండు వైపులా వెళ్లే బస్సులను బస్టాండ్‌లో సక్రమంగా నిలపకపోవడంతో ప్రజా రవాణాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు.
పోలీస్ స్టేషన్ స్థలంలో కొత్త బస్టాండ్ నిర్మించాలి
గరిడేపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రస్తుత పోలీస్ స్టేషన్ స్థలంలో నూతన బస్టాండ్ నిర్మించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో బస్టాండ్ నిర్మిస్తే ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని, షాపింగ్ మాల్స్, జనరల్ స్టోర్స్, షట్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్టీసీకి కూడా ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు.అవసరమైతే ప్రస్తుత బస్టాండ్ ఉన్న స్థలానికి పోలీస్ స్టేషన్‌ను తరలిస్తే పోలీసులకు కూడా ప్రశాంతమైన, అనుకూలమైన వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి బస్టాండ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.పాల్గొన్నవారుఈ కార్యక్రమంలో MRPS గరిడేపల్లి మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి, హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, AITUC మండల అధ్యక్షులు బెజ్జం రమేష్, BRS మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ప్రధాని సైదులు, PACS మాజీ చైర్మన్ శంబిరెడ్డి, జై భీమ్ కమిటీ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రవి, MRPS నాయకులు ఆలంపల్లి శేఖర్, పిట్ట నాగరాజ్, BRS నాయకులు షేక్ మన్సూర్ అలీ, తెలంగాణ మలిదశ ఉద్యమకారులు పెండెం ధనయ్య గౌడ్, పెండెం వినోద్, MRPS గ్రామ శాఖ అధ్యక్షులు పిట్ట వెంకటేష్, నకిరేకంటి సతీష్, మచ్చ మట్టయ్య, కొత్తపల్లి పవన్, మచ్చ ఆదాం తదితరులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

విద్యార్థుల ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి

- **స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్‌లు విడుదల చేయాలని ఏబీఎస్ఎఫ్ ఆందోళన**
- **కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద నిరసన.. సీఎం దిష్టిబొమ్మ దహన యత్నం**
- **ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్**

ప్రజావాణి ప్రతినిధి సెప్టెంబర్ 7హనుమకొండ: విద్యార్థి, నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏబీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ విమర్శించారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద విద్యార్థులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు సకాలంలో అందకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు విద్యార్థులు పై తరగతులకు వెళ్లలేక, మధ్యలోనే చదువును మానేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
విద్యార్థుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఒక్కరోజైనా సమగ్రంగా స్పందించారా అని ప్రశ్నించారు. విద్యారంగానికి సంబంధించిన సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటివరకు విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు.నిరుద్యోగ యువతకు కూడా ప్రభుత్వం సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని మంద నరేష్ ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు నిరాశే మిగులుతోందని, విద్యార్థుల--నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వాలకు ఎదురైన పరిణామాలే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికీ ఎదురవుతాయని పేర్కొన్నారు.అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ఏబీఎస్ఎఫ్ నాయకులు ప్రయత్నించగా, కేయూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.
ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు బండారి శ్రీనివాస్, అర్షం రాహుల్, రాంకిరణ్, సాయి, శ్రీను, వెంకటేష్, సూర్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులకు నిరసనగా బోడుప్పల్లో ధర్నా

- **బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కుతున్న కాంగ్రెస్**
- **అసెంబ్లీ సమావేశాలను 30 రోజులు నిర్వహించాలి**
- **కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజావాణిలో ఫిర్యాదులు**
- **మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన ధర్నా**

మేడిపల్లి సెప్టెంబర్ 07(మన ప్రజావాణి) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ గత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.ఈ అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమై ప్రజా గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తారని భయంతో రేవంత్ రెడ్డి సర్కార్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టులు చేసి నిర్బంధాలకు గురిచేస్తుందని,ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నిరసన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రజాప్రతినిధులను అరెస్టు చెయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్దమని అన్నారు.6 గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్,ఇప్పుడు హామీల అమలును గాలికొదిలేసిందని కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రశ్నిస్తారని భయంతో రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా నిర్బంధించి,వేధిస్తున్నారని ఇది కాంగ్రెస్ నియంత పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. తక్షణమే బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను నిలిపివేసి అసెంబ్లీ సమావేశాలను 30 రోజులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్,కాటపల్లి రాంచంద్రారెడ్డి,బందారం శ్రీధర్‌గౌడ్,కాటం రాజిరెడ్డి,అలీ,బందారం నాగేష్ గౌడ్,తాల్క శత్రజ్ఞ,బొడగల్ల సదానంద్,దేవరాజు, కృష్ణగౌడ్,యువజన నాయకులు ఉప్పరి విజయ్,మైసగల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడా పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన

- **విద్యార్థుల్లో జ్ఞానం, సంస్కార విలువలు పెంపొందించడమే లక్ష్యం**

ప్రజావాణి నడి కూడా ప్రతినిధి సెప్టెంబర్ 7 నడికూడా: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాసవి సంఘం ఆధ్వర్యంలో సోమవారం సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో జ్ఞానం, విజ్ఞానం, సంస్కార విలువలను పెంపొందించే ఉద్దేశంతో పాఠశాల ఆవరణలో సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వాసవి సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యకు అధిదేవతగా భావించే సరస్వతీ మాత ఆశీస్సులతో విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.పాఠశాలల్లో విద్యతో పాటు నైతిక విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం కూడా అవసరమని పలువురు పేర్కొన్నారు. సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపనతో పాఠశాల వాతావరణంలో ఆధ్యాత్మికతతో పాటు విద్యాపట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కె. హనుమంతరావు, నడికూడా మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వాసవి సంఘం ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

అక్షరం ఆయుధం.. అక్షరాస్యతే అభివృద్ధికి తొలిమెట్టు

- నేడు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం..
- ప్రతి ఒక్కరికీ విద్య అందించడమే లక్ష్యం

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 7, ప్రజావాణి:
అక్షరం మనిషి జీవితాన్ని మార్చే శక్తివంతమైన సాధనం. చదువు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా వ్యక్తి ఆలోచనా విధానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, జీవన ప్రమాణాలను మార్చుతుంది. అక్షరాస్యతతోనే హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ పథకాలు, సామాజిక పరిణామాలపై అవగాహన పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహిస్తున్నారు.

అక్షరాస్యతకు అంతర్జాతీయ గుర్తింపు

1966లో యునెస్కో సెప్టెంబర్ 8ను అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంగా ప్రకటించింది. 1967 నుంచి ఈ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోని ప్రతి వ్యక్తికి చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం వంటి ప్రాథమిక సామర్థ్యాలు కల్పించడంతో పాటు, జీవితాంతం నేర్చుకునే అవకాశాలను ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశం.

చదువుతోనే సాధికారత

అక్షరాస్యత పెరిగితే పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, ఉపాధి అవకాశాల పెంపు, ఆరోగ్య పరిరక్షణ, బాలల విద్య, సామాజిక సమానత్వం వంటి అంశాల్లో గణనీయమైన మార్పులు వస్తాయి. ముఖ్యంగా మహిళలు అక్షరాస్యులైతే కుటుంబ ఆరోగ్యం, పిల్లల విద్య, ఆర్థిక నిర్వహణపై అవగాహన పెరిగి మొత్తం కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

డిజిటల్ యుగంలో కొత్త అర్థం

ప్రస్తుత కాలంలో అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం

మాత్రమే కాదు. డిజిటల్ అక్షరాస్యత కూడా అత్యవసరంగా మారింది. ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ సేవలు, సమాచార వినియోగం, సైబర్ మోసాల పట్ల అప్రమత్తత వంటి అంశాల్లో కనీస పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమవుతోంది.

ఎవరూ చదువుకు దూరం కాకూడదు

పాఠశాల వయసు దాటిన వారిలోనూ చదువుపై ఆసక్తి పెంచడం, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, పిల్లలను బడిలో చేర్పించి మధ్యలో చదువు మానకుండా చూడటం సమాజం మొత్తానికి బాధ్యత. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం తోడైతే అక్షరాస్యత లక్ష్యాలను మరింత వేగంగా



సాధించవచ్చు.'ఒక్క అక్షరం.. ఎన్నో అవకాశాలు' అన్న భావనతో ప్రతి ఒక్కరూ చదువును జీవితంలో భాగం చేసుకున్నప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. అక్షరాస్యతను ఉద్యమంగా మార్చి ప్రతి ఇంట్లో విద్యా వెలుగులు నింపాల్సిన అవసరం ఉంది.

కలగా మారిన సర్కార్ దవాఖాన పక్కా భవనం

- 24 గంటల ఆసుపత్రిలో సదుపాయాల కరువు...?
- ఉన్న సదుపాయాలతో నిత్యం 250 పైగా ఓపీలు
- సోమవారం 383 మంది రోగులు

నేలకొండపల్లి ప్రతినిధి మన ప్రజావాణి సెప్టెంబర్ 7 సోమవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండల కేంద్రంలో సామాజిక హెల్త్ సెంటర్ (సిహెచ్) ఆస్పత్రి శిధిలావస్థకు చేరి గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గదులను సైతం వాడుకుంటున్నట్లు ఆ మేరకు ఇటీవల అధికారికంగా మార్పులు చేర్పులు చేసినట్లు తెలిసింది. నిత్యం మండల వ్యాప్తంగా గర్భిణీ స్త్రీలు బాలింతలు కుక్క కాటు ఇలా రకరకాల సమస్యలతో 24 గంటల ఆసుపత్రికి రాకపోకలు సాగిస్తూ వైద్య సేవలు పొందుతున్నట్లు రోజువారి 250 మందికి పైగా సేవలు పొందుతున్నట్లు తెలిసింది. పైగా ప్రభుత్వాసుపత్రిలో ఓపీలకు తగ్గట్టుగా కనీస సౌకర్యాలు లేవని సమాచారం. భవనం కొన్నిచోట్ల శిధిలావస్థకు చేరిందని పలువురు రోగులు అంటున్నారు. ఈ సెంటర్లో అన్ని వైద్య సేవలు అందించేందుకు గాను ప్రధాన

మౌలిక సదుపాయాలతో పాటు ఎక్స్రే రే స్కానింగ్ సదుపాయాలు పక్కా భవనం నిర్మాణం జరగాలని పలువురు మండల ప్రజలు రోగులు కోరుతున్నారు. కాగా సోమవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని ఆసుపత్రికి సుమారు 383 మంది రోగులు వైద్య పరీక్షలు పొందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా ప్రస్తుతం 30 బెడ్స్ తో వైద్యశాల ఉన్నట్లు పెరుగుతున్న ఓపి ప్రజల అవసరాలకు మేరకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కనీస సౌకర్యాలతో పాటు పక్కా భవనం మంజూరు చేసి 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని ఈ దిశగా జిల్లా కలెక్టర్ సంబంధిత వైద్య విధాన పరిషత్ ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం

- ప్రజావాణిలో 420 హామీల అమలుపై బీఆర్ఎస్ వినతిపత్రాలు
- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి విమర్శ

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అనంతరం వాటి అమలును విస్మరించిందని

విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుందని అన్నారు.మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాలకు కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని, అయితే వాటిలో చాలావరకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు.

ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను స్పష్టమైన కాలపరిమితితో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసే వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలు, యువత, విద్యార్థులు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

స్పీకర్ గా ఉన్న దళిత నాయకుడి ని కించ పరచడం సరికాదు

- దళితుల పట్ల బీఆర్ఎస్ అహంకారం మారలేదు
- తాతా మధుసూదన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన నాయకులు.
- ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాంపెల్లి శ్రీనివాస్.

ప్రజావాణి,, ముస్తాబాద్ దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకుల అహంకార వైఖరి ఇంకా మారలేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ ముస్తాబాద్ మండల అధ్యక్షులు కాంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి దేవాలయంగా భావించే శాసనసభకు స్పీకర్‌గా ఉన్న దళిత నాయకుడిని కించపరిచేలా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమన్నారు. ఒక ప్రజాప్రతినిధి హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి భాషను ఉపయోగించడం సభ్య

సమాజం తలదించుకునే విషయమని పేర్కొన్నారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న దళిత నాయకుడి గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించబోమని కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. స్పీకర్‌ను గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు.తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీగా ఉన్న తాతా మధుసూదన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

తాతా మధు ఖబర్దార్

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరైనా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ప్రతిఘటిస్తామని కాంపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలను ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలన,కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న తీరుపై ప్రజావాణిలో మండల యంపిడివో , యంఆర్వో, కు వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్ మండల నాయకులు.

పెద్దవంగర సెప్టెంబర్ 07 ప్రజావాణ 6 గ్యారింటీలు,13 డిక్లరేషన్లు,420 హామీలు ఎక్కడ అంటూ ప్రధాన ప్రజా సమస్యలపైన మాట్లాడిన బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు 26 గ్రామ పంచాయతీల్లో మంజూరు చేసిన పనులను త్వరత్వరగా ప్రారంభించాలని కోరారు. రైతులకు రుణమాఫీ,రైతుభరోసా సకాలంలో అందకపోవడం,పంటలకు గిట్టుబాటు ధర,ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ,మహిళలకు 2,500 ఆర్థిక సాయం అమలు చేయకపోవడం,వృద్ధులు,వితంతువులు, వికలాంగుల పెన్షన్లపై నిర్లక్ష్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు,నిరుద్యోగ భృతి అందకపోవడం,విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటం ,పేదలకు ఇందిరమ్మ ఇళ్లు,ఇళ్ల స్థలాల విషయంలో జాప్యం ,పెరుగుతున్న ధరలు,విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలపై ఆర్థిక భారం. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, మండల ప్రధానకార్యదర్శి శ్రీరాం సంజయ్,మండల నాయకులు శ్రీరాం సుధీర్,సర్పంచ్లు కాసాని హరీష్,గూగులోతు కవిత,మాజీ సర్పంచ్లు దుంపల సమ్మయ్య,విశ్వనాథుల జ్ఞానేశ్వర్ చారి,సల్దండి సుధాకర్,చింతల భాస్కర్,ధారావత్ రాజేందర్,ధారావత్ భీమా నాయక్,గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మల విజయశ్రీనివాస్‌కేశబోయినకుమారస్వామి ,రెడ్డబోయిన గంగాధర్,పులిగిల్ల కుమారస్వామి, కూకట్ల వీరన్న, బానోతు శ్రీను,ధారావత్ బుజ్జమ్మ,రమేష్ మాజీ ఉప్పసర్పంచ్లు శ్రీరాం రాము,మేకల శ్రీను,మొరిగడుదుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు పులిగిల్ల పూర్ణచందర్,ఎర్ర వెంకన్న,బొమ్మిడి కృష్ణ రెడ్డి,మొగలగని హరీష్, వల్లపు పరమేష్ ,యూత్ నాయకులు దేశెట్టి మహేష్,శ్రీరాం నవీన్,కూతురు అనుదీప్,పోతుగంటి శ్రీశైలం, జాటోతు శంకర్,కోతి రాజు,ఆవుల సోమన్న, బొమ్మెరబోయిన కొమురయ్య, ఈదురు వెంకన్న,ధారావత్ గణేష్ తదితరులు పాల్గొనారు.

టిఆర్వి జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యం

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టిఆర్వి) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యనారాయణ నియమితులయ్యారు. గత 20 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన అనుభవం ఉంది. గతంలో బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి, సామాజిక, రాజకీయ రంగాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయనను తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేస్తానని సత్యనారాయణ తెలిపారు.-మల్లన్నకు కృతజ్ఞతలు..తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకు దామళ్ళ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్మాణానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అన్నదానం మహాదానం

- కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్

జహీరాబాద్, (ప్రజావాణి) సెప్టెంబర్ 7 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.జహీరాబాద్ పట్టణంలో కైలాసగిరి శివాలయంలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన నామ కుటుంబ సభ్యులు. పవిత్ర శ్రావణ మాసం నాల్గవ (చివరి) సోమవారాన్ని పురస్కరించుకుని కైలాసగిరి శివాలయ క్షేత్రంలో మహా అన్న ప్రసాద సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రాచన్నపేట్‌కు చెందిన నామ పార్వతమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం ఘనంగా జరిగింది. చివరి శ్రావణ సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నామ స్రవంతి రవి కిరణ్, నామ సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు నామ రవి కిరణ్, నామ చంద్రశేఖర్, భూమా ప్రేమ్, ఆలయ అన్న ప్రసాద సేవకుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పవిత్రమైన రోజున భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అందుకో దండాలు బాబా అంబేద్కరా పాటకు పట్టాభిషేకం మద్దెల గిరి

- విశ్వజన కళామండలి 50వ స్వర్ణోత్సవ వేడుక

(ప్రజావాణి) సెప్టెంబర్ 7 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.రవీంద్రభారతిలో ఘనంగా మాస్టర్ జి జన్మదిన వేడుకలు ప్రజా వగ్గెయకారుడు, కవి, రచయిత మాస్టర్ జి అంబేద్కర్ గారి పై రాసిన అందుకో దండాలు బాబా అంబేద్కరా పాట పాడి నేటితో యాభై యేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ లొని రవీంద్రభారతిలో స్వారనోత్సవ కార్యక్రమని ఘనంగా నిర్వహించరు.విశ్వజన కళ మండలి వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమనీకి ప్రముఖ దళిత నాయకులు జేబి.రాజు సభ అధ్యక్షులుగా వ్యాహరించిన కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ నాయకులు ఏమ్మెల్సీలు కోదండరాం, గోరేటి వెంకన్న, విమలక్క, హై కోర్ట్ న్యాయవాది, దయానంద్, నారగోని,మచ్చ దేవేందర్, నల్ల సూర్య ప్రకాష్, పశునారి రవీందర్, బాపంపల్లి మహేందర్, భాగ్య లక్ష్మి, సాయి ప్రసాద్, భీమ్ గిరి తదితరులు పాల్గొని పాటకు ప్రాణం పోసిన మాస్టర్ జి ని అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణి కి 7 దరఖాస్తులు

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 7, ప్రజావాణి:మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయములో సోమవారం ఎంపీడీవో, నోడల్ అధికారి శ్రీజా రెడ్డి, తాసిల్దార్ ఆరిఫోద్దీన్ పర్యవేక్షణలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ప్రజావాణి కార్యక్రమములో వివిధ శాఖల అధికారులు (17) మంది పాల్గొన్నారు.శాఖల వారిగా 7 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ఉపాధి కార్యాలయం R 02,రెవెన్యూ R 01,మున్సిపలUR 01,పంచాయతి రాజ్ R 03 దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించినట్లు ఎంపీడీవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి...

- **స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు...**

మన ప్రజావాణి ఖమ్మం టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 7రాయల నాగేశ్వరావు క్యాంప్ ఆఫీసులో మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించారని తాతా మధుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు....తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు..రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం మంచి పద్ధతి కాదు..స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు.. రాజ్యాంగ వ్యవస్థను,శాసనసభ గౌరవాన్ని అవమానించడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉంది...స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. ఆయనను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు..తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలి.తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా మాట్లాడినా కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి.శాసనసభ, స్పీకర్ పదవి పట్ల కనీస గౌరవం లేని విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలన్నారు..

రైతుల సేవే లక్ష్యంగా రైతు విశ్రాంతి భవనము నిర్మిస్తాం

- **ఏఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్**

ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,సెప్టెంబర్07:వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ 3వ సమావేశం తెలంగాణ శాసనసభపతి వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం.ప్రసాద్ కుమార్ అనుమతి తో ఏఎమ్ సి చైర్మన్ చాపల.శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన వైస్ చైర్మన్ మల్లేశం మరియు డైరెక్టర్లు వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చ చేయడం జరిగింది ఈ సందర్భంగా అతి త్వరలో స్పీకర్ చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని అదే విదంగా రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఈరోజు సమావేశంలో రైతులు ధాన్యన్ని అమ్మిన తరువాత వివిధ కారణాల వల్ల తమ సొంత ఊర్లకు వెళ్లే సమయంలో ఆలస్యం జరుగుతే అదేవిదంగా తుఖాల్లో ఆలస్యం జరిగిన రైతులు బస చేసేందుకు వీలుగా రైతు విశ్రాంతి భవనము నిర్మించడానికి తీర్మానం చేశామని అదేవిధంగా మార్కెట్ కమిటీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ గోడలు నిర్మించాలని రైతులు కూర్చోవడానికి వీలుగా మార్కెట్ యార్డులో బెంచీలు ఏర్పాటు చేయాలనీ తీర్మానం చేసారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నీ విధాలా వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు సమావేశం అనంతరం రైతులతో కలసి పాలకవర్గం సభ్యులు మార్కెట్ యార్డులో ఉచిత భోజనం కార్యక్రమం రైతులతో కలిసి సహాపంక్తి భోజనం చేశారు ఈ సందర్భంగా రైతులు ఉచిత భోజనం పెట్టడం పట్ల ఎఏంసి చైర్మన్ ను మరియు సభ్యులని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎ ఏం సి సెక్రటరీ వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్లు విజేందర్ రెడ్డి, ప్రభాకర్, పాండురంగారెడ్డి,రంగారెడ్డి,రమేష్ నాయక్, రాజునాయక్, పాపిరెడ్డి,మిర్యానం సురేష్,నాగిరెడ్డి,బీమయ్య,వట్టం నర్సిములు తదితరులు పాల్గొన్నారు

మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరణ

- **జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.**

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజావాణి):-వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగాహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.చెరువుల్లో మట్టి మేటలను తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏ ఈ ఎస్, టి జి పి సి బి నోడల్ ఆఫీసర్ ములుగు అరుణ దేవి, డి పి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- **బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**

మేడిపల్లి సెప్టెంబర్ 07(మన ప్రజావాణి) కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ, ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శైలజకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు,13 డిక్లరేషన్లు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నార .కేవలం 100 రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు,వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ ముఖ్య డిమాండ్లు:

మహాలక్ష్మి పథకం: మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక

సాయం, తులం బంగారం, స్కూటీలను తక్షణమే పంపిణీ చేయాలి.ఆడ బిడ్డలకు పూర్తి రక్షణ కల్పించాలి,రైతాంగానికి భరోసా:ప్రతి పంటకు రైతు భరోసా,బోనస్ అందించాలి,కొరత లేకుండా ఎరువులు పంపిణీ చేయడంతో పాటు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి,రైతు కూలీలకు ఏడాదికి రూ. 12,000 సాయం అందించాలి. నిరుద్యోగులు, విద్యార్థులు:అర్హులైన యువతకు జాబ్ క్యాలెండర్,ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి చెల్లించాలి.విద్యార్థులకు విద్యా భరోసా పథకాన్ని వర్తింపజేసి,పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.?సంక్షేమ పథకాలు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు,బీడీ కార్మికులకు పెంచిన పింఛన్ రూ.4,000 తక్షణమే అమలు చేయాలి.ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 అందించాలి.నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు స్థలాలు ఇవ్వాలి. పారిశుద్ధ్యం,పాలన: పట్టణాలు,గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసిందని, వెంటనే చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. హామీలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని హెచ్చరించారు.ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన 420 హామీలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్,కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి,కౌడే పోచయ్య,మధుసూదన్ రెడ్డి,యూత్ అధ్యక్షులు ప్రభు,శ్యామల శ్రీనివాస్,

ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, బుల్లెట్ శంకర్,జిలాని పాషా,కిరణ్ నాయక్, అమర్ పటేల్,చిరంజీవి, ప్రవీణ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి.. జిల్లా కలెక్టర్ అంకిత్

- **ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి.**
- **ప్రజలకు చేరువగా ప్రజావాణి -- మండలాల్లోనూ నిర్వహణ..**

భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (07 సెప్టెంబర్ 26):ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం రోజు ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదిక అని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ, ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంతోపాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి, స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు.

వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే, సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు

దుమ్ముగూడెం మండలం పర్ణశాలకు చెందిన బానోతు భవిత గత ఆరు సంవత్సరాలుగా పర్ణశాలలోని నార చీరల వద్ద కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల గోదావరి వరదల కారణంగా షాపు నీట మునిగిందని, తిరిగి షాపు ఏర్పాటు చేసుకునే సమయంలో తన స్థలంలో వేరే వ్యక్తులు షాపు ఏర్పాటు చేశారని, ఈ విషయంపై తహసీల్దార్‌కు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, తన షాపు స్థలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్‌కు ఎండార్స్ చేశారు.

జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ ప్రజలు గత ఆరు సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని జూలూరుపాడు ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.

మణుగూరు మండలం సమితిసింగారం గ్రామపంచాయతీకి చెందిన గుండి సౌజన్య అంగన్వాడీ టీచర్ పోస్టుకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని అర్హత సాధించానని తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల మధ్య కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు అర్హతలను పరిశీలించి, అంగన్వాడీ టీచర్ పోస్టు కేటాయించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి చెందిన 65 గిరిజన కుటుంబాలు సుమారు 35 సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్నామని తెలిపారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. గ్రామానికి అంగన్వాడీ కేంద్రం లేదా ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామానికి చెందిన ధనసరి పగిడిద్దరాజు సర్వే నంబర్ 617లో తనకు ఐదు ఎకరాల పట్టా భూమి ఉండగా, సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కోసం రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన మూడు ఎకరాల భూమికి సంబంధించిన పాత రికార్డులను సవరించి, తన పేరుపై నూతన పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్షన్ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల కన్నీళ్లు తుడుస్తున్న రాజనర్సింహా ఫౌండేషన్! సేవలో సరికొత్త అధ్యాయం

- **పేదల ఇంట వెలుగులు నింపుతూ.. సేవా బాటలో రాజనర్సింహా ఫౌండేషన్ దూకుడు!**
- **ప్రచారం కోసం కాదు పేదల కోసం సేవ రాజనర్సింహా ఫౌండేషన్ సంచలనం!**

టేక్మాల్ సెప్టెంబర్ 7: (మన ప్రజావాణి) ఆపద కాలంలో తక్షణ సహాయం అందజేస్తూ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ యువ నాయకురాలు త్రిష రాజనర్సింహ మండల నాయకులతో పాటు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన వెంకటాపూర్, అచ్చన్నపల్లి గ్రామాల నిరుపేద కుటుంబాలకు చెందిన గౌండ్ల బాలగౌడ్, తుడుం మల్లయ్య కుటుంబాలకు రాజనర్సింహ

ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ తనయ,ఆందోల్ నియోజకవర్గ యువ నాయకురాలు త్రిషమ్మ బాధిత కుటుంబాలకు తక్షణ సహాయంగా పదివేల రూపాయలు చొప్పున అందజేశారు.టేక్మాల్ మండల నాయకులు ఇట్టి విషయాన్ని త్రిషమ్మ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన త్రిషమ్మ ఈ ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు.సోమవారం రోజు టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు,కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్,మండల నాయకులు,అచ్చన్నపల్లి గ్రామ సర్పంచ్ సాయిలు గౌడ్,వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ రాంబాయి గ్రామ నాయకుల సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు.భవిష్యత్తులో బాధిత పేద కుటుంబాలకు అండగా ఉంటామని బరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో టేక్మాల్ పట్టణ అధ్యక్షులు భక్తుల కిషోర్,డీసీసీ సెక్రటరీ యాద గౌడ్,మండల ఎస్టి సెల్ అధ్యక్షులు సేవాలాల్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఖాజా, యువజన నాయకులు సర్వని లక్ష్మణ్, చాతగిరి సంగమేశ్వర్ నాయకులు లచ్చ గౌడ్,సాయిలు, సంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ కి బహిరంగ క్షమాపణ చెప్పాలిఎమ్మెల్సీ తాతా మధు రాజీనామా చేయాలి

- **ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ఈ అంశంపై స్పందించాలి**
- **బిఆర్ఎస్ నేతల అహంకారానికి ఇది నిదర్శనంఅయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు**
- **దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు**

జమ్మికుంట సెప్టెంబర్ 7 (ప్రజావాణి)అసెంబ్లీ స్పీకర్ వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై ఓ ఎమ్మెల్సీ బూతులు తిడుతూ అమర్యాదకరంగా మాట్లాడటాన్ని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఒక ప్రకటన లో తీవ్రంగా ఖండించారుస్పీకర్‌ను కించపరిచేలా అసభ్య పదజాలంతో మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు శాసనసభ గౌరవానికి అవమానకరం అని అన్నారు రాజకీయ విభేదాలు ఉండవచ్చు. విధానాలపై విమర్శలు చేయవచ్చు కానీ ఒక రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం ఏ విధంగానూ సమర్థనీయంకాదన్నారుదళితులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత స్థాయికి ఎదిగి అత్యున్నత పదవులను అలంకరించినప్పటికీ వారిపై వివక్ష, చిన్నచూపు అవమానకరమైన వ్యవహారశైలి ఇంకా కొనసాగుతుండటం దురదృష్టకరమన్నారుసదరు ఎమ్మెల్సీ పై శాసనసభ నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలనిఅన్నారు నిన్న జరిగిన ఎల్బీ మీటింగ్ లో శాసనసభాపతిని అవమానించేలా మాట్లాడమని కెసిఆర్,కేటీఆర్,హరీష్ రావు ప్రోత్సహించారా అన్నారు. మాజీ మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ప్రజా సమస్యలపై అసెంబ్లీ లో మాట్లాడాలనే చిత్తశుద్ధి లేదన్నారు.

హామీ మేరకు డా.ఎం.ఏ.హకీమ్ తాత కానుక అందజేత

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేతుల మీదుగా పంపిణీ.
- కేసీఆర్ కిట్ లేని లోటును తీరుస్తున్న డా.ఎం.ఏ.హకీమ్.
- పేద బాలింతలకు అండ గా డా.ఎం.ఏ.హకీమ్ సేవలు.
- ఆడపిల్లల జన్మను ప్రోత్సహించేందుకు హకీమ్ తాత కానుక.

కోటగిరి/ప్రజావాణి:-ఇటీవల కాలంలో జరిగిన కేటీఆర్ జన్మదిన వేడుకలలో పొతంగల్ మండల బీఆర్ఎస్ నాయకులు,సామాజిక సేవాకర్త డాక్టర్ ఎం.ఏ.హకీమ్,నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు మొదటి కాన్పులో ఆడపిల్లకు జన్మనిస్తే రూ.5,000 హకీమ్ తాత కానుక ఇస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ ప్రకటనకు అనుగుణంగా సోమవారం పొతంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ మహాధర్నా,భారీసభలో పొతంగల్ మండల కేంద్రానికి చెందిన బొంబాయి దేవి (భర్త బాబులు) మొదటి కాన్పులో ఆడపిల్లకు జన్మనివ్వడంతో, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేతుల మీదుగా రూ.5,000 నగదును ఆ దంపతులకు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఏ.హకీమ్ మాట్లాడుతూ.గత కేసీఆర్ ప్రభుత్వంలో కేసీఆర్ కిట్‌తో పాటు మహిళలకు పౌష్టికాహారం,నగదు ప్రోత్సాహకాలు అందేవని.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ సాయాలు నిలిచిపోయాయని విమర్శించారు. నిరుపేద కుటుంబాలు ఆడపిల్లల జననాన్ని స్వాగతించేందుకు అలాగే బాలింతలు పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ సామాజిక కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా నిరుపేద మహిళ మొదటి కాన్పులో ఆడపిల్లకు జన్మనిస్తే వెంటనే సమాచారం అందిస్తే ఈ కానుకను నేరుగా వారి కుటుంబానికి అందజేస్తామని బీఆర్ఎస్ నాయకులకు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

ప్రజావాణి లో బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు ఎంపీడీవోఎమ్మార్వో కమిషనర్ కు వినతి పత్రం

- అందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిళి రమేష్

జమ్మికుంట సెప్టెంబర్ 7 (ప్రజావాణి)జమ్మికుంట మండల పరిషత్ కార్యాలయంలోప్రజావాణి లో బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు ఎంపీడీవో ఎమ్మార్వో కమిషనర్ కు వినతి పత్రం అందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పేద ప్రజలకు ఇస్తానన్నటువంటి సంక్షేమ పథకాలను అందించాలని వారం రోజుల పాటు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈరోజు చివరి రోజు మండల ఆఫీసులలో జిల్లా కేంద్రంలోనియోజకవర్గ కేంద్రంలో ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని చెప్పి,ఈరోజు మా మున్సిపల్ పాలకవర్గం అందరం కూడా మా మండల నాయకులందరం కూడా ఈరోజు అర్జీ ఇవ్వడం జరిగింది దయచేసి ఎమ్మార్వో ఈ నివేదిక ప్రభుత్వానికి పంపి మీరు ఎంపీడీవోకమిషనర్ ప్రజా సమస్యల పైన ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చే విధంగా చూడగలరని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ పలువురు ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా డా లక్ష్మివీర మల్లు జన్మదిన వేడుకలు....

మేడిపల్లి సెప్టెంబర్ 07(మన ప్రజావాణి) సామాజిక కార్యకర్త.రా చెరువు పరిరక్షణ సమితి. అనుశ్రీ.సాయి అనుశ్రీ నగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు.పద్మ శాలి సంఘము ముఖ్య సలహా దారులు డా లక్ష్మివీర మల్లు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు పద్మ శాలి సంఘం పెద్దలు. బోడుప్పల్ సీనియర్ నాయకులు యాదవ సంఘము అధ్యక్షుడు మాజీ వార్డ్ మెంబర్ తోట కూర రవీందర్ యాదవ్, అనుశ్రీ సాయి అనుశ్రీ నగర్,మల్లయ్య నగర్, గాయత్రి,సప్తగిరి కాలనీ లతో పాల్గొని డాక్టర్ లక్ష్మి మీరమల్లను శాలువాతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా డా లక్ష్మి వీరమల్లు మాట్లాడుతూ అందరి ఆద రా భీమానాలు.సహాయ సహకారాలు ఉన్నంత వరకు నేను మీ వెంట ఉండి వీలైనంతలో సామాజిక కార్యక్రమంలో ముందుకు వెళ్తానని తెలిపారు.ముక్యంగా బోడుప్పల్ లోని నాయకులు.మున్సిపల్ అధికారులు.సిబ్బంది అనేక కాలనీల మిత్రులు. వివిధ సంఘాలు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.రా చెరువు ప్రాంతం మిత్రులు మీడియా ప్రతినిధులు అందించిన సహాయ సహకారాలు నేను సామాజిక కోణం వైపు ప్రయాణం చేసే అవకాశం అందించిన మీ అందరికీ ధన్యవాదాలు తెలిపి,రా చెరువు అభివృద్ధి విషయంలో తాను ఒక ముఖ్య పాత్ర పోషించి నాయకుల,ప్రజా సంఘాల,స్వచ్ఛంద సంస్థల,అధికారుల మన్ననలు పొందుతూ రాచెరువు విషయంలో బోడుప్పల్ ప్రజల్లో తాను ఒక ముద్ర వేసుకున్నారు. అది జీవితంలో ఒక మైలు రాయిగా మిగిలిందని అన్నారు.అనంతరం పద్మ శాలి సంఘము పెద్దలు మాట్లాడుతూ సంఘానికి వారు అందించే సూచనలు మాకు ఎంతో దైర్యంగా ముందుకు వెళ్లే విదంగా ఉంటాయి అని అభిప్రాయం వ్యక్తం చేసారు.కాలనీల సభ్యులు కూడా ప్రతీ విషయంలో మాకు సూచనలు అందిస్తు మమ్మల్ని భుజం తడుతూ కాలనీ ల అభివృద్ధి విషయంలో యువత ముందుకు సాగాలి అని అనునిత్యం మాకు చెపుతున్న తీరు మాకు ఎంతగానో సంతృప్తిని ఇచ్చిందని వారు ఆయురారోగ్యాలతో ఉంటూ సామాజిక కోణం లో ముందుకు సాగాలి అని అభిప్రాయం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు.

డీజేలకు నో పర్మిషన్.. వినాయక ఉత్సవాల్లోనూ డీజేలు పెట్టొద్దు

- గరిడేపల్లి ఎస్సై బత్తిని శ్రీకాంత్ గౌడ్ ఆదేశం

గరిడేపల్లి సెప్టెంబర్ 7 (ప్రజావాణి)శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు డీజేలకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని గరిడేపల్లి ఎస్సై బత్తిని శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు. మండలంలోని డీజే యజమానులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి శబ్ద కాలుష్యంపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం వల్ల వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి అధిక శబ్దం ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు, ఊరేగింపుల్లోనూ డీజేలు ఏర్పాటు చేయరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే సంబంధిత డీజే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినాయక ఉత్సవాల్లోనూ డీజేలకు అనుమతి లేదు వచ్చే వినాయక చవితి ఉత్సవాల్లో కూడా డీజేలకు అనుమతి లేదని ఎస్సై బత్తిని శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు. వినాయక ఉత్సవాల పేరుతో అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేస్తే ఉత్సవ నిర్వాహకులతో పాటు డీజే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల ఆరోగ్యం, ప్రశాంత వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు. శబ్ద కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

సొంతింటి కల నెరవేరిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమం

- పాల్గొన్న దేశిని కోటి కాంగ్రెస్ నాయకులు
- కొత్తపల్లి ఏరియాలో నాలుగో వార్డులో లాడే శ్యామ్ రావు

జమ్మికుంట సెప్టెంబర్ 7 (ప్రజావాణి)జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి ఏరియాలో నాలుగో వార్డులో లాడే శ్యామ్ రావు ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమాలలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి ఈ సందర్భంగా దేశినికోటి మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి ఇల్లు కట్టుకోవాలని తనకంటూ సొంత ఇల్లు ఉండాలని ఆశ ఉండేది శ్యామ్ రావు కు కానీ తన ఆర్థిక పరిస్థితుల వల్ల తట్టుకోలేకపోయారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తనకు ఇందిరమ్మ ఇల్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబు సహకారంతో ఇల్లు మంజూరు కావడం జరిగింది ఆరు నెలల్లోనే ఇల్లు కట్టుకొని ఈరోజు గృహప్రవేశానికి మమ్మల్ని అందరినీ ఆహ్వానించి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నా కళ నెరవేర్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు కి పాదాభివందనాలు అని కంటి తడి పెట్టిన శ్యామ్ రావు దంపతులు నిరుపేద కుటుంబాలకు తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది మాటలు కాదు చేతుల్లో చూయించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అవుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు నాయకత్వంలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు కానీ డబుల్ బెడ్ రూములు కానీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గాని పట్టణాలలో గ్రామాలలో అభివృద్ధి గాని జరుగుతున్నాయి అలాంటి గొప్ప నాయకున్ని మనందరం రానున్న రోజుల్లో దీవించాలని కోరారు ఈ కార్యక్రమంలో 18 వ వార్డు కౌన్సిలర్ కుదాడి తిరుపతి మాజీ కౌన్సిలర్ బొంగోని వీరన్న పట్టణ కాంగ్రెస్ నాయకులు పంజాల అజయ్ నాలుగో వార్డ్ అధ్యక్షులు టెంకురాల కిషోర్ రాజేష్ లడే రామారావు సాయినాథ్ యూత్ అసోసియేషన్ కందారపు రాజేష్ బలబత్తుల శ్రీకాంత్ గోపి శ్రీధర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

ఆదివాసీ గిరిజన యువతి ఊకె శిరీష కుటుంబ సభ్యులకు జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక సంతాపం

- 10,000/- ఆర్థిక సహాయం అందచేత.

ములకలపల్లి, ప్రజావాణి న్యూస్, సెప్టెంబర్ 07:ఇటీవల హైద్రాబాద్ లో ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో నర్సు గా పనిచేస్తూ, కామంధుడు చేతిలో అతికిరాతకంగా కొట్టి చంపివేసిన ఆదివాసీ మహిళ ఊకె శిరీష కుటుంబ సభ్యులకు జాతీయ ఆదివాసీ ఫాస్టర్స్ ఐక్యవేదిక ప్రగాఢ సంతాపం తెలియచేసి, కుటుంబ సభ్యులను ఓదార్చి, శిరీష చిత్రపటానికి ఘనమైన నివాళి అర్పించడం జరిగింది.శిరీష్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం,అధికారులు అండగా ఉండాలని కోరడం జరిగింది. అదే విధంగా నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడం జరిగింది. జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక ఊకె శిరీష కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని తెలియచేశారు.కుమార్తెను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న కుటుంబ సభ్యులకు ఆదివాసీ పాస్టర్స్ తరుపున 10,000/- రూపాయల ఆర్థిక సహాయం అందించేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు కుర్సం నిరీక్షణరావు, ఉపాధ్యక్షులు గుండి ఫిలిప్, సెక్రటరీ మడివి ఎలీషా, జాయింట్ సెక్రటరీ బండారు సెక్రటరీ జాతీయ కమిటీ సలహాదారులు పీటర్ సింగయ్య,బిజ్జా రవిబాబు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుర్సం దైవ ప్రసాద్,జాయింట్ సెక్రటరీ కాక రమేష్ జాషువా, సీయోను కుమార్, రాంబాబు,రాజు, ఇశ్రాయేలు, జాన్ బాబు పెద్దము నాగేష్ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సుంకిలి నాగదేవ ఆలయానికి విశిష్ట చరిత్ర

- నాగమ్మ వేపవృక్షంతో ముడిపడిన భక్తుల విశ్వాసం.. శ్రావణ సోమవారం ప్రత్యేక పూజలు
- వీడీసీ, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అన్నదానం.. రూ.50 లక్షలతో నాగమ్మ ఫంక్షన్ హాల్ నిర్మాణం

నిర్మల్ ప్రజావాణి బ్యూరో, భైంసా, సెప్టెంబర్ 7:-నిర్మల్ జిల్లా భైంసా మండలం సుంకిలి గ్రామంలోని నాగదేవ ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి నాగదేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లో 1994లో ప్రతిష్ఠించిన నాగమ్మ వేపవృక్షంకు భక్తుల్లో ప్రత్యేక విశ్వాసం ఉంది. వేపవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడి ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగుతోంది. నాగపంచమి, శివరాత్రి తదితర పర్వదినాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శ్రావణమాసంలోని ప్రతి సోమవారం వీడీసీ, వెంకటేశ్వర యూత్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ ఆలయానికి సుంకిలి గ్రామంతో పాటు నిర్మల్ జిల్లా, ఆదిలాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి నాగదేవతను దర్శించుకుంటున్నారని గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వీడీసీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ సహకారంతో రూ.10 లక్షలు, ఎండోమెంట్ శాఖ ద్వారా రూ.40 లక్షల నిధులతో మొత్తం సుమారు రూ.50 లక్షల వ్యయంతో నాగమ్మ ఫంక్షన్ హాల్ నిర్మించారు. దీనిని గ్రామ ప్రజలు, భక్తుల వివాహాలు, శుభకార్యాలకు వినియోగించుకుంటున్నారు.

కొత్తగా వివాహమైన జంటలు నాగదేవతను దర్శించుకుని సంతానం కోసం మొక్కులు చెల్లించుకోవడం కూడా ఇక్కడి సంప్రదాయంగా ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు సుంకిలి గ్రామానికి మరిన్ని అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ను గ్రామ ప్రజలు కోరుతున్నారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారి వంటి సౌకర్యాలు మెరుగుపరిస్తే ఆలయ ప్రాధాన్యత మరింత పెరుగుతుందని వారు పేర్కొన్నారు.

రా చెరువు ముందు బేబీపాండ్ పనులను పరిశీలించిన

- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

మేడిపల్లి సెప్టెంబర్ 07 (మన ప్రజావాణి)బోడుప్పల్‌లోని రా చెరువు ముందు ఏర్పాటు చేస్తున్న బేబీపాండ్ వద్ద బతుకమ్మ, గణేష్ నిమజ్జనాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పరిశీలించారు.పర్యావరణహితంగా పండుగల నిమజ్జనాలను నిర్వహించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నగర వ్యాప్తంగా పలు కృత్రిమ బేబీపాండ్లు,పోర్టబుల్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తోంది.ఇందులో భాగంగా రా చెరువు ముందు ఏర్పాటు చేస్తున్న బేబీపాండ్ పనుల పురోగతిని అజయ్ యాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం,లైటింగ్, భద్రత,తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులను కోరారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి,బతుకమ్మ మరియు గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,కాంగ్రెస్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి,ఏఈ తదితరులు పాల్గొన్నారు.

వారణాసి కాశీ దర్శనం ట్రావెల్ వివరాలు

- కూకట్పల్లి ఉంగరాల చైతన్య కుమార్ ద్వారా కాశీ విశ్వనాథ్ మరియు కాలభైరవ దర్శనం. ఫోన్ నెంబర్.9000537005, విజయ్ 9794042894.

కూకట్పల్లి విలేజ్ (ప్రజావాణి) సెప్టెంబర్ 7 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్. వారణాసి ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్యాకేజీలు రెండు మూడు రోజుల పాటు ఉంటాయి. ఎయిర్‌పోర్ట్ లేదా వారణాసి జంక్షన్ వద్ద నుంచి ప్రైవేట్ క్యాబ్ ద్వారా పికప్ చేసి హోటల్‌కు తీసుకెళ్తారు. దర్శన కార్యక్రమంలో శ్రీ కాశీ విశ్వనాథ్, శ్రీ కాలభైరవ, అన్నపూర్ణ, విశాలాక్షి శక్తిపీఠాలు, గంగా హారతి వీక్షణ, స్థానిక స్ట్రీట్ ఫుడ్, చాట్, గోల్‌గప్పా అనుభవాలను పొందవచ్చు.వారణాసి సందర్శనలో బోట్ రైడ్, తిల్ భాండేశ్వర్ మహాదేవ్ ఆలయం, గౌరీ కేదారేశ్వర్, చింతామణి గణేష్, ఆది శక్తి దుర్గా, సంకట్ మోచన్ ఆలయాలు, బిందు మాధవ్ ఆలయం, తెలంగాణ స్వామి మఠం, చంద్ర కూప్, శ్రీ సిద్ధి దాత్రి మాత ఆలయాలు ఉన్నాయి. ప్రైవేట్ క్యాబ్ ద్వారా సారనాథ్, మ్యూజియం, బుద్ధ టెంపుల్, రామ్‌నగర్ ఫోర్ట్, దీనిఖ, కొత్త కాశీ విశ్వనాథ్ ఆలయం సందర్శనలకు అవకాశం కల్పిస్తారు. సాయంత్రం మార్కెట్ మరియు షాపింగ్ కూడా చేయవచ్చు. తెలుగు అనువాదం సదుపాయం కూడా అందుబాటులో ఉంది.

ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లలో ఉపాధ్యాయుల జ్ఞాన దోపిడిని అరికట్టాలి

ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 07మిర్యాలగూడలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల ల్లో ఉపాధ్యాయుల జ్ఞాన దోపిడీ నివారించాలి అని ఎంఈఓ ధర్మ నాయక్ కి ఫిర్యాదు...
మిర్యాలగూడ పరిధిలోని నారాయణ, శ్రీ చైతన్య తదితర ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అనుసరిస్తున్న అనైతిక విధానాలు, ఉపాధ్యాయుల మేధో సంపత్తి దోపిడీపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్వకేట్ ధీరావత్ రవి ఎంఈఓ (మండల విద్యాశాఖాధికారి) కి వినతిపత్రం సమర్పించారు.?ఈ సందర్భంగా అడ్వకేట్ ధీరావత్ రవి మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఉపాధ్యాయులు సొంతంగా తయారు చేసుకున్న బోధనా సామగ్రి, ప్రత్యేక కరికులమ్ డిజైన్లు, బోధనా పద్ధతులను యాజమాన్యాలు కాపీ చేస్తూ వ్యాపారాత్మకంగా వాడుకుంటున్నాయని తెలిపారు. ఇలా వారి జ్ఞానాన్ని, మేధోశ్రమను వాడుకున్న తర్వాత, ఉపాధ్యాయులకు సరైన గుర్తింపు గానీ, తగిన వేతనం గానీ ఇవ్వకుండా అన్యాయంగా ఉద్యోగులను వేధింపులకు గురచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి చర్యలు కార్మిక, వృత్తిపరమైన నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా, ఉపాధ్యాయ వృత్తి యొక్క గౌరవాన్ని దిగజార్చేలా ఉన్నాయని అన్నారు.ఈ సందర్భంగా ఎంఈఓను కోరిన ప్రధాన డిమాండ్లు:మిర్యాలగూడలోని కార్పొరేట్ పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల ఉద్యోగ షరతులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలి.ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షిస్తూ, న్యాయమైన ఉద్యోగ నిబంధనలను అమలు చేసేలా పాఠశాల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి.విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై కఠినమైన పరిపాలనా మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ఈ కార్యక్రమం లో టి ఆర్ జి ఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు ధీరావత్ శ్రీను నాయక్ అడ్వకేట్ పరమేష్ నాగేందర్ తరుణ్ నాయక్ ఆంజనేయులు సిపాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమే బిజెపి నాయకుల ముందస్తు అరెస్టులు

- కట్టోజు భాస్కరాచారి బిజెపి పెద్దవంగర మండల అధ్యక్షులు

పెద్దవంగర సెప్టెంబర్ 07 ప్రజావాణి విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలని బిజెపి రాష్ట్ర కమిటి చలో అసెంబ్లీ కి పిలుపునివ్వడం జరిగింది అందులో బాగంగా మండలంలోని నాయకులను ముందస్తుగా ఉదయం 5 గంటలకు అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం .పోలీసులు చేసిన అక్రమ అరెస్ట్ లకి కాంగ్రెస్ ప్రభుతము ఆడుతున్న డ్రామాలు అని.విద్యార్థుల జీవితాలను నాశనం చేసే దిశగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ మంత్రులకు కమీషన్ల లాభాలు తప్పితే ఒక్క పౌరుడికి కూడా పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదు.బిజెపి నాయకుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వ పెద్దల సూచనలతో మమ్మల్ని అరెస్ట్ చేస్తున్నారు .40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరం గా ఉంది .బిజెపి నాయకుల అరెస్ట్ తో ఉద్యమ ఆగిపోదు మరింత ఉధృతం అవుతుంది.అక్రమంగా జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు గౌడ్,మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరా చారి ను అక్రమంగా అరెస్ట్ చేయడం జరిగింది.

నెల్లికుదురు ప్రజావాణి కి 'ఏడు'దరఖాస్తులు..

ప్రజావాణి,నెల్లికుదురు:ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వారం వారం మండల స్థాయిలో ప్రవేశపెట్టిన ప్రజావాణి కొనసాగుతోంది. మండల కేంద్రం నెల్లికుదురు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో సింగారపు కుమార్ తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొని ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన వినతులను స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కుమార్ దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. ప్రజావాణి కి మండల వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలపై 7 దరఖాస్తులు అందజేసినట్లు వెల్లడించారు.రెవెన్యూ సమస్యలపై 3 దరఖాస్తులు, హౌసింగ్ పై 2 దరఖాస్తులు, విద్యుత్ సంబంధిత సమస్యపై ఒక దరఖాస్తు రాగా, ఇరిగేషన్ సమస్యపై మరో పిటిషన్ సంబంధిత బాధితుల నుంచి వచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రజావాణిలో పలు శాఖలకు చెందిన అధికారులు హాజరవుతున్న దృష్ట్యా సమస్యలు పరిష్కరించడానికి ఇది ఒక చక్కని వేదిక అని, సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.
ప్రభుత్వ భూములు కాపాడాలి:సిపిఎం
మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు నేతృత్వంలో ప్రజావాణిలో కుమార్ కు దరఖాస్తు అందజేశారు. ఆయనతోపాటు ఎల్లయ్య ఉన్నారు.

రోస్టర్ పాయింట్ విధానంలో మార్పులు చేయాలి

- మాలలకు అన్యాయం జరుగుతోంది.. పాయింట్లలో 20 లోపల చేర్చాలని వినతి

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, నర్సాపూర్, సెప్టెంబర్ 7:రోస్టర్ పాయింట్ విధానంలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతోందని, దీనిని సరిచేసి రోస్టర్‌లో తగిన మార్పులు చేయాలని కోరుతూ నర్సాపూర్ మండల కేంద్రంలోని మాల సంఘం నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. సోమవారం నర్సాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వోలకు వినతిపత్రం సమర్పించారు. రోస్టర్ పాయింట్ విధానంలో మాలలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని, సామాజిక న్యాయం జరిగేలా రోస్టర్‌లో మార్పులు చేపట్టాలని వారు కోరారు. ముఖ్యంగా రోస్టర్ పాయింట్లలో మాలలకు 20లోపల స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అధికారులు తమ విజ్ఞప్తిని పరిశీలించి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని మాల సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో కాల్వ రఘు, కమలాకర్, భూమన్న, శ్రీధర్, గజ్జన్న, రాజేశ్వర్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యే ల అరెస్టుకి ధర్నానిరసన

- తెలిపిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్
- కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేష్

జమ్మికుంట సెప్టెంబర్ 7 ప్రజావాణి)జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ధర్నా నేటి నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలలో పాల్గొనేందుకు వెళ్ళిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇతర ఎమ్మెల్యే ల అరెస్టుకి నిరసన తెలిపిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రావు నేతృత్వంలో నిన్న బీఆర్ఎస్ పార్టీ ఎల్పీ మీటింగ్‌లో ప్రజా సమస్యలపైన నేటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ప్రశ్నించాల్సిన విషయాలన్నీ కూడా చర్చించిఈరోజు మా బీఆర్ఎస్ పార్టీకి సంబంధించినటువంటి వర్కింగ్ ప్రెసిడెంట్ అందరూ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్తున్న నిరసన కార్యక్రమాలు చేస్తూ అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యేలని అరెస్టు చేస్తూ మహిళా ఎమ్మెల్యేలని చూడకుండా సబితా ఇంద్రారెడ్డి ని గుంజి పడేయడం కేటీఆర్ నిహరీష్ రావుని కౌశిక్ రెడ్డి ని గుంజి పడేయడం ఈరోజు

అసెంబ్లీలో ప్రజల పక్షాన గొంతు లేవకుండా చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది ఇలాంటి దుర్బుద్ధిని వీడనాడి ప్రజలకు సంబంధించినటువంటి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నటువంటి బీఆర్ఎస్ పార్టీని వారి నుంచి వచ్చేటటువంటి వినతులను తీసుకొని ఈరోజు ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన మీరు అసెంబ్లీలో శాసనసభ్యులను అడ్డుకున్నంత మాత్రాన ఈ ప్రజా సమస్యలపై పోరాటం బీఆర్ఎస్ పార్టీ ఆగదు అక్రమంగా అరెస్టు చేసినటువంటి ఎమ్మెల్యేలను విడుదల చేయాలి ఈరోజు జమ్మికుంట మున్సిపల్ లో జమ్మికుంట పట్టణ బీఆర్ఎస్ మరియు

మండల బీఆర్ఎస్ నాయకులమందరం కూడా కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు వారిపై జరిగినటువంటి దాడికి నిరసనగా ఈరోజు ఇక్కడ మానవహారం,ధర్నా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వానికి మేము విజ్ఞప్తి చేస్తున్నాం, వెంటనే మీ బుద్ధి మార్చుకొని పేద ప్రజల పక్షాన కొట్లాడుతున్నటువంటి బీఆర్ఎస్ పార్టీకి సంబంధించినటువంటి అర్జీలను తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేష్ మాజీ ఎంపీపీదొడ్డే మమత మాజీ సర్పంచ్ లు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

సభకు రాని అధినేత.. సభను అడ్డుకునే బీఆర్ఎస్

- చర్చకు దూరం.. గందరగోళానికే బీఆర్ఎస్ ప్రాధాన్యం
- దళిత స్పీకర్‌పై దూషణలు..బీఆర్ఎస్ దొరతనంపై మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఫైర్
- అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ సభ్యుల తీరుపై వజ్రేష్ యాదవ్ ఆగ్రహం

మేడిపల్లి సెప్టెంబర్ 07 (మన ప్రజావాణి) సభకు రాని మీ అధినేతకు ప్రతిపక్ష హోదా ఎందుకు?.. ప్రజా సమస్యలపై చర్చించే దమ్ము లేకే సభను అడ్డుకుంటున్నారని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతి నిధులు చేపట్టిన నిరసన,ఆందోళన తీరుపై ఆయన మండిపడ్డారు.ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ముతో ప్రతి నెలా వేతనాలు పొందుతూ, ప్రతిపక్ష నాయకుడి హోదాను అనుభవిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని వజ్రేష్ యాదవ్ విమర్శించారు.ప్రజా సమస్యలపై సభలో చర్చించాల్సిన బాధ్యతను విస్మరించి,బయట ఆందోళనలతో రాజకీయ ప్రయోజనం పొందాలని చూడటం సమంజసం కాదన్నారు.మీ అధినేత సభకు రారు.మీరు సభను సజావుగా జరగనివ్వరు.

ప్రజల సమస్యలపై చర్చించాలనే చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వం ఎదుట ప్రశ్నలు సంధించాలి.కానీ ప్రజాస్వామ్య వేదికను అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరించడం బీఆర్ఎస్ వైఖరికి నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు.అసెంబ్లీ వద్ద నిరసన

పేరిట బీఆర్ఎస్ సభ్యులు చేసిన హడావుడి ప్రజాప్రతినిధులకు తగదని వజ్రేష్ యాదవ్ అన్నారు. అసెంబ్లీ వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులతో ఘర్షణకు దిగడం,మహిళా పోలీసుల ముందే అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం అత్యంత బాధ్య తారాహిత్యమని విమర్శించారు.బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధులు సంయమనం పాటించి ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అభిప్రాయాలను వెల్లడించాల్సి ఉండగా, వీధి రౌడీల మాదిరిగా వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన వారే నిబంధనలను ఉల్లంఘించేలా ప్రవర్తించడం ప్రజలకు తప్పుడు సందేశం ఇస్తోందన్నారు.దళిత స్పీకర్‌పై వ్యాఖ్యలు ఖండనీయం
స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు ఉపయోగించిన పరుష పదజాలాన్ని వజ్రేష్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.దళిత వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా బీఆర్ఎస్ నాయకులు తమ దొరతనపు ధోరణిని మరోసారి బయటపె ట్టుకున్నారని ఆరోపించారు.స్పీకర్ పదవికి రాజ్యాంగబద్ధమైన గౌరవం ఉందని,సభ నిర్వహణ బాధ్యతలు చేపట్టే వ్యక్తిపై వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చని,కానీ రాజ్యాంగ పదవుల పట్ల గౌరవం తప్పనిసరిగా ఉండాలని సూచించారు.ప్రజల సమస్యలను చర్చించేందుకు అసెంబ్లీ అనే వేదిక ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ సభ్యులు చర్చను పక్కనపెట్టి గందరగోళానికి ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే సభలో పాల్గొని నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆయన డిమాండ్ చేశారు.

భద్రాద్రి జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు

- ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఏఏఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం
- రన్‌వే, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్‌పై సాంకేతిక అధ్యయనం
- రైల్వే లైన్ వల్ల కలిగే సాంకేతిక అంశాలపై ప్రత్యేక పరిశీలన..
- సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు..

భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (07 సెప్టెంబర్ 26): జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుని మొదటి రోజు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను అధ్యయనం చేసింది. జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వేలు, సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోంది.ఈ సందర్భంగా

సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ సాంకేతిక బృందం సమావేశమై ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం, ఏటిఆర్-72 తరహా విమానాలతో పాటు పెద్ద ఎయిర్‌బస్ ఏ320/ఏ321 విమానాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చ జరిగింది. పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే ఏర్పాటుకు అవసరమైన భూమి, భవిష్యత్ విస్తరణకు అవకాశాలు, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు, భద్రతా పరికరాలు తదితర అంశాలపై కూడా అధ్యయనం చేస్తున్నారు.ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా సాంకేతిక బృందం పరిశీలనలో ప్రధాన అంశంగా నిలిచింది. రైల్వే మార్గం విమానాల అప్రోచ్ ఫన్నెల్ పరిధిలోకి వచ్చే అవకాశాల నేపథ్యంలో దాని వల్ల ఏర్పడే సాంకేతిక ప్రభావాలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే 'షీల్డింగ్' ప్రక్రియ ద్వారా సాంకేతిక అవరోధాన్ని అధిగమించే అవకాశాలను కూడా పరిశీలించడంతో పాటు, రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్ఓసీ పొందే అంశంపై చర్యలు చేపట్టనున్నారు. పరిశీలనలో భాగంగా సంబంధిత అధికారులు సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ మ్యాపులు, భౌగోళిక కోఆర్డినేట్లు, స్థల హద్దులు, అప్రోచ్ రోడ్లు, రెవెన్యూ

మరియు సాంకేతిక రికార్డులను సిద్ధంగా ఉంచి ఏఏఐ బృందానికి అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలిస్తూ, రికార్డులతో సరిపోల్చి బృందం సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తోంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ సాంకేతిక బృందం నిర్వహిస్తున్న పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అవసరమైన రెవెన్యూ, సర్వే, సాంకేతిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచి, బృందం క్షేత్రస్థాయి పరిశీలన సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి రోజు ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించగా, రెండో రోజు కూడా షెడ్యూల్ ప్రకారం మిగిలిన ప్రాంతాలు, సాంకేతిక అంశాలను బృందం పరిశీలించనుంది. మొత్తం పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి, విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ పర్యటనలో సంబంధిత రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు, ఏఏఐ సాంకేతిక ప్రతినిధులు పాల్గొన్నారు.

6 గ్యారంటీలు అమలు చేయాలి

ప్రజావాణి సెప్టెంబర్ 7 కమలాపూర్ మండలం 6 గ్యారెంటీలు అమలు చేయాలని బీ ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కమలాపూర్ ఎంపీడీవోకు వినతి పత్రం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని అర్హులైన కుటుంబాలకు ఆరు గ్యారెంటీ పథకాలను అందించాలని బి.ఆర్.ఎస్ నాయకులు డిమాండ్ చేశారు కమలాపూర్ మండల అభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేశారు
ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద రూపాయలు 2500 ఆర్థిక సాయం తులం బంగారం రైతులకు పంటకు రైతు భరోసా వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ కమలాపూర్ మండల నాయకులు సర్పంచులు సీనియర్ నాయకులు తదితరులు హాజరయ్యారు

అలరించిన 14వ ఉర్దూ సాహిత కవి సమ్మేళనం

- రాష్ట్ర ఇత్తేహాదుల్ ఉలమా వల్ ఐయిమా ఇమాముల సంఘం ఆధ్వర్యంలో
- ఉర్దూ గేయకారుల నాతియా ముషాయిరాకు హాఫీజ్ ముహమ్మద్ సలీం పర్వేజ్ అధ్యక్షత

జమ్మికుంట సెప్టెంబర్ 7 ప్రజావాణిమస్జిద్-ఎ-రసూల్ లో నాతియా ముషాయిరా ఉర్దూ ప్రియులను అలరించింది. రాష్ట్ర ఇత్తేహాదుల్ ఉలమా వల్ ఐయిమా ఇమాముల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉర్దూ గేయకారుల నాతియా ముషాయిరాకు హాఫీజ్ ముహమ్మద్ సలీం పర్వేజ్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ముంబాయికి చెందిన మౌలానా హనీఫ్ మిల్లీ నద్వి మౌలానా అబ్దుల్ హాదిజాతీయ అధ్యక్షులు జమాతుల్ ఉలమా ఫౌండేషన్,చీఫ్ ఎడిటర్ నీలోఫర్ ఉర్దూ హాజీ సర్దార్ సాహెబ్ చీఫ్ ఎడిటర్ దినపత్రిక ఉర్దూకి పుకార్ హాజీ నాసిర్ ఇత్తేహాదుల్ ఉలుమా వల్ ఐయిమా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముఫ్తీ షఫీవుల్లా ఎం డి షాకీర్ మౌలానా నసీర్ అహమ్మద్ సాఫ్టవేర్ ప్రముఖులు మొహమ్మద్ హాషశీ మౌలానా హుసేన్ రషాది మౌలానా ఇద్రీస్ ప్రముఖ జాతీయ స్థాయి ఉర్దూ గాయకులు యూపి ప్రతాప్ ఘడ్ కు చెందిన హాఫీజ్ సాబిర్ సిద్దీఖీ, హైదరాబాద్ ఖారి మౌలానా అబ్దుల్ రెహమాన్ హాఫీజ్ ఉస్మాన్ మౌలానా జాకీర్ వెలుగోడు మౌలానా జావీద్ రషాది బెంగళూర్ మౌలానా రఫీ రషాది మౌలానా నయీం సిరాజి,మౌలానా హమ్మాద్ జిలానీయం.డి ఇమ్రాన్ హాఫిజ్ యం.డి అలి యస్.హుసేన్ ముషారఫ్ కరిముల్లా నంద్యాల ఉర్దూ కవులు పాల్గొని మధురమైన స్వరంలో ప్రవక్త ముహమ్మద్ (స) గుణగణాలు జీవిత ఘట్టాలు వివరించారు. అనంతరం కవులకు శాలువా కప్పి మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సంధర్భంగా హాఫీజ్ ముహమ్మద్ సలీం పర్వేజ్ మాట్లాడుతూ ఈ ముషాయిరాల ద్వారా ఉర్దూ భాషా ప్రోత్సహించే బడటమే కాక సాహిత్య మాధుర్యం ఆస్వాదించ బడుతుందనీ, ప్రతీ సంవత్సరం నిర్వహించ బడుతుంది అని తెలిపారు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజావాణి శాయంపేట రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును వెంటనే తన పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకుగాను సోమవారం సాయంత్రం శాయంపేట మండల కేంద్రంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను మండల పార్టీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ... గౌరవప్రద స్థానంలో ఉన్న స్పీకర్ పై సభ్య సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ మధు పై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసేలా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా కృషి చేయాలి కాని బీఆర్ఎస్ నాయకులు ధన అహంకారంతో స్పీకర్ తల్లిని అవమానపరిచే విధంగా మాట్లాడడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు హింగే భాస్కర్, వాంకుడోత్ సదర్ లాల్, అల్లే రాజీరు, ఉప సర్పంచ్ లు రావుల శ్రీనివాస్, మస్కే కుమార్, నాయకులు దుబాసి కృష్ణమూర్తి, చిందం రవి, నిమ్మల రమేష్, కుసుమ శరత్, రవిపాల్, తిరుపతి, ప్రపంచ రెడ్డి, కట్టయ్య, బాసని ప్రకాష్, మార పెల్లి రాజేందర్, వరదరాజు, రేణిగుంట్ల సదయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పటిష్ట భద్రత

- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ముందస్తు చర్యలు.. మండపాల వద్ద నిరంతర నిఘా: మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,

మన ప్రజావాణి మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7: వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని
మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,
పోలీస్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాలు, గణేష్ నవరాత్రులు, నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలు, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి గణేష్ మండపం వద్ద భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీసులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.
మండపాల వద్ద ప్రత్యేక నిఘా
జిల్లాలో ఏర్పాటు చేసే ప్రతి గణేష్ మండపానికి సంబంధించిన భద్రతా పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎస్పీ ఆదేశించారు.మండపాల నిర్వాహకులతో పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు.
నిమజ్జనం మార్గాలపై ముందస్తు పరిశీలన
సమన్వయంతో పటిష్ట బందోబస్తు
గణేష్ విగ్రహాల నిమజ్జనం, ఊరేగింపులకు సంబంధించిన మార్గాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రద్దీ ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.
డీజేలు, రెచ్చగొట్టే నినాదాలపై నిఘా
గణేష్ ఊరేగింపుల సందర్భంగా డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలను ఉపేక్షించవద్దని సూచించారు.
రౌడీషీటర్ల కదలికలపై నిఘా
శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని, సమస్యాత్మక వ్యక్తులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి చిన్న ఘటనకు కూడా అవకాశం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.
ప్రజల సహకారం అవసరం
వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.
జిల్లాలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని స్థాయిల పోలీస్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ .ఆదేశించారు. ముందస్తు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, మండపాల వద్ద నిఘా, ఊరేగింపు మార్గాల పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
ఈ సమన్వయ సమావేశంలో మెదక్ డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, రాజశేఖర్ రెడ్డి, జార్జ్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో అన్నప్రసాద కార్యక్రమం

- అన్నప్రసాద దాత సిద్ధగోని రమేష్ గౌడ్ :

ఇబ్రహింపట్నం నియోజకవర్గం సెప్టెంబర్ 07 (ప్రజావాణి న్యూస్): నియోజకవర్గం లోని మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి సోమ వారం గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాదం కార్యక్రమం సోమవారం అన్నప్రసాద దాత సిద్ధగోని రమేష్ గౌడ్ ముందుగా కూతురు సుప్రజాలక్ష్మి జన్మదినం సందర్భంగా ముందుగా కంఠమహేశ్వర దేవాలయంలో కంఠమహేశ్వర శివలింగానికి రమేష్ గౌడ్ దంపతులు కుటుంబసభ్యు లు గౌడ సంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ ఉపాధ్యక్షుడు సుంకరి ప్రవీణ్ గౌడ్ మా దుగుల కృష్ణగౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ అంతటి రాజుగౌడ్ వైయ స్సార్ మాధగోని జంగయ్యగౌడ్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ డాక్టర్ నేరెళ్ల శంకర్, అయ్యప్ప స్వాముల గురుస్వామి లొంగరి దాసు సుంకరి జంగయ్య గౌడ్, పల్లె శ్రీనివాస్ గౌడ్, పాశం బాలరాజు గౌడ్, కాసుల జంగయ్య, కొత్తపల్లి నరసింహ గౌడ్, మండ పాకుల శ్రీనివాస్, తవిటి నరసింహ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోసం రోడ్డెక్కిన రైతులు

- పంటలకు నీరందక ఎండిపోతున్న వైనం.. కుబీర్‌లో రైతుల ఆందోళన
- జారీ,బి గ్రామంలోనూ విద్యుత్ సమస్య.. ఆవేదన వ్యక్తం చేసిన సర్పంచ్ బాబన్న

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, కుబీర్ సెప్టెంబర్ 7:--పంటల సాగు కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న విద్యుత్ సక్రమంగా అందకపోవడంతో నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని రైతులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యుత్ అధికారులను రైతులు నిలదీశారు. సమస్యపై అధికారులు స్పందించకపోవడంతో రైతులు రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా విద్యుత్ శాఖ ఎస్సీ రమేష్ ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.ఇదిలా ఉండగా తానూరు మండలం జరీ.బి గ్రామంలోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలకు సాగునీరు అందక నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొనడంతో స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ బాబన్న కూడా ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలను కాపాడేందుకు విద్యుత్ సరఫరాను సక్రమంగా అందించాలని ఆయన విద్యుత్ అధికారులను కోరారు.రైతు జేఏసీ అధ్యక్షుడు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనిల్ మాజీ వాయిస్ ఎంపీపీ ముజ్జు రైతుల సమస్యపై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. రైతుల సమస్యలపై స్పందించిన ఎస్సీ రమేష్‌తో పాటు డీఈ తిలక్, ఏడీఈ మోహన్‌కుమార్, ఏఈ ఆదిత్యలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనుల సమస్యలను సత్వరగా పరిష్కారం చూపాలి..

- గిరిజన దర్బార్ లో సమర్పించిన వినతులపై యూనిట్ అధికారులకు పీవో ఆదేశాలు
- గిరిజనుల ప్రతి విన్నపాన్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి..
- ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం/మన ప్రజావాణి (07 సెప్టెంబర్ 26): వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చే గిరిజనులు గిరిజన దర్బార్లో సమర్పించే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఐటీడీఏ యూనిట్ అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు ఐటిడిఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసి ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల వినతులు, సమస్యల ఫిర్యాదులను ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్డిసి ట్రైబల్ వెల్ఫేర్ ఆనందకుమార్, గురుకులం ఆర్సిఓ అరుణకుమారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఎడిఎంహెచ్వో సైదులుతో కలసి స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను గిరిజనులు పిఓ దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. గిరిజనుల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల యూనిట్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని ఐటీడీఏ పీవో తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
శాఖల మధ్య సమన్వయంతో గిరిజన ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని పిఓ సూచించారు. గిరిజన దర్బార్ లో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిష్కార స్థితిని పరిశీలించాలని యూనిట్ అధికారులను ఆదేశించారు. గిరిజనుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు. ప్రజలు తమ దరఖాస్తులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని పిఓ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి యూనిట్ అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
గిరిజన దర్బార్ లో వచ్చిన దరఖాస్తులు
పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించుట కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనాధారం పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, ఎల్ టి ఆర్ భూముల సమస్యలు పరిష్కరించుట కొరకు, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో చేరడానికి శిక్షణలు అందించుట కొరకు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, పంట పొలాలకు నీరు అందించడానికి కరెంటు, బోరు, మోటారు ఇప్పించుట కొరకు, రైతుబంధు రుణాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పించుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, పివిటిజి అధికారి గన్యా, ఎల్టిఆర్ డిటి మణిధర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, మిషన్ భగీరథ వర్క్ ఇన్స్పెక్టర్ వీరారెడ్డి, వివిధ శాఖల సిబ్బంది స్వాతి, కార్తీక్, వెంకటేశ్వర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యేళ్ళ పాలన వైఫల్యంపై బి అర్ ఎస్ "ప్రజా వాణిలో" దరఖాస్తు

- కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను మోసం చేస్తుంది
- మద్దూరు మండల బి అర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్

మద్దూరు సెప్టెంబర్ 7, ప్రజావాణి.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యేళ్ళ పాలన వైఫల్యంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో మండల బి అర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 100 మంది కార్యకర్తలు అధికారులకు దరఖాస్తు అందజేశారు.అదే విధంగా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి వద్దురా వద్దురా కాంగ్రెస్ పాలన అని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మేక సంతోష్ మాట్లాడుతూ అమలు కానీ హామీలు ప్రజలకు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,బి అర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి ..

పలాస ప్రజావాణి ప్రతినిధి ప్రతి ఒక్కరూ వారి వారి రంగాలలో పోటీ తత్వం అలవర్చుకుంటే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఎల్ఐసి మేనేజర్ బి రాజు అన్నారు. పలాస మండల కాంప్లెక్స్ వద్ద గల ఎల్ఐసి కార్యాలయంలో ఎల్ఐసి 70 వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వక్తృత్వము, క్విజ్ పోటీలను నిర్వహించగా, ఎల్ఐసి ఏజెంట్లకు క్విజ్ పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో పోటీ, ఒత్తిడి ఉంటుందని, వాటిని అధిగమించి మన లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలైన పర్ణిక (స్మార్ట్ స్కూల్), పి తేజస్విని(కాశీబుగ్గ హై స్కూల్)లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలు అయిన ఎల్ఐసి ఏజెంట్లకు బహుమతులను అందజేశారు కార్యక్రమంలో ఏబీఎన్ నంబూరి నరేష్ ఏ డి ఎం భాస్కరరావు స్టాఫ్ సెక్రటరీ సుబ్బారావు ఏజెంట్లు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలపై పోలీసుల దాడి అప్రజాస్వామికం

- కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల ఆగ్రహాన్ని ఆపలేరు
- శేరిలింగంపల్లి ఉద్యమ నేత చిర్రా రవీందర్ యాదవ్ ధ్వజం

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 07(మన సమగ్ర ప్రజావాణి):–శాసనసభకు నల్లచొక్కాలతో హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని శేరిలింగంపల్లి ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు పార్లమెంటుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్‌తో వెళ్లవచ్చని, రాష్ట్ర శాసనసభకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల అంగీలతో వెళ్లకూడదా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే ప్రతిపక్ష హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడం అత్యంత శోచనీయమని,పలువురు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు గాయాలు కావడం,వారు కిందపడే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. పోలీసుల అత్యుత్సాహంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇది కేవలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలపై జరిగిన అణచివేత కాదని, ప్రజాస్వామ్య విలువలు, ప్రతిపక్షాల హక్కులు, స్వేచ్ఛగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కులపై జరిగిన దాడిగా చిర్రా రవీందర్ యాదవ్ అభివర్ణించారు.అధికారంలో ఉన్నప్పుడు ఒక న్యాయం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో న్యాయం అనే ధోరణిని కాంగ్రెస్ ప్రభుత్వం విడనాడాలని హితవు పలికారు.నల్లచొక్కాలను పోలీసులు అడ్డుకోగలరేమో కానీ ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని మాత్రం ఈ ప్రభుత్వం అడ్డుకోలేదని ఆయన హెచ్చరించారు.ప్రజా సమస్యలపై ప్రతిపక్షం చేసే నిరసనలను అణచివేయడం కాకుండా, ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని చిర్రా రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.

బీర్కూర్ ప్రజావాణి: శ్రావణ సోమవారం సందర్భంగా విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

బీర్కూరు మండలం బైరాపూర్ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన విఠలేశ్వర ఆలయంలో మా హారాష్ట్ర, బాన్సువాడ నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు బీర్కూర్: శ్రావణ మాసంలోని పవిత్రమైన సోమవారం సందర్భంగా బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళహారతులు సమర్పించారు.మహారాష్ట్రతో పాటు బాన్సువాడ నియోజకవర్గం, బీర్కూర్ మండలం పరిధిలోని వివిధ గ్రామాలు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి విఠలేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కిటకిటలాడింది. భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజన ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ద్రోణవల్లి సతీష్--లక్ష్మీ దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ భక్తులకు సహకరించారు. శ్రావణ సోమవారం సందర్భంగా విఠలేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు తెలిపారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

అంగన్వాడీలో చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

రాయికల్: సెప్టెంబర్ 07(ప్రజావాణి): రాయికల్ మండలంలోని వడ్డెర కాలనీ గ్రామంలో సోమవారం అంగన్వాడీ కేంద్రంలో 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం, బాలామృతం, కోడిగుడ్లను గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని,పిల్లల ఆరోగ్యం, పోషణ పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఆరు నెలలు నిండిన చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమీర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, ఆశా వర్కర్ సుమలత, అంగన్వాడీ టీచర్ బియ్యని సుజాత, కారోబార్ జలంధర్, ఆయా మక్కల లక్ష్మి, చంద్రగిరి రాజు, అంజమ్మ, దీపిక, అనురాధ, సర్పవ్వ, వెంకవ్వ, పిల్లల తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి

- గర్ల్స్ హైస్కూల్ వద్ద వాహనాల పార్కింగ్‌తో విద్యార్థులకు ఇబ్బందులు

మన సమగ్ర ప్రజావాణి జోగిపేట, సెప్టెంబర్ 7 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆందోల్ మండలం జోగిపేట పట్టణంలోని 14వ వార్డులో ప్రజలు, విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. బాబానగర్ కాలనీకి వెళ్లే ప్రధాన దారిలో సరైన సూచిక బోర్డు లేకపోవడంతో కొత్తగా వచ్చే వారికి దారి గుర్తించడం కష్టంగా మారిందన్నారు. అదేవిధంగా గర్ల్స్ హైస్కూల్ సమీపంలో కార్లు, డీసీఎం వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడం వల్ల స్కూల్ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు వాపోయారు.ప్రజల డిమాండ్లు బాబానగర్ కాలనీకి వెళ్లే మార్గంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి.కాలనీ ప్రవేశం వద్ద "బాబానగర్ కాలనీకి స్వాగతం" వెల్కమ్ బోర్డు, కమాన్ ఏర్పాటు చేయాలి.గర్ల్స్ హైస్కూల్ వద్ద వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలి.స్కూల్ బస్సులు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలి.సమస్యలను అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనులకు చేయుతనిచ్చే అండగా ఐటీడీఏ భద్రాచలం

- తల్లిదండ్రులు లేని ఆదివాసీ విద్యార్థికి అండగా ఐటీడీఏ భద్రాచలం
- ఎంబిబిఎస్ చదువుకు ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయం అందజేత

భద్రాచలం/మన ప్రజావాణి (07 సెప్టెంబర్ 26): ములకలపల్లి మండలం, సీతాయిగూడెం గ్రామానికి చెందిన కోయ ఆదివాసీ విద్యార్థి నక్క సంతోష్ తల్లిదండ్రులు లేకపోయినా, తన కష్టంతో చదువుకుని నీట్ లో 424 మార్కులు సాధించాడని, అలాగే కోదాడ మండలం కొత్తగూడెం తండాకి చెందిన భూక్య వాసిని ఎంబిబిఎస్ లో సీట్లు సాధించారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం రోజు తన ఛాంబర్ లో ఎంబిబిఎస్ లో సీట్లు సాధించిన నక్క సంతోష్ కు 60 వేలు, భూక్య వాసినికు 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిన అనంతరం, ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేకపోయినా పట్టుదలతో చదివి, నీట్ లో 424 మార్కులు నక్క సంతోష్, 474 మార్కులు సాధించిన భూక్య వాసిని ఎంబిబిఎస్ లో సీటు సంపాదించిందని అన్నారు. నక్క సంతోష్ ఆర్థిక స్తోమత లేక, ఎంబిబిఎస్ కోర్సు చేయలేకపోతున్నట్లు కొన్ని పత్రిక కథనాల ద్వారా నా దృష్టికి రావడంతో వెంటనే స్పందించి, ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ద్వారా ఆ విద్యార్థి వినిపించిన విషయాలు తెలుసుకొని,వెంటనే ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి 60 వేల రూపాయల చెక్కును,అలాగే కడు పేదరికముతో చదువులో వెనకడుగు వేయకుండా పట్టుదలతో చదివి, ఎంబీబీఎస్ సీటు సంపాదించిన భూక్య వాసినికి ఎంబిబిఎస్ కోర్సు నిమిత్తం 50 వేల రూపాయల చెక్కును అందించడం జరిగిందని ఆయన అన్నారు.ఒక గిరిజన తెగకు చెందిన విద్యార్థిని, విద్యార్థి డాక్టర్ కావాలనే కుతూహలముతో పట్టుదలగా చదివి ఎంబిబిఎస్ లో సీటు సంపాదించడంతో వారి చదువుకు ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని ఆయన అన్నారు. నక్క సంతోష్ ఎంబిబిఎస్ చదువుకు ఆర్థిక సహాయం అందించాలని ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు పిఓ దృష్టికి తీసుకొని వెళ్లగా, ఐటీడీఏ పీవో వెంటనే స్పందించి గంట వ్యవధిలోనే 60 వేల రూపాయల చెక్కును అందించి, పెద గిరిజన విద్యార్థి డాక్టర్ కోర్స్ కు తోడ్పాటు అందించినందుకు ప్రత్యేకంగా ఆదివాసీ సంఘాలు, నాయకులు పలువురు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం కోయ కుల సంఘం పటేల్ తెల్లం రమణయ్య, ఆదివాసీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, పూనెం వీరభద్రం, గుండు శరత్, పాయం రవివర్మ, ముర్ల రమేష్, పూనెం నాగేశ్వరరావు, కొండ్రు వీరస్వామి, కొండ్రు సుధారాణి, కణితి రాధ, మిడియం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 56 ఫిర్యాదులు అందినట్లు అధికారుల వెల్లడి

- ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సెప్టెంబర్ 07 (ప్రజావాణి న్యూస్) కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సోమవారం సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కా ర్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి ఫిర్యాదుదారులు తమసమస్యలను జిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చి వినతిపత్రాలు సమర్పించారు ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతివినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ని రంతరం సమీక్షిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27 ఇతర శాఖలకు సంబంధిం చిన 29 మొత్తం56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి అనంతరం కాలు ష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లాకలె క్టర్ సి.నారాయణ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14న వినాయక చవితి సందర్భం గా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప ర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని సహజ సిద్ధమైన రంగులు పర్యావరణహిత అలంకరణ లను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లాఅదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 420 హామీలను అమలుచేయాలి శాయంపేట గ్రీవెన్స్ సెల్‌లో బీఆర్ఎస్ వినతి పత్రం

ప్రజావాణి శాయంపేట కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం శాయంపేట మండల కేంద్రంలోని గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు.భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల కాలం గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు.రైతులకు రైతు భరోసా, పంట రుణమాఫీ, రైతు కూలీలకు ఆర్థిక సహాయం, మహిళలకు మహాలక్ష్మి పథకం, ఆర్థిక భరోసా, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీలను స్పష్టమైన కాలపరిమితితో అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే శాయంపేట మండలంలోని గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాగునీరు, విద్యుత్, పింఛన్లు, రేషన్, రైతుల సమస్యలు తదితర అంశాలను వినతిపత్రంలో పొందుపరిచి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇచ్చిన హామీలు కేవలం ఎన్నికల హామీలుగా మిగిలిపోకుండా అవసరమైన నిధులు కేటాయించి కార్యాచరణతో అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో బీఆర్ఎస్ గర్జన.. కాంగ్రెస్‌కు హెచ్చరిక!

- ప్రజా గొంతు నొక్కితే.. పోరాటం ఉధృతం చేస్తాం
- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి

ప్రజావాణి మెదక్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 7 మెదక్‌లో చిన్న శంకరంపేట్ బీఆర్ఎస్ గర్జన.. కాంగ్రెస్‌కు హెచ్చరిక!
ప్రజా గొంతు నొక్కితే.. పోరాటం ఉధృతం చేస్తాశీ
పద్మ దేవేందర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని అడ్డుకోలేరు
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుపై భగ్గుమన్న శ్రేణులు.. బస్సు డిపో రోడ్డుపై భారీ రాస్తారోకో
పద్మ దేవేందర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నేతృత్వంలో కదం తొక్కిన బీఆర్ఎస్ శ్రేణులు
మెదక్: ప్రజల సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మెదక్‌లో బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. మెదక్ బస్సు డిపో రోడ్డుపై భారీగా బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అరెస్టు చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం,లవాటి అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పక్షం బాధ్యత అన్నారు. ఆ బాధ్యతను నిర్వర్తించేందుకు అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను ప్రధాన గేటు వద్దే అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితర బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో ప్రజల గొంతును నొక్కలేరని పద్మ దేవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదని, అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం సరికాదన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలను పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ మామిండ్ల ఆంజనేయులు కౌన్సిలర్ గడ్డమీద కృష్ణ గౌడ్ జీవన్ రావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్ చిన్న శంకరంపేట్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లూరి రాజు జిల్లా నాయకుడు సుంకరి కుమార్ గౌడ్ మాజీ సర్పంచ్లు మండల నాయకులు జిల్లా నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు

వెయ్యి రోజుల పాలనలో మిగిలింది మోసమే

మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 07(ప్రజా వాణి)అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా మోసమే మిగిలిందని,ప్రజావాణిలో కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ శ్రేణుల సమరశీల పోరుబాట కొనసాగిస్తారని భారస గార్ల మండల మాజీ అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తెలిపారు.?అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని గొప్పలు చెప్పి, నేటికి వెయ్యి రోజులు పూర్తయినా ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ కదంతొక్కిందన్నారు.రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వహక అధ్యక్షులు కేటీఆర్ పిలుపు,బానోత్ హరిప్రియ దిశానిర్దేశంతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజావాణి కార్యక్రమం హోరెత్తిందన్నారు.ప్రతీ గ్రామం నుండి కదిలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ మోసాన్ని నిలదీస్తూ మండల ప్రజావాణి కేంద్రాలలో వినతిపత్రాలు సమర్పించారు.వంద రోజుల్లోనే పాలన మారుస్తామని,బంగారు తెలంగాణను వెనక్కి నెట్టి అంధకారంలోకి నెట్టేస్తామని చెప్పి నేటికి వెయ్యి రోజులు గడిచినా అమలు నోచుకోని మోసపూరిత వైఖరిని తప్పుబట్టాలి.ఎన్నికల వేళ

ప్రజలకు నూటొక్క రకాల ఆశలు చూపి, అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అర్హులందరికీ నేటికీ అందని ద్రాక్షలా మారిన ఆరు గ్యారెంటీలను బేషరతుగా వర్తింపజేయాలని కోరారు.వివిధ వర్గాల ప్రజలను వంచించడానికి ప్రకటించిన 13 డిక్లరేషన్లను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు.?ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ శంఖారావం ఓట్ల కోసం కోటి ఆశలు చూపి, కాలయాపన చేస్తూ

వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజల తరపున ప్రజావాణి వేదికగా గట్టి హెచ్చరిక జారీ చేయడమైనదన్నారు. కాలయాపన చేస్తూ ప్రజల ఆకాంక్షలను కాలరాస్తున్న ఈ అసమర్థ ప్రభుత్వాన్ని నిద్రలేపేందుకే ఈ దరఖాస్తుల ప్రహసనం చేపట్టాం.ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే వరకు, ప్రజల గొంతుకై బీఆర్ఎస్ పార్టీ అధికార పీఠం వెన్నులో వణుకు పుట్టించేలా పోరాటాలను ఉద్ధృతం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కమిటీ,మండల గ్రామ శాఖ మాజీ అధ్యక్ష కార్యదర్శులు ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం.

- 26 మంది ఉపాధ్యాయులను సన్మానించిన మండల విద్యాధికారి ఎలిజబెత్.

కొండాపూర్, సెప్టెంబర్ 7 (ప్రజావాణి):కొండాపూర్ మండలంలో విద్యారంగానికి విశేష సేవలందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన 26 మంది ఉపాధ్యాయులను మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీమతి ఎలిజబెత్ ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించి, వారి సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంపీడీఓ సౌమ్యశ్రీ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, గజిటెడ్ సంఘం అధ్యక్షుడు సంజీవరావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

వ్యక్తిగత దూషణలకు దిగడం ..

- తాతా మధుపై చర్యలు తీసుకోవాలి
- ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ జుట్టు నాగేష్.

ఇల్లంతకుంట: ప్రజావాణి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ జుట్టు నాగేష్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.ప్రజాప్రతినిధులు హుందాతనాన్ని కాపాడుకోవాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.స్పీకర్‌పై జరిగిన వ్యాఖ్యల పై కేటీఆర్, హరీశ్‌రావు స్పందించి తమ వైఖరిని స్పష్టం చేయాలని జుట్టు నాగేష్ డిమాండ్ చేశారు.

గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలి

- నిర్మాణాల కూల్చివేతపై సమగ్ర విచారణ జరపాలి.
- బాధిత కుటుంబానికి భద్రత, పరిహారం, నివాస హక్కు కల్పించాలనీ కోరుతూ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు వేసిన బాధితుడు

పలాస ప్రజావాణి ప్రతినిధి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఉ జిల్లా మేజిస్ట్రేట్ పీ జీ ఆర్ ఎస్ కార్యక్రమంలో కలిసి, మెలియాపుట్టి మండలం సవర చీపురుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కుటుంబం సవర సోంబురు కుటుంబానికి ఎదురైన ఘటనను స్వయంగా వివరించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించడం జరిగింది.తరతరాలుగా నివసిస్తున్న తమ నివాస స్థలంలోని కాంపౌండ్ వాల్, బాత్‌రూమ్, మరుగుదొడ్డి, ఇతర చిన్న నిర్మాణాలు, పూలు--పండ్ల మొక్కలు ముందస్తు నోటీసు లేకుండా యంత్రము ద్వారా ధ్వంసం చేశారనే ఫిర్యాదుపై పూర్తిస్థాయి, నిష్పక్షపాత దర్యాప్తు జరిపించాలని జిల్లా కలెక్టర్ ను కోరామనీ. బాధితుడు తెలిపారు.నిరుపేద గిరిజన కుటుంబం తన నివాసాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడితే అది కేవలం ఒక కుటుంబ సమస్యగా చూడకూడదు. వారి భద్రత, గౌరవం, జీవన హక్కు, నివాస హక్కులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సున్నితంగా స్పందించాలనీ అన్నారు గిరిజన కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రశ్నిస్తామినీ అలాగే ఈ పోరాటం ఒక్క సవర సోంబురు కుటుంబం కోసం మాత్రమే కాదు రేపు ఏ నిరుపేద గిరిజన కుటుంబానికైనా ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు నిత్యము పోరాడు తామని వారు తెలిపారు.బాధిత కుటుంబానికి అండగా.గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు బాధిత కుటుంబానికి అండగా నిలిచి, జిల్లా కలెక్టర్ కు సమస్యను వివరించారు. సవర నరసింహారావు గిరిజన శక్తి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సవర హరికృష్ణ జిల్లా కార్యదర్శి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి నేత బుగ్గయ్య చౌదరి జన్మదిన వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన బల్లా పల్లవి

అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 07 ప్రజా వాణి టిడిపి రాష్ట్ర కార్యదర్శి టిడిపి సీనియర్ నేత బుగ్గయ్య చౌదరి జన్మదిన వేడుకలు అనంతపురం నగరంలోని ఆయన స్వగృహంలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుగ్గయ్య చౌదరి కేకును కట్ చేసి అందరికీ అందజేశారు. వాటర్ మిలన్ కాయను కట్ చేసి బుగ్గయ్య చౌదరికి చైర్ పర్సన్ బల్లా పల్లవి అందజేశారు. శాలువాతో సత్కరించి బుగ్గయ్య చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుగ్గయ్య చౌదరి టిడిపికి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. 1982 లో నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీకి సేవలు అందజేశారని ఆమె గుర్తు చేశారు. ఎంతోమంది నాయకులు కార్యకర్తలు టిడిపికి సపోర్ట్ చేయడం వల్లే తెలుగుదేశం పార్టీకి 164 సీట్లను 2024 లో గెలిపించారని ఆమె తెలియజేశారు.బర్త్ డే విషెస్ తెలిపిన వారిలో టౌన్ బ్యాంక్ చైర్మన్ జే ఎల్ మురళి,టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మున్సూర్ ,గంగవరం బుజ్జి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తరాదు

- వ్యవసాయ అధికారులు ఈ-పంట నమోదు 100% పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 7 ప్రజా వాణి ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆర్డబ్ల్యూఎస్, డ్వామా, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకూడదని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అన్ని మండలాల ఎంపీడీవోలకు అన్ని సంక్షేమ వసతిగృహాల డిడిలకు సూచించారు. ఎల్ నినో పరిస్థితుల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు పడే అవకాశం లేదన్నారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకొని జిల్లాలో మంచినీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా మంచినీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే సంబంధిత

అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాలు, ఏపీ మోడల్ స్కూల్స్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రెసిడెన్షియల్ పాఠశాలలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మరియు ప్లాంటేషన్ కార్యక్రమానికి సంబంధించి మీకు ఇచ్చిన టార్గెట్ నెల రోజుల లోపల పూర్తి చేయాలన్నారు. వి బి జి రామ్ జి పథకం ద్వారా జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించి జిల్లాకు కేటాయించిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. వివిజి రాంజీ పథకంలో ఎస్సీ ఎస్టీలకు 100% పనులు కల్పించాలన్నారు. ఐ గాట్ కర్మయోగి కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేసేందుకు ప్రతి ఉద్యోగి ఐగాట్ కర్మయోగి కోర్సులు పూర్తి చేసే విధంగా సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో చాలా వరకు పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ఈ విషయాన్ని అన్ని మండలాల మండల వ్యవసాయ శాఖ అధికారులు దృష్టిలో ఉంచుకొని రైతులు వేసిన ప్రతి పంట 100% ఈ పంట నమోదు చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి సాలు రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి శైలజ, ఉద్యానవన శాఖ ఏడి ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం విక్టరీ బోర్డింగ్ స్కూల్లో ఘనంగా మహేష్ స్వేరో జన్మదిన వేడుకలు...

కుప్పం 7 ప్రజావాణి: కుప్పం నియోజవర్గం లోని ,PEC హాస్పిటల్ సమీపంలోని విక్టరీ బోర్డింగ్ స్కూల్ నందు స్వేరోస్ రాష్ట్ర నాయకులు మరియు చిత్తూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు ఎం.మహేష్ స్వేరో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహేష్ స్వేరో జన్మదినం సందర్భంగా,విభిన్న ప్రతిభావంతుల స్కూల్ నందు విక్టరీ బోర్డింగ్ స్కూల్లోని విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం తమ విద్యార్థులకు భోజనం అందించిన మహేష్ స్వేరో ని స్కూల్ యాజమాన్యం శ్రీ గోవిందరాజులు ,స్టాఫ్ పలువురు అభినందించారు.

రైతుల సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 07 ప్రజా వాణి రైతులకు అవసరమైన విద్యుత్ కొనుగోలు చేయడానికి డబ్బులు లేవని అధికారులు చెప్పడం ఆందోళనకరం అని వైసిపి నేత రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని కలెక్టరేట్లో రైతులకు సంబంధించిన సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కలెక్టర్ ఆనంద్ కు వినతి పత్రం సోమవారం అందజేశారు. ప్రస్తుత కరువు, సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.పేరూర్ డ్యామ్‌కు నీరు నింపి, రైతులకు తగినంత విద్యుత్ అందించి, కరువు పరిస్థితుల్లో రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.చాలా సంవత్సరాల తర్వాత రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు చేసే పరిస్థితిని మనం చూస్తున్నాం. రైతులు ఇలా రోడ్డెక్కి తమ సమస్యల కోసం పోరాడాల్సిన పరిస్థితి గతంలో ఎప్పుడూ కనిపించలేదు.మహానేత డాక్టర్ వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ అందించడమే కాకుండా 7 గంటల విద్యుత్‌ను అందించే విధానాన్ని తీసుకొచ్చారు అని ప్రకాష్ రెడ్డి తెలియజేశారు.ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దానిని 9 గంటలకు పెంచారు. కానీ నేడు రైతులకు అవసరమైన విద్యుత్ కూడా అందని పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.రైతుకు పార్టీ ఉండదు. రైతు పండించిన పంట పండితే అది ఏ పార్టీకి చెందిన వారైనా, ఏ కులానికి చెందిన వారైనా, ఏ గ్రామానికి చెందిన వారైనా అందరికీ పండుగే. పంట పండకపోతే మాత్రం ప్రతి రైతు నష్టపోతాడు.ఇప్పటికీ కొంతమేర భూగర్భ జలాలు అందుబాటులో ఉండటంతో సాగు చేసుకోవచ్చని ఆశతో ఉన్న గ్రామాల్లో రైతులు పంటలు వేశారు. అయితే పంటలు వేయవద్దని ప్రభుత్వం మూడు నెలలుగా చెబుతున్నప్పటికీ, ఆ హెచ్చరికలు ఎందుకు సకాలంలో అమలు కాలేదు? ఫిబ్రవరి నెలలోనే దీనిపై తొలి హెచ్చరిక వచ్చినప్పటికీ ప్రభుత్వం ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రాప్తాడు నియోజకవర్గంలోని అతిపెద్ద జలాశయం పేరూరు డ్యామ్‌కు నీరు నింపాలని ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లోనే జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి

చేశాం.రాబోయే రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోయినా పేరూరు డ్యామ్‌ను నింపితే సుమారు 2 టీఎంసీల నీటితో రెండు నుంచి మూడు సంవత్సరాల పాటు రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేయవచ్చు. వర్షాలు రాకపోయినా 40--50 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించవచ్చని,అయితే స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత కి చెప్పినా, కలెక్టర్ కి చెప్పినా, జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పేరూరు డ్యామ్‌కు నీరు నింపే విషయంలో సరైన చర్యలు ఎందుకు తీసుకోలేదు అని ప్రశ్నించారు.కాలువలకు లైనింగ్ చేస్తే భూగర్భ జలాలు ఇంకిపోయే ప్రమాదం ఉందని రైతులు, నిపుణులు హెచ్చరించినా వాటిని పట్టించుకోకుండా కాలువలకు లైనింగ్ పనులు చేపట్టారు.దీని వల్ల జిల్లాలోని రైతులకు అన్యాయం జరిగింది. ముఖ్యంగా హిందూపురం పార్లమెంట్ పరిధిలోని రైతులు కూడా ఈ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు. పీఏబీఆర్ కుడి కాలువ కింద అనంతపురం రూరల్, కుదేరు, ఆత్మకూరు, తాడిమర్రి, ధర్మవరం, కనగానపల్లి మండలాలు ఉన్నాయి. అయితే ఆయా ప్రాంతాలకు అవసరమైన స్థాయిలో నీరు అందిన పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. హెచ్ ఎల్ సి హంద్రీనీవా ద్వారా 16 టీఎంసీలకు మించి నీరు వచ్చిన పరిస్థితి లేదని కలెక్టర్ గారు చెబుతున్నారు.అయితే గతంలో 52 టీఎంసీల నీటిని తీసుకొస్తామని చెప్పిన పెద్దమనుషులు ఆ నీటిని ఎక్కడికి తీసుకొచ్చారు? రిజర్వాయర్లలో ఉందా? చెరువుల్లో ఉందా? అనే విషయాన్ని ప్రజలకు, రైతులకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.అధికారులకు అవగాహన ఉంది. వర్షాలు పడకపోతే పరిస్థితి ఇలాగే ఉంటుందని తెలుసు. మరి అలాంటి పరిస్థితి ఉంటుందని తెలిసి కాలువలకు లైనింగ్ ఎందుకు చేశారు? పేరూరు డ్యామ్‌కు నీరు ఎందుకు నింపలేదు అని ప్రశ్నించారు అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో భూగర్భ జలాల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సబ్‌స్టేషన్ల నుంచి కనీసం 300 వోల్టుల విద్యుత్ రావాల్సిన చోట 100--150 వోల్టులు మాత్రమే వస్తున్నాయి. దీంతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయి.మూడు అంగుళాల నీరు రావాల్సిన చోట అర అంగుళం నీరు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇది సాధారణ సమస్య కాదు. రైతుల జీవనాధారాన్నే దెబ్బతీస్తున్న తీవ్రమైన సంక్షోభం.విద్యుత్ శాఖ అధికారులు, ట్రాన్స్ కో అధికారులు తమకు విద్యుత్ కొరత ఉందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు చేయడం లేదని చెబుతున్నారు. అమరావతి కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి డబ్బులు ఉంటాయి. కానీ రైతులకు విద్యుత్ కొనుగోలు చేసి ఇవ్వడానికి డబ్బులు లేవా అని ప్రకాష్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

వినాయక ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి నిర్వహించాలి: చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ సీఐ కె. రామచంద్ర

పెనుమూరు ప్రజావాణి ప్రతినిధి)సెప్టెంబర్ 7వినాయక చవితి పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, సురక్షిత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ సీఐ కె. రామచంద్ర సూచించారు. పెనుమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి పొందాలని తెలిపారు.గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందేలా నిర్వాహకులు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సీఐ సూచించారు. ఇందుకోసం ganeshutsav.net పోర్టల్‌లో అవసరమైన వివరాలను నమోదు చేసి, సంబంధిత అనుమతులు పొందాలని తెలిపారు.ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రజలకు అసౌకర్యం తలెత్తకుండా నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసు శాఖ సూచించే నిబంధనలు, మార్గదర్శకాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సీఐ కె. రామచంద్ర స్పష్టం చేశారు. పండుగను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి..
ప్రాణాలను కాపాడుకోవాలి

వినూత్న రీతిలో అవగాహన కల్పించిన ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్

సిరిసిల్ల, సెప్టెంబర్ 7:రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా వినూత్న రీతిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చనే సందేశాన్ని అందించారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.“ఒక్కసారి హెల్మెట్ పెట్టుకుంటే మన ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది.. కానీ హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిగే ప్రమాదం జీవితాంతం కుటుంబాన్ని బాధలోకి నెట్టవచ్చు” అని ఎస్ఐ శ్రీనివాస్ ప్రజలకు అవగాహన కల్పించారు.
వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించకుండా, వేగాన్ని నియంత్రిస్తూ, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు ఇతర నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. ముఖ్యంగా యువత రోడ్డు భద్రత విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు.
ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతూ.. అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు నిరంతరం కృషి చేస్తామని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌పై
ఫిక్సింగ్ ఆరోపణలు!

● పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం

మరింత తీవ్ర రూపం

పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆ దేశ ఆటగాళ్లపై ఏకంగా ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంతర్గత విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానస్పదంగా ఉందనే వార్తలు కలకలం సృష్టించాయి.ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ ఘోర పరాజయాల నేపథ్యంలో పీసీబీ కూడా కఠిన చర్యలు తీసుకుంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. దాంతో పాకిస్థాన్ జట్టు అప్రతిష్టపాలై ఇంట బయట తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ ఘోర పరాజయాలకు క్రికెటర్ల వైఫల్యంతో పాటు... ఫిక్సింగ్ కూడా ఓ కారణమని మీడియాలో కథనాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా వేటుకు గురైన ఏడుగురిలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ మొబైల్ డేటాను పీసీబీ స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతుందని పాక్‌కు చెందిన జియో న్యూస్ పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. పీసీబీ అధికారులు.. కేవలం ఆటగాళ్ల ప్రవర్తననే కాకుండా.. వారు సంప్రదించిన వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రావాల్సి ఉన్నప్పటికీ.. రిజ్వాన్, ఇమామ్ భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు రిజ్వాన్, ఇమామ్‌లను ఎంపిక చేయడంపై వివరణ కోరుతూ సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మూడో టెస్ట్ ఆడే ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ వార్తా సంస్థ 365 న్యూస్ పేర్కొంది. మ్యాచ్ ముగిసే వరకు ఆటగాళ్లకు మొబైల్స్ ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు రాసుకొచ్చింది. బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యం పాక్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణ పరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించాడు. ‘ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం. ఈ విషయాలను అంతర్గతంగా సమీక్షిస్తాం. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనల మేరకు విచారణ కొనసాగుతుంది.ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలను విశ్వసించవద్దని కోరుతున్నాం. ప్రస్తుతానికైతే పీసీబీ ఈ వ్యవహారంపై ఎలాంటి కామెంట్ చేయడం లేదు. అభిమానులు, వాటాదారులు అందరూ పీసీబీ నుంచి అధికారికంగా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలి’ అని అమీర్ మీర్ పేర్కొన్నాడు. కానీ ఆటగాళ్ల మొబైల్స్ లాక్కున్నారనే వార్తలపై అతను స్పందించలేదు.

సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్..

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి.హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. శ్రేయాస్ గోపాల్ ఈ జోడీని విడదీసాడు. ఖరేషి(40)ని క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 700 ధాటించాడు. అతనితో పాటు ముఖేష్ కుమార్(0)ను విజయ్ పెవిలియన్ చేర్చి ఈస్ట్ జోన్ భారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో రెండో రోజు ఆట ముగిసింది.

భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది

మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది.గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిపిందే. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు. అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

‘పుష్ప 2’, ‘ధురంధర్’ చిత్రాలను దాటేసిన ‘హనుమాన్ అంశ్’!

బాలీవుడ్‌లో ‘హనుమాన్ అంశ్’ అనే చిన్న చిత్రం సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన ఐదో వారాంతంలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును నెలకొల్పింది. ఈ క్రమంలో ‘పుష్ప 2’ (హిందీ), ‘ధురంధర్’ వంటి భారీ చిత్రాలను సైతం వెనక్కి నెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది.ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా విశాల్ చతుర్వేది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఆగస్టు 7న విడుదలైన ఈ చిత్రం, తొలి రెండు వారాలు సాధారణ వసూళ్లతోనే సరిపెట్టుకుంది. అయితే, మూడో వారం నుంచి సానుకూలమైన ‘మౌత్ టాక్’ లభించడంతో కలెక్షన్ల వర్షం కురిపించింది. ఫలితంగా కేవలం 31 రోజుల్లోనే ఈ చిత్రం రూ. 100 కోట్ల మైలురాయిని అధిగమించింది.తాజాగా, సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు సాగిన ఐదో వారాంతంలో ఈ చిత్రం ఏకంగా రూ. 45.60 కోట్లు రాబట్టింది. ఇప్పటివరకు ఐదో వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో ‘ధురంధర్’ పార్ట్ 1 (రూ. 35.80 కోట్లు), ‘పుష్ప 2’ హిందీ వెర్షన్ (రూ. 14 కోట్లు) ఉన్నాయి. వాటన్నింటి రికార్డులను ‘హనుమాన్ అంశ్’ తుడిచిపెట్టేసింది.ఈ అరుదైన ఫీట్‌తో బాలీవుడ్ వాణిజ్య విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఐదో వారాంతపు వసూళ్లలో దీనిని నంబర్ వన్ చిత్రంగా వారు పేర్కొంటున్నారు. కాగా, ఈ సినిమాను సెప్టెంబర్ 11న ఓవర్సీస్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

తెలుగు హీరోల బిరుదులు.. అభిమానుల మనోభావాలు..
ఫోర్బ్స్ కథనంతో వేడెక్కిన సోషల్ మీడియా!

ప్రముఖ మ్యాగజైన్ ‘ఫోర్బ్స్ ఇండియా’ ఇటీవల ప్రచురించిన ఒక కథనం తెలుగు సినీ అభిమానుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. ‘షోస్టాపర్స్ 2026’ ఫీచర్‌లో కథానాయకుడు అల్లు అర్జున్‌ను ‘రెబల్ స్టార్’ అని సంబోధించడమే ఈ వివాదానికి మూలకారణం. అల్లు అర్జున్‌కు ‘స్టైలిష్ స్టార్’, ‘ఐకాన్ స్టార్’ వంటి బిరుదులు ఉండగా.. ఫోర్బ్స్ పొరపాటున ఈ విధంగా పేర్కొంది. వాస్తవానికి ‘రెబల్ స్టార్’ అనే బిరుదు ప్రభాస్‌కు చెందినది. ఆయన పెదనాన్న, దివంగత నటుడు కృష్ణంరాజు వారసత్వంగా ఈ బిరుదు ప్రభాస్‌కు వచ్చింది. దీంతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అభిమాన హీరో బిరుదును మరొకరికి ఆపాదించడంపై అభ్యంతరం తెలిపారు. అభిమానుల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తడంతో ఫోర్బ్స్ ఇండియా తమ డిజిటల్ కథనాన్ని అప్‌డేట్ చేసి, ‘రెబల్ స్టార్’ స్థానంలో ‘ఐకాన్ స్టార్’ అని మార్చినట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై ఫోర్బ్స్ ఇండియా గానీ, అల్లు అర్జున్ బృందం గానీ అధికారికంగా స్పందించలేదు.ఈ ఘటనపై దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ స్పందిస్తూ.. తెలుగు ప్రేక్షకులు తమ అభిమాన హీరోలకు, వారి బిరుదులకు ఎంతలా కనెక్ట్ అయి ఉంటారో ఈ సంఘటన తెలియజేస్తోందన్నారు. “తెలుగు సినిమా అభిమానులు తమ హీరోల బిరుదులను ఎంతగానో ఇష్టపడతారు. వారిని ఆరాధిస్తారు. వేలాదిగా ఉన్న అభిమాన సంఘాల ద్వారా హీరోలను దేవుళ్లుగా భావిస్తారు. ఈ బిరుదులు వారికి ఒక గర్వాన్ని, గుర్తింపును ఇస్తాయి. అందుకే తమ హీరో పేరుతో ముడిపడిన బిరుదుల విషయంలో చాలా సున్నితంగా ఉంటారు” అని ఆయన విశ్లేషించారు.తెలుగు సినీ పరిశ్రమలో ఈ బిరుదుల సంస్కృతి ఎప్పటినుంచో బలంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి, గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ, కింగ్ నాగార్జున, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ వంటి ఎందరో స్టార్లకు ప్రత్యేకమైన బిరుదులు ఉన్నాయి. పెద్ద సినీ కుటుంబాల నుంచి రాని రవితేజ (మాస్ మహారాజా), రామ్ పోతినేని (ఎనర్జిటిక్ స్టార్) వంటి హీరోలకు కూడా అభిమానులు ఇష్టంగా పిలుచుకునే బిరుదులున్నాయి.“సోషల్ మీడియా యుగంలో ఈ అభిమానం, వాదనలు మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒక హీరోతో బలంగా ముడిపడి ఉన్న బిరుదును మరొకరికి వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి” అని చంద్ర సిద్ధార్థ్ సూచించారు. బాలీవుడ్, మలయాళంలో ఈ తరహా బిరుదుల ట్రెండ్ తక్కువగా ఉన్నా, తమిళ పరిశ్రమలో కొందరు స్టార్లకు ఉందని ఆయన గుర్తుచేశారు.ఈ ట్రెండ్ కేవలం హీరోలకే పరిమితం కాదని, హీరోయిన్లలోనూ పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. “గతంలో ‘లేడీ అమితాబ్’గా విజయశాంతి గుర్తింపు పొందారు. ఇప్పుడు రష్మిక ‘నేషనల్ క్రష్’గా, నయనతార, సమంత ‘లేడీ సూపర్‌స్టార్లు’గా పిలవబడుతున్నారు. భవిష్యత్తులో మరింత మంది నటీమణులు ఇలాంటి ప్రత్యేక బిరుదులు పొందే అవకాశం ఉంది” అని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద ఫోర్బ్స్ చేసిన చిన్న పొరపాటు తెలుగు సినిమా రంగంలో బిరుదులకు, అభిమానుల భావోద్వేగాలకు ఉన్న విడదీయరాని బంధాన్ని మరోసారి స్పష్టం చేసింది.

టైటిల్ సెంటిమెంట్‌తో బాలయ్య ఫ్యాన్స్ సంబరాలు..!

‘వీర సింహా రెడ్డి‘ తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబోలో భారీ అంచనాల నడుమ సినిమా రూపొందుతున్న విషయం తెల్సిందే. ఇన్ని రోజులు చీదీఖ111 అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ జరుపుకున్న ఈ సినిమాకు టైటిల్‌ను కన్ఫర్మ్ చేశారు. దర్శకుడు గోపీచంద్ మలినేని పవర్ ఫుల్ టైటిల్‌ను బాలకృష్ణ మూవీ కోసం ఫైనల్ చేయడంతో పాటు, అభిమానుల ముందుకు తీసుకు వచ్చాడు. బాలకృష్ణ ను ‘దాదా‘ గా చూపించబోతున్నట్లు గ్లిమ్స్ విడుదల చేసి మరీ ప్రకటించారు. బాలకృష్ణ అభిమానులతో పాటు రెగ్యులర్ సినీ ప్రేక్షకులు ‘దాదా‘ టైటిల్ విషయంలో సానుకూలంగా ఉన్నారు. ముఖ్యంగా బాలకృష్ణ వంటి మాస్ ఇమేజ్ ఉన్న హీరోకు ‘దాదా‘ టైటిల్ సరిగ్గా సరిపోతుందనే అభిప్రాయంను ఫ్యాన్స్, ప్రేక్షకులు వ్యక్తం చేస్తున్నారు. కథానుసారంగా దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ సినిమాకు ‘దాదా‘ అయితే అన్ని విధాలుగా బాగుంటుంది అని భావించాడట. బాలకృష్ణ, గోపీచంద్ మలినేని మూవీ ‘దాదా‘... బాలకృష్ణ మూవీకి ‘దాదా‘ అనే టైటిల్‌ను ఖరారు చేయడం పట్ల నందమూరి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో రెండు లెటర్స్ టైటిల్స్‌కి మంచి స్పందన ఉంటుంది. చిరంజీవి కాకా, అల్లు అర్జున్ రాకా సినిమాలతో రాబోతున్నారు. ఇప్పటికే రామ్ చరణ్ ‘పెద్ది‘ సినిమాతో వచ్చి ఆకట్టుకున్న విషయం తెల్సిందే. అందుకే బాలకృష్ణ దాదా టైటిల్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే అభిప్రాయంను ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. పైగా బాలకృష్ణకు రెండు అక్షరాల టైటిల్ సెంటిమెంట్ ఉంది. సింహా సినిమా ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో తెలిసిందే. అలాగే దర్శకుడు గోపీచంద్ మలినేని సైతం రెండు అక్షరాల టైటిల్స్‌తో వచ్చి హిట్ కొట్టాడు. అందులో ఒకటి క్రాక్ కాగా, మరోటి జాట్ మూవీ. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో దాదా సైతం కచ్చితంగా హిట్ అవుతుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. బాలకృష్ణ కోసం పవర్ ఫుల్ టైటిల్.. ‘దాదా‘ టైటిల్‌తో బాలకృష్ణ మరోసారి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం ఖాయం అనే అభిప్రాయంను చిత్ర యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో టైటిల్స్ విషయంలో ఫిల్మ్ మేకర్స్ ఏ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారో తెలిసిందే. అందుకే ఈ టైటిల్ విషయంలోనూ దర్శకుడు గోపీచంద్ మలినేని చాలా ఆలోచించాడు, ఈ టైటిల్‌ను కొన్ని వారాల ముందే అనుకున్నప్పటికీ అభిమానుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అని ఎదురు చూశాడు. టైటిల్‌ను లీక్ చేసి అభిమానుల స్పందన తెలుసుకున్నాడు. దాదాతో పాటు మరికొన్ని టైటిల్స్‌ను సైతం లీక్ చేయడం జరిగింది. అయితే ఎక్కువ శాతం అభిమానులు దాదా టైటిల్‌పై మక్కువ చూపడంతో పాటు, బాలయ్య ఇమేజ్‌కి సరైన టైటిల్ అనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఫైనల్ గా ఈ టైటిల్ వైపు వెళ్లినట్లుగా చిత్ర యూనిట్ సభ్యుల నుంచి సమాచారం అందుతోంది.

మెగాస్టార్‌తో వర్క్ చేయడంపై హీరోయిన్ ఎమోషనల్ స్టేట్‌మెంట్

చిత్ర పరిశ్రమలో ఎవరిని ఎప్పుడు అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. టాలెంట్ ఉండి సరైన అవకాశం కోసం ఎదురుచూసే నటులకు ఒక్కోసారి ఊహించని మెగా ఆఫర్లు తలుపు తడతాయి. మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ విషయంలోనూ సరిగ్గా ఇదే జరిగింది. తెలుగులో కేవలం ఒక్క సినిమాతోనే తన నటనతో అలరించిన ఈ భామ, ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ చిరంజీవితో నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసింది. ఈ సందర్భంగా ఆమె ఇచ్చిన ఎమోషనల్ స్టేట్‌మెంట్ నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు ప్రవేశం నుంచి మెగా లక్కీ ఛాన్స్: రోషన్ హీరోగా తెరకెక్కిన ‘ఛాంపియన్‘ సినిమాతో అనస్వర రాజన్ తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకున్నప్పటికీ, ఆమె సహజ సిద్ధమైన నటనకు టాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. టాలీవుడ్‌లో ఈ చిన్నదానికి మంచి భవిష్యత్తు ఉంటుందని సినీ విశ్లేషకులు భావించారు. అనుకున్నట్లుగానే ఆమెకు తన రెండో ప్రాజెక్ట్‌లోనే ఏకంగా మెగాస్టార్ చిరంజీవి సినిమాలో నటించే అరుదైన అవకాశం లభించింది.

తెలుగు రాష్ట్రాల్లో ‘వారణాసి‘ ప్రీ-బిజినెస్ హవా!

తెలుగు చిత్రసీమ స్థాయిని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి- సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న -వారణాసి- చిత్రం బాక్సాఫీస్ రికార్డులను సృష్టించక ముందే ప్రీ-రిలీజ్ బిజినెస్‌లో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతోంది. గతంలో రాజమౌళి తెరకెక్కించిన -బాహుబలి 2- చిత్రం తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 122 కోట్ల థియేట్రికల్ బిజినెస్ చేయగా.. ఆ తర్వాత వచ్చిన -ఆర్ఆర్ఆర్- చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో (ఆ్రా & ఆ) ఏకంగా 230 కోట్ల మేర ప్రీ-రిలీజ్ బిజినెస్ సాధించి రికార్డు నెలకొల్పింది. అయితే ఇప్పుడు -వారణాసి- చిత్రం ఈ రెండు ఇండస్ట్రీ హిట్లను వెనక్కి నెట్టి.. ప్రీబిజ్‌లో ఎవరూ ఊహించని మైలురాయిని తాకనుందని ట్రేడ్ వర్గాల్లో గుసగుస వినిపిస్తోంది.ఆశ్రీంశీ =ముఒ - ఆ యంగ్ హీరో విషయంలో నటి ఓవరేక్షన్! ప్రస్తుతం ఫిలిం నగర్ వర్గాల విశ్లేషణల ప్రకారం.. -వారణాసి- సినిమా కేవలం ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ థియేట్రికల్ హక్కుల రూపంలోనే ఏకంగా 320 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ జరుపుకుంటున్నట్లు తెలుస్తోంది. -బాహుబలి 2- బిజినెస్‌తో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు కాగా, -ఆర్ఆర్ఆర్- ప్రీ-రిలీజ్ బిజినెస్ కంటే దాదాపు 90 కోట్లు అధికం. తెలుగు సినిమా చరిత్రలోనే కేవలం ఒక ప్రాంతీయ మార్కెట్ నుండి ఈ స్థాయిలో 300 కోట్ల మార్కును దాటి థియేట్రికల్ బిజినెస్ జరగడం నిజంగా ఒక అసాధారణమైన సంచలనంగా విశ్లేషిస్తున్నారు. ఇది రాజమౌళి బ్రాండ్ వాల్యూకు నిదర్శనంగా నిలుస్తోంది.ఈ స్థాయిలో ప్రీ-రిలీజ్ బిజినెస్ హైప్ పెరగడానికి ప్రధాన కారణం మూవీకి ఎంచుకున్న భారీ బడ్జెట్- యూనివర్శల్ కాన్సెప్ట్. దాదాపు 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ అప్పీల్ ఉన్న కథాంశంతో తెరకెక్కిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30కి పైగా భాషల్లో.. 120కి పైగా దేశాల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. -ఆర్ఆర్ఆర్- ఆస్కార్ విజయం తర్వాత రాజమౌళికి అంతర్జాతీయంగా లభించిన గుర్తింపు.. మహేష్ బాబు మార్కెట్ స్థామినా కలవడంతో డిస్ట్రిబ్యూటర్లు ఈ చిత్రంపై ఇంతటి భారీ మొత్తాన్ని వెచ్చించడానికి సిద్ధపడతున్నారు.ఇక నటీనటులు.. పాత్రల పరంగానూ -వారణాసి- ప్రేక్షకుల్లో గొప్ప ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో మహేష్ బాబు రుద్ర, పురాణ పురుషుడు శ్రీరాముడుగా.. రెండు విభిన్నమైన పవర్ ఫుల్ పాత్రల్లో ద్విపాత్రాభినయం చేస్తుండటం గమనార్హం. మహేష్ సరసన గ్లోబల్ నటి ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. మలయాళ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ పవర్‌ఫుల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి స్వరాలు సమకూరుస్తుండటం.. కే.ఎల్. నారాయణ - ఎస్.ఎస్. కార్తికేయలు సంయుక్తంగా నిర్మిస్తుండటం ఈ ప్రాజెక్ట్ రేంజ్‌ను మరింత పెంచాయి.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com